నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
సూర్య 19 వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com
సోమవారం | 2 మార్చి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 132
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం శుక్ల పక్షం, చతుర్దశి సా.5.49, ఆశ్లేష ఉ.7.59, వర్జ్యం రా.7.43 నుంచి 9.17 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.35 నుంచి 1.21 వరకు తిరిగి మ.2.55 నుంచి 3.41 వరకు

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

- ఇరాన్ సుప్రీం ఖమేనీ చనిపోయినా ఆగని దాడులు
- ముందెన్నడూ చూడని బలంతో ప్రతిదాడులు చేస్తామన్న ట్రంప్
- ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు
- అమెరికా, ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరికలు
- నేరస్థులను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న కొత్త సుప్రీం


వివరాలు-6లో

ఇజ్రాయెల్ - అమెరికా, ఇరాన్ దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాలపై పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. అయినా దాడులు మాత్రం కొనసాగుతునే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఇంతకు ముందెన్నడూ చూడని బలంతో ప్రతిదాడులు చేస్తామని ట్రంప్ స్పష్టంచేశారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చిరించింది. ఇరాన్ ఈ రోజు చాలా గట్టిగా దాడి చేయబోతుందని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్లో పోస్ట్ చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా దాడికి సిద్ధమైనట్లు ఇరాన్ ఇప్పుడే ప్రకటించిందని తెలిపారు. అయితే వారు అలా చేయకపోవడమే మంచిదని అన్నారు. ఎందుకంటే వారు అలా చేస్తే ఇంతకు ముందెన్నడూ చూడని శక్తితో మనం వారిపై విరుచుకుపడతామని హెచ్చరించారు.

# అభివృద్ధికి కాంగ్రెస్ స్పీడ్ బ్రేకర్

- ఉత్తమ (బెస్ట్) పుదుచ్చేరి ఈ రాష్ట్రానికి తారక మంత్రం
- పుదుచ్చేరి ప్రజలకు కూడా ప్రయోజనం చేకూర్చేలా నిధులు
- మెరుగైన రోడ్లు, నీటి సరఫరా, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, పాఠశాలలు ఏర్పాటు
- పుదుచ్చేరి పర్యటనలో ప్రధాని నరేంద్రమోడీ


6 లో

పుదుచ్చేరి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ స్పీడ్ బ్రేకర్‌లా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, నేరాలు, పేదరికంతో ప్రజలు బాధపడ్డారని విమర్శించారు. ఇప్పుడు తమ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ పుదుచ్చేరి వృద్ధికి మరింత ఊపుని స్తుందని తెలిపారు. మునుపటి కాంగ్రెస్-డీఎంకే పాలనలో పుదుచ్చేరి ప్రజలు అపారమైన కష్టాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పుదుచ్చేరిలో రాజకీయ అస్థిరత ఏర్పడిందని అన్నారు. అవినీతి ఆరోపణలు, నేరాలు పెరిగిపోయాయని దుయ్యబట్టారు. పేదలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పుదుచ్చేరి జరిగిన ఓ సభలో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

## విదేశాంగ విధానాలు ఫెయిల్

- మోడీ సర్కారు వల్లే భారత్ భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోంది
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించదెందుకు?
- భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనన్న కాంగ్రెస్


6 లో

## రాజకీయాల్లో భాష మారాలి

- యువత రాజకీయాల్లోకి రావాలి
- అటల్‌జీకి అక్షర నిరాజనం' కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉంది
- వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## నేడు రాష్ట్రానికి రాహుల్ గాంధీ
## రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చ!

- వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులకు హాజరవ్వనున్న రాహుల్
- తాజా రాజకీయపరిణామాలు, పార్టీ బోపేతంపై చర్చించే అవకాశం


2 లో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేడు సోమవారం తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే పీఏసీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరవ్వనున్నట్లుగా విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాహుల్గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వికారాబాద్లో జరుగ్నుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల 20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్లో వికారాబాద్కు చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 04.30 వరకు అక్కడి హరిత రిసార్ట్సోనే ఉంటారు.

## దీదీ నుంచి బెంగాల్ విముక్తే మా లక్ష్యం


6 లో

- అక్రమ చొరబాటుదారులకు అండగా మమతా బెనర్జీ
- బీజేపీ చీఫ్ నతిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు

అవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్‌ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన పరిబోర్తన్ (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.

## తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలి

- ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన తీవ్ర యుద్ధ ఉద్రిక్తతలు
- దీంతో ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో యుద్ధవాతావరణం
- అవసరమైతే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటుంది ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచన
- ఇప్పటికే హైదరాబాద్ టూ అరబ్ దేశాల సర్వీసులు నిలిపివేత!

ఇరాన్ తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుందని అన్నారు.


2 లో

## అంతా ఇంతే!



మొన్నటిదాకా బంగారం కొనమంటే ఆలోచించారు ఇప్పుడు చూడండి !

## రక్తదానం ప్రాణదానంతో సమానం


2 లో

- నేటితరం యువత సామాజిక స్పృహతోనే రక్తదానం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఇంకెంత కాలం మోసం

- ఇచ్చిన హామీలు అమలు చేయరా?
- బీసీల రిజర్వేషన్ల సంగతి తేల్చండి
- ఆ తరువాతే ఎన్నికలు నిర్వహించండి
- రిజర్వేషన్లను 42శాతం ఇచ్చిన తర్వాత జడ్పీటీసి, ఎంపీటీసీ ఎన్నికలు జరపాలి
- 14 బీసీ సంఘాల సమావేశంలో బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్


7 లో

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దాని ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత జడ్పిటిసి ఎంపీటీసి ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాలు విజ్ఞప్తి చేశారు. ఈరోజు 14 బీసీ సంఘాలు డాక్టర్ బ్యాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో బీసీ భవన్ నందు సమావేశం ఏర్పాటు చేశారు.

## టెంపుల్ టూరిజం జిల్లాగా ములుగు

- రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళు తోంది
- మల్లూరు దేవాలయాన్నీఅభివృద్ధి చేస్తాం
- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా


2 లో

ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాటు ములుగు జిల్లాను టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లతో కలిసి హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకున్నారు.




# నల్లగొండ జిల్లా టైగర్ జోన్

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి**



తెలంగాణ బ్యూరోప్రతినిధి: దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ స్కూళ్లు పూర్తయితే.. దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపు చూస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం నల్గొండలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో రూ. లక్షల కోట్లు అప్పులు చేసిందని విమర్శించారు. అవి సీమాంధ్ర కాంట్రాక్టర్లకు లాభమయ్యాయని మండిపడ్డారు. హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మునుగోడు నియోజకవర్గమని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గానికి ఎంతో చేయాల్సి ఉందన్నారు.మొట్టమొదటి అడుగు ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణమేనని తెలిపారు. నల్గొండ జిల్లా అంటే రాష్ట్ర రాజకీయాల్లో టైగర్ జోన్ అని అభివర్ణించారు. నల్లగొండ జిల్లా రాష్ట్ర రాజకీయాలను శాసించే జిల్లాతోపాటు పోరాటాల ఖిల్లా అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

- నేటితరం యువత సామాజిక స్పృహతోనే రక్తదానం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో ఎస్ఎస్ఎస్ యువ సేన ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 89వ జయంతి (మార్చి 2న)ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర ఆపరేషన్ల సమయంలో రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడే చిన్న పిల్లలకు ప్రతి నెలా రక్తం ఎక్కించడం వారి జీవనాధారంగా మారిందన్నారు. ఇలాంటి తరుణంలో మనమిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను నిలబెడుతుందన్నారు.రక్తం ఇచ్చేటప్పుడు ఎవరూ కులం, మతం, ప్రాంతం చూడరని.. ఇది మనుషులందరినీ కలిపే గొప్ప మానవత్వమన్నారు. అపోహలు వీడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

# లక్ష్య సాధన కోసం బీసీల ఐక్యత అవసరం

**"మాస్" అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు**



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: లక్ష్యసాధన కోసం బీసీల ఐక్యత అవసరమని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు అన్నారు. ఆదివారం కెమిస్ట్రీ భవన్ నందు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా చైతన్యం చెందితనే భవిష్యత్తులో అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో అగ్ర కులాల ఆధిపత్యం కొనసాగడంతో బీసీలకు రాజకీయంగా తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను రాజకీయంగా చైతన్య పరిచేందుకే మన ఆలోచన సాధన సమితి ని స్థాపించి బీసీలలోని పలు కులాలకు శిక్షణ తరగతులు మేధావులచే ఉపన్యాసాలు ఇప్పించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామ, గ్రామాన బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేసేందుకు మన ఆలోచన సాధన సమితి ప్రయత్నిస్తుందన్నారు. బీసీలను చైతన్యవంతులు చేయడం ఐక్యంగా ముందుకు నడిపించడం మన రాజకీయాలకు అతీతంగా బీసీలను ఐక్యపరచడం ద్వారా హక్కుల సాధన దిశగా ప్రయాణించేందుకే మాస్ పనిచేస్తుందని తెలిపారు. బీసీలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకే గ్రామస్థాయి నుంచి మండలాల వరకు చైతన్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు .బీసీలు ఇప్పుడు తమ హక్కుల కోసం అడిగే స్థాయికి వచ్చారని ఇది శుభ సూచకమని పేర్కొన్నారు. అగ్రకులాల నాయకుల వెనకాల తిరిగే అలవాటు నుండి బీసీలు బయటపడాలని జిహెచ్ఎంసి ఎంపీటీసీ జెడ్పిటిసి ఎంపీ ఎమ్మెల్యే ఎన్నికలలో తమ నాయకత్వాన్ని చాటాలని సూచించారు. పూర్వకాలంలో బీసీలు చక్రం బండికి పరిగెత్తే వారిని-ఇప్పుడు కార్ల వెనకాల పరుగులు తీస్తున్నారు అన్న ధోరణి మారాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, తుమ్మల పెల్లి నారాయణ రజక, కన్న పరశురాం గౌడ్, రామకృష్ణ గౌడ్, పాముకుంట్ల ప్రసాద్,పెదవుర బ్రహ్మయ్య, అనిల్ గౌడ్ అశోక్ గంగపుత్ర, బెల్లీ సోమన్న యాదవ్, కె.రాములు అభి గౌడ్, చింతకింది అరుణ,విజయ్ కుమార్, కృష్ణమూర్తి, కీర్తి నరసయ్య, రమేష్, సిద్దయ్య, శ్రీనివాస్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది భారతీయుల భద్రత ఆందోళనకరం

- గల్ఫ్ యుద్ధ దాడులపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన
- ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులపై తీవ్ర ఖండన




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేయడాన్ని ఎంఐఎం పార్టీ చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు తక్షణమే ఆపాలి డిమాండ్ చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్య అనైతికం, చట్టవిరుద్ధం అని అన్నారు. ఇరాన్‌లో 200 మందికిపైగా మృతి చెందడం బాధాకరమని తెలిపారు. గల్ఫ్‌లోని కోటి మంది భారతీయుల భద్రత ఆందోళనకరం.. ప్రధాని మోడీ స్పందించి వారికి సురక్షితంగా దేశానికి రప్పించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గచ్చిబౌలి పోలీసులు అప్రమత్తమయ్యారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద సైబరాబాద్ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో నగరంలో నిరసన ర్యాలీలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా కాన్సులేట్ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

# తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలి

- ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన తీవ్ర యుద్ధ ఉద్రిక్తతలు
- దీంతో ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో యుద్ధవాతావరణం
- ఇప్పటికే హైదరాబాద్ టూ అరబ్ దేశాల సర్వీసులు నిలిపివేత
- అవసరమైతే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటుంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఇరాన్ తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుందని అన్నారు. ఇరాన్ మరియు ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తున్నదని తెలిపారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఆయా దేశాల్లో ఉన్న భారత ఎంబసీలు, కాన్సులేట్లోనూ సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**హైదరాబాద్‌టూ అరబ్ దేశాల సర్వీసులు నిలిపివేత!**

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా మిడిల్ ఈస్ట్ కంట్రీస్ తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా ఇరాన్ భీకర దాడులకు పాల్పడుతుండటంతో అనేక దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన తీవ్ర యుద్ధ ఉద్రిక్తతలు అంతర్జాతీయ విమానయాన రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా మిడిల్ ఈస్ట్ దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. శంషాబాద్ నుంచి దోహా, అబుదాబి, జెడ్డా, సౌదీ అరేబియాలోని ఇతర ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు తాజాగా రద్దు అయ్యాయి. ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఇప్పటికే మిడిల్ ఈస్ట్ దేశాలకు తమ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం, మొన్న శనివారం ఒక్కరోజే మిడిల్ ఈస్ట్ వ్యాప్తంగా సుమారు 900 నుండి 966 విమాన సర్వీసులు రద్దు కాగా, ఆదివారం నాడు కూడా మరో 716 నుండి 800 పైగా విమానాలు రద్దు అయ్యే అవకాశం ఉంది. భారత విమానయాన రంగంపై కూడా దీని ప్రభావం భారీగా ఉంది. దేశవ్యాప్తంగా శనివారం నాటి 410 రద్దులకు తోడు, ఆదివారం మరో 444 విమానాలు రద్దు కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఇండిగో మరియు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలకు చెందిన సర్వీసులు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. ఈ సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ ) ప్రయాణికుల కోసం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందే తమ విమాన స్థితిని ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించింది. రద్దు అయిన విమానాలకు సంబంధించి పూర్తి రీఫండ్ లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని కోరింది. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరమైతే తప్ప ఈ దేశాలకు ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని డీజీసీఏ స్పష్టం చేసింది.

# టెంపుల్ టూరిజం జిల్లాగా ములుగు

- రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళుతోంది
- మల్లూరు దేవాలయాన్నీ అభివృద్ధి చేస్తాం
- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాటు ములుగు జిల్లాను టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లతో కలిసి హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రేవెల్ల మహేష్, ఆలయ అర్చకులు పూర్ణకుంభం డోలు వాయిద్యాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి మల్లూరు గుట్టలో స్వయంభుగా వెలసిన హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి కుటుంబ సమేతంగా దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల కాలం నుంచి భక్తులు కోరిన కోరికలు తీరుస్తారనే విశ్వాసంతో స్వామి వారిని దర్శించుకున్న భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ములుగు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలు నెలవై ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మేడారం జాతరను అద్భుతంగా 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా అభివృద్ధి చేసుకొని, మహా జాతరను విజయవంతం చేసుకోవడం జరిగిందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర నుండి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని వాటికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి సీతక్క కోరిక మేరకు దేవాలయాన్ని అద్భుతంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తుందని భక్తుల మనోభావాలను అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పి సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్.మహేందర్ జి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈఓ మహేష్, ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ యరంగారి సురేష్, శ్రీ ఉమా చంద్రశేఖర్ స్వామి ఆలయ చైర్మన్ కోలగట్ల నరేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్నకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

**స్వామి వారికి బోనం, మొక్కులు చెల్లించుకున్న మంత్రి**



తెలంగాణ బ్యూరోప్రతినిధిః కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా స్వామివారికి బోనం,పట్నం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గారు.అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కొమురవెల్లి మల్లన్న అంటే ఒక విశ్వాసం ఉగాది వరకు జరుపుకునే కొమురవెల్లి మల్లన్న ఉత్సవాల్లో ఈరోజు మా కుటుంబ సమేతంగా మల్లన్న బోనాలు సమర్పించుకోవడం జరిగింది. మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాలు అవరోధాలు లేకుండా చూడాలని స్వామివారిని వేడుకున్న. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో కొమురవెల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం.. భక్తులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.. ప్రారంభానికి సిద్ధంగా 50 గదులు ఉన్నాయి.. క్యూ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుంది, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది, రవాణా సదుపాయాలు ఉన్నాయి.

కొమురవెల్లి లో యాదాద్రి మాదిరి స్థల సేకరణ చేస్తే ధాతల సహకారంతో రూం లు నిర్మించే అవకాశం కల్పిస్తుంది..కొమురవెల్లి మల్లన్న అంటే బడుగు బలహీన వర్గాలకు అండగా భక్తులకు ఆశీర్వాదం ఇచ్చే దేవుడిగా ప్రసిద్ధి ప్రభుత్వ తరుపున అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం..భారత దేశ భవిష్యత్ నిర్మాణంలో తెలంగాణ నిర్మాణం ఉంటుంది.. విద్య విషయంలో రాజకీయం చేయవద్దని కోరుతున్న..రాజకీయ పార్టీగా మీరు విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ లో ఏమైనా పొరపాటు ఉంటే సవరిస్తూ సూచనలు చేయండి..గత ప్రభుత్వం లో మీరు ఏదైనా కార్యక్రమం చేసినట్టయితే తెలంగాణ విద్య విధానం బాగుపడింది అంటే మీ అంశాలు స్వీకరిస్తాం. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ఆ అంశాన్ని ప్రభుత్వం అమలు చేయదు.. కానీ దురుద్దేశపూర్వకంగా అన్ని అంశాలకు విమర్శిస్తే అంటే పొరపాటు. విద్యా కమిషన్ రిపోర్ట్ లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని చెప్పడాని నేను స్వాగతిస్తున్న. ఒక వేళ విద్యార్థి సంఘ ఎన్నికలు లేకపోతే పొన్నం ప్రభాకర్ మొదటి జనరేషన్ లో రాజకీయాల్లోకి వచ్చేదే కాదు. నాలాంటి అనేక మంది రాజకీయాల్లోకి రావాలనుకునే విద్యార్థులకు వేదిక లేక విద్యార్థి సంఘాల ఎన్నికలు లేక విద్యావంతులు రాజకీయాలు లేక ఇబ్బందులు వస్తున్నాయి.. విద్యా కమిషన్ సూచనలు రాబోయే క్యాబినెట్ లో ముఖ్యమంత్రి గారికి ఇతర మంత్రులకు వివరించి విద్యార్థి సంఘ నాయకుడిగా యూనివర్సిటీ మాదిరిగా ఎన్నికలు నిర్వహించండి. నేను ఎస్ఆర్ఆర్ కాలేజీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్నికలు జరిగాయి. గతంలో విద్యార్థి సంఘాల దర్శన వల్ల ఎన్టీఆర్ హయాంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు అయ్యాయి దానిని బూచిగా చూపెట్టి విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేశారు. విద్యాలయాల సమస్యలు విద్యార్థి ఎన్నికలు జరిగినట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం చేయడానికి బాగుంటుంది విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని గతంలో అనేక సార్లు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయా. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎన్నికలు జరిగే విధంగా వచ్చే క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటాం తెలంగాణ రాష్ట్రంలో విద్య వంతులు అయిన నూతన నాయకత్వం వస్తుంది.

నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 40 శాతం మంది కేబినెట్ మంత్రులు విద్యార్థి సంఘాల నుండి వచ్చిన వారే ఉన్నారు.విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే వారికి విశేషమైన అనుభవం ఉంటుంది.. ఆలోచన విధానం ఉంటుంది.. విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహించాలనే అంశాన్ని బలపరుస్తున్న అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**నేడు రాష్టానికి రాహుల్ గాంధీ**

# రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చ!

- వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులకు హాజరుకానున్న రాహుల్
- తాజా రాజకీయపరిణామాలు, పార్టీబోపేతంపై చర్చించే అవకాశం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేడు సోమవారం తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే పీఏసీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరవ్వనున్నట్లుగా విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాహుల్గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వికారాబాద్లో జరుగ్నుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల 20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్లో వికారాబాద్కు చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 04.30 వరకు అక్కడి హరిత రిసార్ట్స్‌నే ఉంటారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలు సహా రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల వనం వీడి జనంలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రాహుల్గాంధీ సమావేశం అయ్యే అవకాశం ఉంది. అనంతరం సాయంత్రం 5 గంటలకు తిరిగి దిల్లీ బయలుదేరనున్నారు.

**కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం :** రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం కానుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క పాల్గొననున్న ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చిస్తారు. రాజ్యసభ సీట్ల కోసం పోటీ పడుతున్న నాయకుల గురించి చర్చించే క్రమంలోనే సామాజిక సమీకరణాలు, విధేయత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటివరకు ఏయే సామాజిక వర్గాలకు ఏయే పదవులు పొందారనే అంశంతోపాటు పార్టీ కోసం కమిట్మెంట్తో పని చేస్తూ ఎలాంటి పదవులు పొందని నాయకులు ఎవరెవరు ఉన్నారనే విషయాలను పరిశీలించి ఏ సామాజిక వర్గాలు పదవులకు దూరంగా ఉన్నాయి. తదితర అంశాలపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. రేపు రాహుల్గాంధీ పర్యటన నేపథ్యంలో పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**డీసీసీ అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం :** వికారాబాద్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షులకు పదిరోజుల శిక్షణ కార్యక్రమం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భాంగా పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో నాయకత్వ నైపుణ్యాలు, ఎన్నికల వ్యూహాలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను అందిస్తున్నారు.

**గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుంది :** కాగా, డీసీసీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్ రెడ్డి పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని సూచించారు. అలాంటి వాటిని వదిలేసి ప్రజల తరపున పోరాడినట్లయితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అన్నారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందని చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సీఎం ప్రజావాణి

- రెండేళ్లు పూర్తి చేసుకున్న సీఎం ప్రజావాణి
- ఇప్పటికే సక్సెస్ రేటు 74 శాతం
- రానున్న రోజుల్లో పరిష్కార శాతాన్ని మరింత మెరుగు పర్చేందుకు కృషి
- సీఎం ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ముఖ్యమంత్రి ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతుండడంతో రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు భారీ ఎత్తున రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణికి తరలివస్తున్నారు. రెండు సంవత్సరాల ఒక నెల క్రితం ప్రారంభమైన సీఎం ప్రజావాణి ప్రతి వారంలో మంగళ శుక్రవారాలలో జరిగే ఈ కార్యక్రమం ఇప్పటివరకు 24 సెషన్స్ పూర్తి చేసుకుంది. రెండేళ్ల కాలంలో సీఎం ప్రజావాణిలో మొత్తం ఒక లక్షా 12 వేల 245 దరఖాస్తులు నమోదు కాగా అందులో 64 వేల 558 దరఖాస్తులు పరిగణలోకి తీసుకొని 47 వేల 935 దరఖాస్తులు పరిష్కరించారు. మిగతా 47, 687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాల్సినవి కావడం, ఉద్యోగాల కోసం సంబంధించినవి ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని కోరుతూ సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు. సీఎం ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల పరిష్కారం 74% శాతం మేరకు ఉండడంతో ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. సీఎం ప్రజావాణి పై ప్రజల్లో భరోసా పెరిగింది దీంతో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాలలో సుమారు వేయి దరఖాస్తులు నమోదు అవుతున్నాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సీఎం ప్రజావాణి ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఆదివారానికి రెండేళ్లు పూర్తి అవుతోంది. సీఎం ప్రజావాణికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు స్వయంగా స్వీకరించి ఓపికతో సమస్యలు విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్లో మాట్లాడి దరఖాస్తుపై ఎండార్స్మెంట్ చేసి చిన్నారెడ్డి స్వయంగా స్టాంప్ వేస్తుండడం విశేషం. ఈ ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది. నిరంతరం వారంలో రెండు రోజులు ఇదే తరహా ప్రక్రియతో పాటు ప్రతి దరఖాస్తు ఆన్లైన్లో ద్వారా సంబంధిత శాఖకు సిఫార్సు చేస్తుండడం వల్ల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయి.గల్ఫ్ లోని ఏడు దేశాలు సహా ఇతర దేశాలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని కూడా ఈ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు రాసి ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్, ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు, వైద్య సహాయం కోసం మెడికల్ క్యాంపు, వృద్ధులు దివ్యాంగుల రవాణా కోసం బ్యాటరీ బగ్గి, వీల్ చైర్స్, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, ప్రజలకు మంచినీటి సౌకర్యం, జీ.హెచ్.ఎం.సీ. ఆర్థిక సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ఐదు రూపాయల భోజనం వంటివి సీఎం ప్రజావాణిలో కల్పించారు.సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ కూడా ఎంతో ఓపికతో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించడం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ గ్రూపుల పరీక్షలు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రిక్రూట్మెంట్ లలో జాప్యం, ఫలితాల విడుదల వంటి అంశాలు, రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రజల ఆరోగ్య సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు, ఆర్టీసీ కార్మికులు, గల్ఫ్ కార్మికుల సమస్యలు వంటి అనేక అంశాలు సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి ద్వారా పరిష్కారమవుతున్నాయి. సీఎం ప్రజావాణి సక్సెస్ కార్యమాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐ. ఏ. ఎస్., గ్రూప్ -1 అధికారులు పరిశీలించారు. సీఎం ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో డాక్టర్ జీ. చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందు వల్ల పరిష్కార శాతం 74 శాతం ఉంది. రానున్న రోజుల్లో పరిష్కార శాతాన్ని మరింత మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.




## కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**● దేవాలయాలు, టూరిజం, కల్చర్‌తో కూడిన యాక్షన్ ప్లాన్ రూపొందించండి ● తెలంగాణ రాష్ట్రం అంటేనే ఆత్మ కళలకు ప్రతీక ● ఎల్బీ స్టేడియంలో ఘనంగా రామదాసు జయంతి ఉత్సవాలు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు, ఆ కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రామదాసు జయంతి ఉత్సవాలలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారు, ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో, కీర్తనలతో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆయన కట్టిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. చైతన్యానికి కళలే ఆయువుపట్టని అన్నారు. తెలంగాణ గ్రామాల్లోని ప్రతి సమస్యకు కళారూపాల ద్వారానే పరిష్కారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన చరిత్ర మనదని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. కేవలం వినోదం కోసమే కాకుండా, ప్రజలను జాగృతం చేసేందుకు కళలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన ఆలయాలను కలుపుతూ.. పర్యాటకం, సంస్కృతి మేళవించిన ఒక ప్రత్యేక 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీని ఆయన ఆదేశించారు. కళల పట్ల ప్రజలకు ఉన్న మక్కువ చూస్తుంటే సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

**రేషన్ తీసుకోక పోతే**

## మీ కార్డు కట్

**● రేషన్ షాపుల వారీగా వివరాల సేకరణ ● ఇప్పటికే లెక్కలు తీస్తున్న అధికారులు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రతి నెలా తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే సన్న బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆయా కార్డుల వివరాలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టారు. అసలు ఎందుకిలా జరుగుతుందనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఒకవేళ అనర్హులను గుర్తిస్తే వారి రేషన్ కార్డు రద్దు చేయనున్నారు. ఒకవేళ అర్హులకే సమస్యలుంటే నేరుగా పరిష్కరిస్తారు. రేషన్ లబ్ధిదారుల్లో వరుసగా గత ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మండల తహసీల్దార్ ఆఫీస్ లాగిన్‌కు సిబ్బంది పంపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ చేయనున్నారు. కార్డుదారులు స్థానికంగా ఉన్నారా? లేదా ఇతర ప్రాంతానికి వలస వెళ్లారా? ఒకవేళ అనర్హులుగా ఉన్నారా అనేటువంటి వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. ఎందుకు తీసుకోవడం లేదని ఆరా : ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి రేషన్ కార్డును అధికారులు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షల కొత్త కార్డులను మంజూరు చేసింది. పాత రేషన్ కార్డుల్లోనూ పేర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో లక్షల సంఖ్యలో రేషన్ కార్డులను కొత్తగా పొందారు. అయితే వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకునేందుకు రావట్లేదు. దీనికి అసలు కారణాలేమిటో గుర్తించాలని అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వరుసగా ఆరు నెలలుగా రేషన్ బియ్యం తీసుకోకుంటే, ఎందుకో ఆరా తీయాలని అధికారులకు సూచించింది. అర్హులకు సమస్యలున్నా పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**విచారణ చేయకుండానే మంజూరు చేశారు**

గతంలో పలు దరఖాస్తులపై ఆర్‌ఐలతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించలేదనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. కొన్ని మండలాల్లో ఒక్కో కార్డుకు రూ.2 వేల వరకు అధికారులు వసూలు చేశారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. దీంతో పలువురు అనర్హులు రేషన్ కార్డులను పొందినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేస్తే అనర్హుల లెక్క మొత్తం తేలనుంది. పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యం తెచ్చుకోవడం. వాటిని 10 రూపాయలకో, 20 రూపాయలకో అమ్ముకోవడం, ఆ తర్వాత దుకాణానికి వెళ్లి సన్నబియ్యం కొనుగోలు చేయడం. చాలా మంది లబ్ధిదారులు చేస్తున్న పని సాధారణంగా ఇదే జరుగుతుంది. అయితే, ఈ చర్యలవల్ల జనం ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో అద్భుతమైన పోషకాలు ఉన్నాయని, ఈ విషయం తెలియక వాటిని ఇలా దుకాణాల్లో అమ్ముతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మీ ఇంట్లో పోషకాహార లోపం**

దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోషకాహార లోపం ఒకటి. పిల్లల నుంచి పెద్దల వరకు దీనిబారిన పడుతున్నారు. వయసుకు తగిన బరువు లేకపోవడం కొందరి సమస్యకాగా తగినంత ఎత్తులేకపోవడం ఇంకా కొందరి సమస్య. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలోని ఐదేళ్లలోపు పిల్లల్లో 32 శాతం మంది వయసుకు తగ్గ బరువు ఉండటం లేదు. 35 శాతం మంది వయసుకు తగిన ఎత్తులేరు.

# 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'కు సర్కార్ సిద్ధం

**● మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహణ ● మొత్తం 99 రోజుల పాటు కార్యక్రమం**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు మరింత చేరువ చేసే సంకల్పంతో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తెలిసిందే. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పౌర సేవలను ఇంటివద్ద నుంచే వినియోగించుకునేలా సంస్కరణలు చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు ఉన్న పెరీ అర్బన్ రీజియన్‌లో విస్తరించే మానుఫ్యాక్చరింగ్ రంగం దేశానికే ఆదర్శంగా నిలవనుందని సీఎం వెల్లడించారు.మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఎం వివరించారు. సచివాలయంలో సీఎస్, డీజీపీ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమానికి అవసరమైన ప్రణాళికను, ప్రత్యేక లోగోను, 99 రోజుల కార్యక్రమాల షెడ్యూలును రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 99 రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్‌తో పాటు అన్ని కార్యాలయాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలని నిర్దేశించారు.

**ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక :** 99 రోజుల కార్యక్రమం అమలులో అధికారుల పనితీరులో లోపాలను సహించబోనని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక అని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం, అమల్లోకి తెచ్చిన ప్రతి పాలసీ విజయం, వైఫల్యం వారిపై ఉన్నట్లు తేల్చిచెప్పారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారానే అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తేవాలని సీఎం సూచించారు. కరెంట్ మీటర్, ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ మొదలు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా పనులు జరగాలన్నారు. ఏ ఫైలు, ఏ అర్జీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే విధానం ఉండాలన్నారు.

సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ జయేశ్రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 3 వారాల్లో కమిటీ తన నివేదికను అందించాలని నిర్దేశించారు. ప్రతి విభాగం ఈ-ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని, అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్లను వచ్చే 20 ఏళ్లకు సరిపడేలా అప్డేట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ అర్హులైన వారందరికీ చేరాలన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి అందించాలన్నారు. రేషన్ కార్డులు అప్లై చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని రేవంత్ రెడ్డి నిర్దేశించారు.

**మానుఫ్యాక్చరింగ్ జోన్‌గా :** దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో పని చేయాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీకి అవసరమైన మానుఫ్యాక్చరింగ్ జోన్‌గా భవిష్యత్తులో కీలకంగా మారుతుందన్నారు. దాదాపు 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించే మాన్యుఫాక్చరింగ్ రంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. 100 మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు.

ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేయటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని విభాగాల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల డేటా కార్యదర్శుల వద్ద సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలులేదని తేల్చిచెప్పిన సీఎం, ప్రతి శాఖకు సొంత భవనం ఉండేలా బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు రాబట్టుకునేలా ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌తో పాటు వరల్డ్ ఎకనామిక్ ఫోరం, విదేశీ పర్యటనల్లో కుదిరిన ఒప్పందాలన్నీ ఫలవంతమయ్యేలా కార్యదర్శులు సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన రెండేళ్ల 9 నెలలకు సరైన దిశా నిర్దేశంతో కార్యాచరణ రూపొందించుకోవాలని రేవంత్ రెడ్డి అన్నారు.

## సమాచార లోపంతోనే శారదా పీఠం భూములపై గందరగోళం

**● పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునేందుకు మాకెలాంటి భేషజాలు లేవు ● మతాన్ని అడ్డు పెట్టుకొని మాపై ప్రతిపక్షాల దుష్ప్రచారం ● పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ప్రభుత్వం ● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో సమాచార లోపం వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేట్ లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి... అక్కడి రాజ శ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. మా ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మతాన్ని అడ్డు పెట్టుకొని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరూ మాపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపు ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.



## తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు

**ఆర్టీసీ నియామకానికి, ఆర్టీసీకి ఎలాంటి సంబంధం లేదు : మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ బ్యూరోప్రతినిధిః రోడ్డు రవాణా శాఖ పై తప్పుడు ప్రచారాలు చేస్తే లీగల్ చర్యలు తప్పవని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ నియామకానికి ఆర్టీసీకి ఎలాంటి సంబంధం ఉండదు. ఆర్టీసీ నియామకాలు పోలీసు రిక్రూట్మెంట్ సెల్ పరిధిలో చేపట్టడం జరుగుతుంది. డ్రైవర్ కు 6 అడుగులు అనే తప్పుడు ప్రచారం సరికాదు. డ్రైవర్ 5.3 అడుగులు(160 సెంటిమీటర్లు). టికెట్ యాప్ లో ఎలాంటి సమస్యలు లేవు. తప్పుడు ప్రచారాలు మనుకోకపోతే చర్యలు తప్పవు అని మంత్రి పొన్నం హెచ్చరించారు.

**తెలంగాణ వారిని స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు తీసుకుంటాం..**

ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడుల ప్రభావం, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడ ఉన్న భారత ప్రజలకు ,తెలంగాణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత భారత ప్రభుత్వం ది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గల్ఫ్ దేశాల్లో అనేక మంది భారతీయులు తెలంగాణ వారు ఉన్నారు ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో అక్కడ ఉన్న వారు సురక్షితంగా ఉండాలి..గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వారికి ఇబ్బందులు ఉంటే తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి.. గల్ఫ్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటుండడం మిసైల్ దాడుల భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణ వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది.. ప్రజలు భయాందోళన చెందవద్దు. అప్రమత్తంగా ఉండాలి. దాడులు అధికంగా జరుగుతున్న గల్ఫ్ ప్రాంతాల్లో అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ ఉన్న తెలంగాణ వారిని స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం తెలిపారు.

# మహా జాతరను విజయవంతం చేశాం

**● అభివృద్ధి పనులు అనేవి నిరంతర ప్రక్రియ ● 200 సంవత్సరాలు నిలిచిపోయేలా పనులు చేశాం ● పూర్తికాని 5 శాతం పనులను వెంటనే పూర్తి చేయాలి ● బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి ● రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



గత నెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగిన మేడారం మహా జాతర విజయవంతం కావడానికి అందరం పట్టుదలతో పనిచేయడం వల్లే విజయవంతమైందని, మేడారంలో భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయం నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం నకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క లకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, తదితరులు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క లు వన దేవతలను దర్శించుకున్నారు.మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్ద రాజు దేవతల గద్దెల చుట్టూ రాతి నిర్మాణాన్ని, ఆలయ చుట్టూ ప్రకారం , ప్రధాన అర్చిలను, ప్రహరీ సాండ్ స్టోన్ చిత్రాలను, చుట్టూ డ్రైనేజీ, మీడియా టవర్ లను, గద్దెల చుట్టూ ఉన్నా గ్రిల్స్ లను ఆలయ ఫ్లోరింగ్ ను కూలంకషంగా పరిశీలించారు.

అనంతరం వాహనం లో జంపన్న వాగు, హరిత,ఊరట్టం, చిలకల గుట్ట, ఆర్ టి సి జంక్షన్ లను కూలంకషంగా పరిశీలించారు.అనంతరం మంత్రులు మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత జిల్లా అధికారులతో , మేడారం జాతర అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాఖల వారిగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మేడారంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి నిత్యం భక్తులు వివిధ ప్రాంతాల నుండి చేరుకుంటున్నారని, సెలవు రోజులలో లక్షలాదిమంది భక్తులు అమ్మవార్ల దర్శన భాగ్యం కోసం చేరుకుంటున్నారని అన్నారు. మేడారం చేరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఆలయ ప్రాంతంలో చేపట్టిన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గుత్తేదారులకు ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పట్టుదలతో ఈ జాతరను ఎన్నడు లేని విధంగా విజయవంతం చేయాలన్న సంకల్పంతో 251 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ప్రధాన ద్వారం తో పాటు గద్దెల ప్రాంతం చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏర్పాట్లు చేశామని, 2 వందల సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా పనులు చేయడం జరిగిందని వివరించారు. మహా జాతరకు వచ్చిన భక్తులకు త్రాగునీరు ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నివాస స్థలాలు ఏర్పాటు చేసి అధికారులు విజయవంతం చేశారని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం చెప్పుకోదగ్గ విషయమని అధికారులను అభినందించారు. జాతరకు ముందే 95 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగతా ఐదు శాతం పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ప్రకారం ఆలయం పునర్నిర్మాణం చేయడం జరిగిందని, భవిష్యత్తు తరాలకు 200 సంవత్సరాల వరకు ఎంత మంది భక్తులు వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావాల్సిన వసతులను రోడ్ల విస్తరణ నివాసయోగ్యం ఇతర వసతులు కల్పించడం జరిగిందని, అమ్మవార్ల గద్దెలు, ఆలయ ప్రకారం, ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రపంచం మొత్తం జాతర వైపు చూసిందని పేర్కొన్నారు.

భక్తుల రద్దీ దృష్ట్యా మిగిలిన పనులను త్వరలోనే నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తిస్థాయిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం ప్రాంతంలో ఉన్న రెండు చెరువులను సుందరీకరించాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించే విధంగా చెక్ డాం ల నిర్మాణానికి ప్రణాళికల సిద్ధం చేయాలని, రహదారులకు ఇరువైపులా ప్లాంటేషన్ చేయాలని అన్నారు.

భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి శాశ్వత ప్రతిపాదికన త్రాగునీరు మరుగుదొడ్లు మౌలిక వసతులు కల్పించాలని, జాతర సమయంలో దెబ్బతిన్న చిన్నచిన్న పనులను ఆలయ ఫ్లోరింగ్ డ్రైనేజీ వ్యవస్థ లోపాలను గుర్తించి వాటిని వెంటనే సరి చేయాలని ఆదేశించారు.అనంతరం మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా జాతర అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని, జాతర అనంతరం కూడా అధికారులకు మరింత బాధ్యత పెరిగిందని మనసా వాచా కర్మణా మిగిలిన పనులను పూర్తి చేయాలని అన్నారు.

మేడారం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం ప్రజా ప్రభుత్వం రెండవ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం జరుగుతుందని దానిలో భాగంగా మేడారం ప్రాంతంలోని రెండు చెరువులను అభివృద్ధి చేయడం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్,



మీడియా భవన్ వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జాతర విజయవంతంలో అధికారులు చేసిన కృషి ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవార్ల శక్తిని గ్రహించి ప్రతి పని విషయంలో చొరవ చూపారని, ఏకంగా క్యాబినెట్ సమావేశం నిర్వహించి అమ్మవార్ల భక్తి చాటారని అన్నారు. నిత్యం తరలివస్తున్న భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ 2026 మేడారం మహా జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని విజయవంతానికి కృషి చేసిన అధికారులు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగు రోజులు పాటు జరిగిన మహా జాతరకు 1 కోటి 55 లక్షల మంది భక్తులు రావడం జరిగిందని, భవిష్యత్ తరాలకు 200 సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఆలయం పునరుద్ధరణ చేయడం జరిగిందని భక్తుల రద్దీ కారణంగా మిగిలిన సూక్ష్మ పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సూచన మేరకు జంపన్న వాగులో 365 రోజులు నీరు ఉండే విధంగా గోదావరి నది జలాలను జంపన్న వాగుకు మళ్ళించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించడానికి రెండు నుంచి మూడు మీటర్ల ఎత్తు నీరు నిల్వ ఉండే విధంగా జంపన్న వాగుపై ఐదు చెక్ డాం ల నిర్మాణాలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, మేడారం ప్రాంతంలో ఉన్న రెండు చెరువులను సుందరీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.

బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉన్న దేవాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ జాతర విజయవంతానికి తోడ్పడిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గార్లకు , కృషిచేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతర అనంతరం మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. జాతర నిర్వహణలో జరిగిన అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ డ బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ , జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మునిసిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, ఈ ఓ వీరస్వామి, పూజారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
అక్షరం
4 సోమవారం 2 మార్చి 2026
suryaeditpage@gmail.com

# పౌండ్రక వాసుదేవుడి చావు, హస్తినను గంగలో తోసే ప్రయత్నం

## శ్రీ మహాభాగవత కథ-75



వనం జ్వాలా నరసింహారావు
80081 37012

**కం॥ చదివెడిది భాగవతమిది,
చదివించును కృష్ణు, డమృతఝరి పోతనయున్
చదివినను ముక్తి కలుగును,
చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**



పౌండ్రక వాసుదేవుడనే కరూశ దేశాధిపతి శ్రీకృష్ణుడి మీద అకారణంగా ద్వేషాన్ని పెంచుకున్నాడు. ఆ ద్వేషం పగగా మారింది. శ్రీకృష్ణుడిని జయించాలనే కోరిక పెరిగింది. తనకొక్కడికే భూమ్మీద 'వాసుదేవుడు' అన్న పేరుండాలి కాని మరెవ్వరికీ వుండకూడదని నిశ్చయించుకుని, తన దూతను పిలిచి, కృష్ణుడి దగ్గరికి పంపాడు. ఆయన తనను తాను వాసుదేవుడు అని పిచుకోవడం తప్పని చెప్పమన్నాడు దూతకు. దూత శ్రీకృష్ణుడున్న ద్వారకానగారానికి పోయి, ఆయన సభలో వున్నప్పుడు, రాజు తనకు చెప్పి పంపిన మాటఅప్పచెప్పాడు. 'సిగ్గు లేకుండా తన పేరు పెట్టుకుని కృష్ణుడు ఎలా వ్యవహరిస్తున్నాడని' తన రాజైన పౌండ్రక వాసుదేవుడన్న వ్యాఖ్యవినిపించాడు. గోవుమేపుకునే గోపాడికి తనతోటి పంతం ఎందుకని అన్నట్లు కూడా చెప్పాడు దూత. తన ఘనతను తుకుని తనని సేవించక పోతే యుద్ధరంగంలో తనను ఎదుర్కోవాల్సి వస్తుందనీ, అప్పుడు తన ప్రతాపం ఏమిటో త్తుందనీ పౌండ్రక వాసుదేవుడు హెచ్చరించినట్లు దూత చెప్పాడు శ్రీకృష్ణుడికి. తాను పౌండ్రక వాసుదేవుడికి ఇష్టం లేని శంఖచక్రాది చిహ్నాలను ధరించి వెంటనే యుద్ధానికి వస్తున్నట్లు ఆయనకు చెప్పమని దూతతో అన్నాడు కృష్ణుడు. ఘోర రణంలో వాడిని కుప్పకూల్తానని కూడా చెప్పమన్నాడు. ఈ మాటలకు పౌండ్రక వాసుదేవుడి దూత ఉలిక్కి పడ్డాడు. భయపడ్డాడు. తన రాజు దగ్గరికి పోయి జరిగినదంతా చెప్పాడు. దానితో పౌండ్రక వాసుదేవుడికి కృష్ణుడంటే పగ మరింత పెరిగింది. కృష్ణుడు పౌండ్రక వాసుదేవుడి మీదకు పరమోత్సాహంగా దండయాత్రకు బయల్దేరాడు. అతి వేగంగా కాశీనగరానికి చేరుకున్నాడు. పౌండ్రక వాసుదేవుడు కూడా రణోత్సాహంతో యుద్ధరంగానికి వచ్చాడు. ఆయన మిత్రుడు కాశీరాజు ఆయనకు సహాయంగా తన సైన్యాన్ని తీసుకుని వచ్చాడు.

కృత్రిమమైన శంఖం, చక్రం, గద, శార్ఙ్గం, కౌస్తుభమణితో పౌండ్రక వాసుదేవుడు యుద్ధానికి వచ్చాడు. వాడిని తేరిపార చూశాడు కృష్ణుడు. వాడి వేషం చూసి కృష్ణుడు నవ్వడంతో పౌండ్రక వాసుదేవుడికి కోపం వచ్చింది. ధనుర్బాణాధరించి కృష్ణుడిమీద బాణాకురిపించాడు. ఆయుధం వెంట ఆయుధాన్ని ప్రయోగించాడు. ఆ ఆయుధాలన్నిటినీ తుంచివేశాడు కృష్ణుడు. తన పాంచజన్యాన్ని పూరించాడు. సమస్త శత్రు సైన్యాన్ని హతం చేశాడు కృష్ణుడు. శ్రీకృష్ణ పౌండ్రకుల ఘోర సంగ్రామంలో రక్తం ప్రవాహం కట్టింది. పౌండ్రకుడిని తీవ్రంగా హెచ్చరిస్తూ, వాడి రథాన్ని విరగ గొట్టాడు కృష్ణుడు. సుదర్శన చక్రంతో పౌండ్రకుడిని సంహరించాడు. అంతటితో ఆగకుండా కాశీరాజును కూడా చంపాడు. వాడి తలను కాశీపట్టణంలో పడేట్లు కొట్టాడు.

పౌండ్రక వాసుదేవుడు శ్రీకృష్ణ పరమాత్మ ధరించే శంఖచక్రాది చిహ్నంధరించి, అతడిమీద కోపంతో అనుక్షణం త్తూ వుండడం వల్ల మోక్షసామ్రాజ్యాన్ని పొందగలిగాడు.

యుద్ధరంగంలో ఇలా జరుగుతే, అక్కడ కాశీనగరంలో పడిన తలను చూసి కాశీపతి పత్నులంతా దుఃఖించారు. కాశీరాజు కుమారుడు సుదక్షిణుడు శ్రీకృష్ణుడిని సంహరించడానికి ఉపాయం వెతక సాగాడు. పరమేశ్వరుడిని పూజించగా శంకరుడు అతడి పట్ల కరుణ వహించి ఏం కావాల్నో అడగమన్నాడు. కృష్ణుడిని యుద్ధంలో గెలిచే విధానం చెప్పమని ప్రార్థించాడు. అభిచార హోమం చేసి అగ్నిహోత్రుడిని సంతృప్తి పరిస్తే అతడు సుదక్షిణుడి కోరిక నేరవేరుస్తాడని చెప్పాడు శివుడు. సుదక్షిణుడు అలాగే చేయగా అగ్నికుండం నుండి ఒక కృత్య ఆవిర్భవించింది. అతి భయంకరాకారంతో బయల్దేరిందది. అతి వేగంగా కృష్ణుడి నగరానికి వచ్చింది. దాన్ని చూసి భయపడిన ద్వారాకావాసుశ్రీకృష్ణుడి చెంతకు చేరారు. రక్షించమన్నారు. సుదక్షిణుడు పంపిన కృత్యను వధించాలని నిర్ణయించాడు కృష్ణుడు.

శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని సుదక్షిణుడు ప్రయోగించిన కృత్య మీదకు పంపాడు. తన మీదకు వస్తున్న చక్రాన్ని చూసి భయపడకుండా దాని మీద పడపోయింది కృత్య. అప్పుడు సుదర్శన చక్రం కృత్యమీద అగ్నిజ్వాలకురిపించింది. ఆ మంటల వేడి తట్టుకోలేక కృత్య తన రౌద్రాన్ని విడిచి పెట్టి తిరుగు ముఖం పట్టింది. సుదర్శన చక్రం కాశీ పట్టణం ప్రవేశించి, అక్కడ అభిచార హోమం చేస్తున్న సుదక్షిణుడిని, చేయిస్తున్న ఋత్విజులను దగ్ధం చేసింది. కాశీపురాన్ని భస్మం చేసింది. తృప్తి చెందిన చక్రం చివరకు తన రౌద్రాకారం వదిలి, తిరిగి వచ్చి శ్రీకృష్ణుడి పక్కనే నిలిచి ఆ పరమాత్ముడి సేవలో వుండిపోయింది.

ఇదిలా వుండగా, ద్వివిదుడనే వానర నాయకుడు నరకాసురుడిని చంపిన కృష్ణుడి మీద కోపంతో కృష్ణ పాలిత ప్రాంతాలను ధ్వంసం చేశాడు. ఒకనాడు ద్వివిదుడు రైవత పర్వతం దగ్గరికి వెళ్లి, అక్కడ జూదం ఆడుతున్న బలరాముడిని చూశాడు. చూసి వివిధ రకాల వానర చేష్టచేశాడు. వాడిని ఉపేక్షించి లాభం లేదని తలచిన బలరాముడు వాడితో యుద్ధానికి దిగాడు. చివరకు వాడిని సంహరించాడు.

ఇదిలా వుండగా, దుర్యోధనుడి కుమార్తె లక్షణ వివాహ సమయంలో శ్రీకృష్ణుడి (జాంబవతి) కుమారుడు సాంబుడు ఆమెను ఎత్తుకుపోయాడు. కౌరవులతడితో యుద్ధానికి దిగారు. ఆ యుద్ధంలో కౌరవుల పక్షాన కర్ణుడు మొదలైన మహా వీరుకూడా వున్నారు. అయినప్పటికీ సాంబుడు అద్భుతమైన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. కౌరవ వీరుఒక్కసారిగా సాంబుడిని చుట్టుముట్టారు. అతడిని బందీని చేశారు. లక్షణ సహితంగా అతడిని హస్తినాపురానికి తీసుకువచ్చారు కౌరవు.

ఈ విషయమంతా నారదుడు యాదవులకు చెప్పగా వారంతా కౌరవుల మీదికి యుద్ధానికి బయల్దేరారు. బంధువుల మీద యుద్ధం వద్దని చెప్పి, వారిని యుద్ధం విరమింప చేసి, బలరాముడు హస్తినాపురానికి పోయి, వూరి బయటున్న ఉద్యానవనంలో విశ్రమించాడు. తాను వచ్చిన పని తెలియచేయడానికి ఉద్ధవుడిని కౌరవుల దగ్గరికి పంపాడు. బలరాముడు వచ్చిన సంగతి విన్న కౌరవుఉద్ధవుడి వెంట బలరాముడి దగ్గరికి ఆయన్ను చూడడానికి వెళ్లారు. సాంబుడిని బంధించడం తప్పని బలరాముడు చెప్పగా దుర్యోధనుడికి కోపం వచ్చింది. యాదవులను నిందించాడు. వారితో చుట్టరికం అక్కరలేదన్నాడు. సాంబుడిని విడిపించడం అసంభవమని చెప్పి ఆగ్రహంతో దుర్యోధనుడు అక్కడి నుండి వెళ్లిపోయాడు. బలరాముడు మండి పడ్డాడు. తన బలాన్ని, శౌర్యాన్ని యుద్ధంలో చూపాలనుకున్నాడు. శ్రీకృష్ణుడి మహిమ వారికి తెలియదు కదా అనుకున్నాడు. ధారుణి మీద ఇక కౌరవ వంశమే లేకుండా చేయాలనుకున్న బలరాముడు ఉగ్రాకారుడై తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూ నాగలిని ఎత్తి పట్టుకున్నాడు. తన నాగలిని చొప్పించి, హస్తినాపురం ఉన్నంత మేరకు మొత్తం గడ్డను పెకలించి గంగానదిలో పడవేయబోయాడు. అప్పుడు హస్తినాపురం గడగడ వణికింది. గోపురా, ప్రాకారాలతో సహా సమస్తం తలకిందులై పట్టణం ఒరిగిపోయింది. హస్తిన ప్రజభూమ్మీద అడుగు మోపలేక ఆర్తిచెందారు. ఇదంతా బలరాముడి పనని కౌరవ నాథుగుర్తించారు. కలవర పడ్డారు. బలరాముడి శరణు కోరాలని నిశ్చయించారు. సాంబుడిని, లక్షణను అలంకరించి బలరాముడి దగ్గరికి తీసుకు వచ్చి దుర్యోధనాదుఆయనకు సాష్టాంగనమస్కారం చేసి ఆయన్ను స్తుతించారు. తమ అజ్ఞానాన్ని మన్నించమని వేడుకున్నారు. ఆయన శరణు కోరుతున్నామని అన్నారు. తాను హస్తినను గంగలో ముంచనని, వారు నిశ్చింతగా వారి నివాసాలకు వెళ్లమని చెప్పాడు బలరాముడు.

లాంఛనంగా తన కూతురు లక్షణను అత్తవారింటికి పంపుతూ, యాదవులను సాగనంపాడు దుర్యోధనుడు. బలరాముడు పరమానందంతో కొడుకును, కోడలిని తీసుకుని ద్వారక చేరుకున్నాడు. ఇప్పటికీ హస్తినాపురం దక్షిణం వైపు కొంచెం పైకి లేచి, ఉత్తరం భాగం గంగానది వైపు కొంచెం కుంగి వున్నట్లుగా వుంటుంది.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠం ప్రచురణ ఆధారంగా)**

## చారిత్రక మహాగీతం



బంకించంద్ర ఛటర్జీ విరచితమై
స్వాతంత్ర్య సంగ్రామంలో
మహాగీతమై విరాజిల్లి
బ్రిటిష్ వారి మెడవంచిన
సమరఘోషగా మారిన
అమర నినాదం-వందేమాతరం!
అక్షరం అక్షరంలో అగ్ని శక్తి
పదం పదంలో ప్రజ్వలిత చైతన్యం
హృదయం హృదయంలో దేశభక్తి
నరనరాల్లో నిత్య స్పందనం
వందేమాతరంలో నిగూఢమైన
అమేయ ఆత్మబలం
ఆలపించిన ప్రతి శ్వాసలో
పుట్టుకొచ్చే ధైర్య దీపం
జైగోడల్ని చీల్చిన స్వరం
బానిస సంకెళ్ళను తెంచిన నాదం
బలిదానాలకు అర్థం ప్రసాదించిన
త్యాగ తత్వానికి ప్రతిరూపం
అరణ్యాల్లో ప్రతిధ్వనించిన గానం
నగరాల్లో ప్రతిబింబించిన పదం
గ్రామ గుండెల్లో దేవాలయమై నిలిచిన
మాతృభూమి మంత్రం
ఇది కేవలం గీతం కాదు-
అవమాన గాయంలోంచి
పుట్టుకొచ్చిన ఉద్యమ గేయం
దేశాన్నితల్లిగా రంగరించి రాసిన
జాతి ఆత్మగానం
ఇది జన జాగృతి గీతం
ఇది మంత్రమై, మహోపదేశమై, నినాదమై
సమస్త జాతినీ ఏకం చేసిన ఉత్ప్రేరకం
ఇది మాతృభూమి ఘనతను చాటే
శాశ్వత చైతన్యగీతం
నేడు నూటయాభైవసంతా
పూర్తిచేసుకున్న
ఈ చారిత్రక మహా గీతం
'జనగణమన' తో సమంగా
తరతరాలకు తరగని శక్తిగా
నిలిచిపోయే జాతీయ గీతం!!
వందేమాతరం వందేమాతరం!

**పి.వి.ప్రసాద్, 9440176824**

## పుస్తకం ఎందుకో చప్పబడింది..!



డొల్ల చేసే నేటి
తరానికి సలాం
కొట్టింది
నా పుస్తకం వెక్కి వెక్కి
ఏడ్చింది
కళ్ళకు అద్దుకునే
చదవరులు లేక
పొట్లాలు కట్టే బండి
మీద వెళుతుంటే
నా పుస్తకం కన్నీరు పెట్టుకుంది
ముఖపుస్తకం ముచ్చట్లతో కాలం
నా వైపు చూడలేదని బెంగపడింది
ఒకప్పుడు వెతుక్కుని వచ్చే స్నేహం
ముఖం చాటేసిందని ఏడ్చుకుంది
గారాబంగా నిమిరే చేతుల్లో
అద్దం ఆకర్షణై నిలిచిపోయాక
దుమ్ము నిండిన అరలో ఇమడలేక
నా పుస్తకం కుమిలి కుమిలి
ఏడ్చింది
ఇచ్చి పుచ్చుకునే ముచ్చట మరుగై
కాగితం నలగని కాలం
దాపురించాక
పుస్తకమెందుకో మూగబోయింది
గ్రంథాలయాల్లో ఒంటరిగా
కూర్చుని
పాఠకుని కోసం పడుగాపులు
కాస్తూ
వయసు దాటెళ్ళిపోతుంటే
లోలోపల మదనపడుతూ
కుమిలింది
ఆవిష్కరణకు మాత్రం
అలంకారమై
ఏ బల్ల అడుగు భాగానో మడతెట్టి
నా పుస్తకం ప్రాణం వెలవెల
లాడింది
పేరాలు లెక్కన చదివి హత్తుకుని
భావాన్ని పంచుకునే రోజులు
పోయి
అంటరానితనమే తనకు
దిక్కైపోయాక
నా పుస్తకం పొర్లి పొర్లి
అంగలార్చింది
సర్దుకునే మంచి రోజులు పోయాక
కేజీల లెక్కన అమ్ముకునే తీరు
తిష్ట వేసి కూర్చుందని బోరుమంది
ఇప్పుడు పుస్తకం కనుమరుగైంది
పాఠకలోకం వెలేసిన దుఃఖంతో
పాతాళంలో కూరుకుపోయింది
నా పుస్తకం సమాధి కాబడుతోంది
పుస్తక తరం మారిపోయిందని
తెలిసి
ఇప్పటికీ ఆదరిస్తున్న అతి
కొద్దిమందికి
సాష్టాంగ నమస్కారం చేసుకుంది

**- నరెద్దుల రాజారెడ్డి
9666016636**

## మనసును కదల్చిన ... నే....తీయని తెలుగు గజలునై

రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారు ఆత్మీయంగా పంపిన నే....తీయని తెలుగు గజలునై అన్న తమ గజళ్ళ పుస్తకం అందింది.కారణాంతరాల వల్ల వెంటనే చదవలేక పోయాను. ఇవ్వాళ్ళ పట్టుదలతో చదివాను..... వారు ఆలపించిన మధుర గానాలు, రాగాలు, అణువణువూ పరవశించే భావాలు, నాదాలు,అమృత నిధులు వారి గజళ్ళ వెన్నెల వానలో ఆపాద మస్తకం తడుస్తూ ఆస్వాదిం చుదాం రండి..... The ghazals are convincing, and patience is powerful weapon....but the heart of a timid man will never win his lady. ఈ మాటల వెలుగులో ఈ గజళ్ళను ఒక చూపు చూద్దాం రండి.....

మానిఫెస్టో లాంటి తమ ఉపోద్ఘాత గజలులో .......

**నాగజలే తెలుగు తీపి తెన్ను తెలిపే వర్ణ భావాలు మోసేదె చూడు**

**నా గజలే సుస్వనినే ధ్వనిస్తూనే మృదు పదపల్లవినిగా సాగేదె చూడు** అంటూ తన గజళ్ళలోని మృదు లక్షణాలను హృద్యంగా తెలిపింది.

**జీవి పొందే నిర్వేశ నిష్ఠలలోన జ్ఞాన మిడు వరాళి కీర్తననై నే..అంటూ**

**చాలా గజళ్ళలో ప్రతి షేర్ చివర రదీఫ్ లో నే అనే ఏకవర్ణ పదాన్ని వాడింది.**

**ప్రేమోన్మాద ఉద్వేగాలలో చలించు రథకేళి నాకవీత!** అంటుంది మరోచోట

మనస్సు మూగవోయినావిషాదపు వాకిటనే నెలవంకై నిలిచి

**రేయి చీకటి మలినాలనుతనపై తానే మోపుకుంది తెలుసా?...అంటుందో చోట.విషాదం లో ఉండి కూడా నెపం ఇతరులపై మోపకుండా అన్ని కళంకాలను తనపైనే మోపు కోవడం ఒక్క స్త్రీకే సాధ్యమయే ఓర్పు.**

**వెన్నెలారతినై,అనుకూలమైన సతినై,మధుర భావతతినై,లోక గతినై విదితమవని మతినై ...అంటూ రదీఫ్లో భాగంగా అందమైన** పదాల అమరిక రచయిత్రి పనితనాన్ని తెలుపుతుంది.మరోచోట ససివెన్నెల,అసివెన్నెల, మిసివెన్నెల, నుసివెన్నెల,అలనై,కల కలనై అంటూ పదాలపై తనకున్న ప్రభుతను సాధికారంగా తెలియజేస్తున్నది .ఇంకొకచోట కులుకుల పిలుపుల అలకల మలుపులలో మధుర భావతతినై.. అంటూ అందంగ కర్పూరకళిక వంటి పదాలతో ప్రాసను ప్రదర్శిస్తుంది.

చాలామంది కవుల గజళ్ళలో కనిపించే ఒక విషయం చెప్పాలి.ఖాఫియాలు,రదీఫ్లు, మత్లాలు,మక్తాలు,తఖల్లుస్ లు షేర్ లు సలక్షణంగానే ఉంటాయి.పెళ్ళి కూతురుకు ముక్కూ మొహం,కళ్ళు,కనుబొమలు,కురులు,మెడ....అన్నీ సలక్షణంగానే ఉంటాయి.కానీ మొహంలో ఉండవలసిన కళమాత్రం ఉండదు.అల్లగే అన్నీ సలక్షణంగా ఉన్నా ఆ గజళ్ళలో ప్రాణం మాత్రం ఉండదు.అంటే ఆత్మ లాంటి కవిత్వం ఉండదు.శుష్క పదప్రయోగం మాత్రమే దర్శన మిస్తుంది.

అలాగే గజల్ లో ఎంత రసరమ్య భావాలున్నా,ఎంత మంచి కవిత్వం ఉన్నా అది హృదయాన్ని తాకాలి.హృదయ స్పర్శిగా ఉండాలి.ఎదద లోతుల్లోకి చొచ్చుకుపోయి హృదయాన్ని కదిలించాలి.ఎదలో అవ్యక్తబాధను కలిగించాలి. తపనను రగిలించాలి.అప్పుడే ఆ గజల్ కు సార్థకత! లేకుంటే గురి తప్పిన బాణంలా ఆ గజల్ కు విలువ లేదు.మల్లీశ్వరి గజళ్ళన్నీ హృదయాన్ని కదిలించి తపనను రగిలించేవే.సార్థకమైనవే.

**అందాలెన్ని ఉన్నా అడవి చందంగా మిగిలి ఉన్నా**

**ప్రేమగ తలచి పిలిచేదెవరో కొలిచేదెవరో గాసినై నే...**అంటూ తన వేదనను తెలుపుతుంది నిస్సహాయంగా మరో చోట.

**నీవెలేక తళుకుతార్లంటి నా నీలికనుల నిలిచినవి కలల నీడలు**

**వర్ణాల నీ చిద్రూపును చిత్రిస్తూ విరహ కావ్యమై వెలుస్తూ నే....** అంటూ ఆవేదనను అందమైన కవిత్వంగా మలిచింది కవయిత్రి.

**గాలినై ధూళినైన లలి లాలనెరుగని మనోజ్ఞ లలననైన**

**నీలోనే లయం నీతోనే నా జయం కానీ అని అడగనీ నను.....అంటూ ప్రియునికి ఆత్మార్పణే ప్రణయానికి సాఫల్యం అని బాధగా చెబుతుంది.**

**క్రొక్కారు కౌగిలిని కొత్తగా మెత్తగా జన్మలెత్తే కోరికలెన్నో ..అంటూ కోరికలు ననలెత్తె దృశ్యాన్ని హృద్యంగా మలిచింది.**

**ఆర్తిపాడే అశ్రుగీతాలెన్నొ ఆర్ద్రత నిండిన ఓదార్పు లేని బ్రతుకు లెన్నో**

వృథా గాథల్ని సంతస భరిత గానాన్ని వినిపించ ఎలుగెత్తిలేస్తూనే నే.....అంటూ వృథామయ జీవితాలకు తన సహానుభూతిని తెలుపుతుంది



గజల్ వో బాన్సురీ హై జిసే జిందగీకి హల్చల్ మే హమ్నే కహీన్ ఖోదియా థా ఔర్ జిసే గజల్ కా షాయర్ కహీసే ఫిర్సే ఢూంఢ్ లాతా హై ఔర్ జిస్ కి లయ్ సున్ కర్ భగవాన్ కి ఆంఖోమే భి ఇన్సాన్ కే లియే ముహబ్బత్ కే ఆన్సూ ఆజాతే హై. అంటాడు ఫిరఖ్ గోరఖ్ పురి.

**వసంత కోకిలలా వస్తూ పోతూ**
**వలపు మల్లెను చేసి వేదన నిచ్చావు**
**వేడుక నిచ్చే నీ వెతుకులాట దారే**
**ఎరుగక వడబడుతున్నాను నే**
**నీకై మోగే ఎదెపుడు మౌనమౌనోనని నీకై త్రవ్వబడుతున్నాను నే**
**ఎదురు చూపులో ఎలమి కలిమితో పిలుపునై నీకై ఎగబడుతున్నాను నే**

అంటూ నిరీక్షణ లోని విషాద మాధుర్యాన్ని మధుర అభివ్యక్తి ద్వారా తెలుపుతున్నది

కొలమానాలకందని అగాధమే నా డెందం.ప్రమోదమైన ప్రమాణమైన సదా కావ్యాన్నే. ఏ ప్రణయ ప్రళయాల్లోనూ నా ఆద అలవనిదే...అంటూ తన డెందం లోని విలక్షణ ప్రణయాన్ని అక్షరీకరించింది.

నా నిరీక్షణాక్షణా లెన్ని అలసిపోయాయో వేదనావేదన సిక్తమైనాయో

నా రెప్పల మైదానాల స్వప్నించిన మధుర స్వప్నాల నడిపించ లేను తెలుసా ..అంటూ హృదయంగమమైన కవిత్వం వినిపించింది.

**ఆనందానుభూతులలో తడవని క్షణాల రణాలలో**
**కాలం నను కైతల పంటగ పరిపిస్తోంది ..ఇలా**

అంటూ తనను కైతల పంటగా మలుస్తున్న కాలాన్ని తల పోస్తున్నది రచయిత్రి.కాంతి పక్షాలనె కలిగిన పక్షినై వెలుగిస్తున్నానని తెలిసిందెవరు ..అంటూ చక్కని కవిత్వపు వెలుగును చూపిస్తున్నది.

అన్వేషితనై నా కోసమె అనిపించే మనసుకై తిరుగుతూ నే
నా అశ్రువులే అంబరాన తారలుగా మెరుస్తుంటే వింతగా
ఉన్నాగా వలపు స్వరాల సరాల నలుగుతూ వేళ కతుకుతూ నే
... అంటూ అన్వేషిత లోని దు:ఖం, నలుగుతున్న మనసును అక్షరాలలో తెలియజేస్తున్నది.చేదో తీపో ఏమో ఎన్నో స్మృతుల జడి తడిని ఆరనీయని నిశిలో నిలబడి వేదన అనుభ విస్తున్నది

**వాకిట కురిసే వెన్నెలలా నీ ఎద ముంగిట కురిసే తలపు వానను**

**ఎన్ని తీయ తీయని మోహాలో మోదుగ లౌతూ నీకై ఒంపుతూ పంచుతూ**

**సౌందర్య సీమల సందెల వెలుగు నీడలలో మెరిసేటి శ్రీ వంటి జాణను నే**

**సిరి గంధమంటి సాహిత్య సౌరభ మీయ నను అరగ దీసుకునే సానను నే...**అంటారు వేరొక చోట. ఓ మల్లీశ్వరి గారూ! మీ హృదయాన్ని ఏ కోమల రసరమ్య పదార్థం తో సృజించాడు ఆ విధాత! ....తనను తాను అరగ దీసుకుంటేనె కదా కవికి శ్రీ గంధమంటి కవిత్వమలవడేది....

**దీప ధూప పరిమళాలె లేని శిథిల దేవళాన్నైనా......ఎంత చక్కని పోలికతో తన దీనావస్థను వర్ణించింది!**

**పరవశ పరిమళమిచ్చే నాస్మృతులను నీ గుండె కొంగున మోస్తావా లేదో**

**మనక లయిక రాసే కలికి కథలెన్నో ఆనంద నర్తన క్షణాల వీక్షణాలెన్నో**

**నా వలపు వర్ణాల ఓనమాలు దిద్దుతూ నా ఒయారాన్ని చిత్రంగా గీస్తావో లేదొ....**అంటూ తన అప్పీల్ ను సొగసైన కవితగా మలచి విన్నవిస్తున్నది. చివర గా ఒక మాట చెప్పి ఈ సమీక్షను ముగిస్తాను.పాయసం లో పంటికింద రాయి గా కలుక్కుమనే విషయం ఒకటునంది.మారు మూల డిక్షనరీలలో ఉండే కఠిన పదా లు, తిరిగి ప్రబంధ యుగాలకు తీసుకు పోయే గ్రాంథిక పదాలను వాడకుంటే బాగుండేది. ఏది ఏమైన రసపిపాసులను ఓలలాడించే గజళ్ళివి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ రసరమ్య సాహితీ లోకానికి స్వాగతిస్తున్నాను.పుస్తకం కావాల్సినవారు సంప్రదించాల్సిన నెంబరు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి 9866583907

**డాక్టర్.దిలావర్
9866923294**

## మౌనం వ్యూహాత్మకం

నిచ్చెన మెట్ల సమాజం
బక్కోని తొక్కడమే సమంజసమన్నట్టు
నిమ్మకు నీరెత్తినట్టు
నోరెత్తకుండా నిమ్మలంగున్నది
కుమ్మెరలో కులాహంకారానికి
కడుపు కోతకు గురైన తల్లిని
ఊరడించడానికి ఉరికిరాని జనం
కండకావరానికి కాపు కాస్తు
బలవంతుని వైపు తూగుతున్నది
కోవా బన్నును బజారుకీర్చి
అసంబద్ధ వాదనలతో అలసినట్టు



మాట్లాడవలసిన చోట మాట్లాడకుండా
మైకులు ముఖం తిప్పేసుకుని తిరుగుతున్నవి
మస్కా మీడియా
మతలబేమి తెలియనట్టు
ముక్తసరిగా మూకాభినయం చేస్తు
ముతకగా మూతి ముడుచుకుంటున్నవి
ఇదెక్కడి వివక్ష
ఇదేమీ కువార్కం
ఎంతటి కర్కశం
మేమెట్లా మీ బంధువులంకాలేమో
అప్పుడప్పుడు తెలుస్తూనే ఉంది
సింధువులం బిందువులం కాలేమని
పాపాత్ములకు తెలియదా?
పసిపాపలు పరమాత్మ స్వరూపమని
పానం తీసి పరారైతే
ప్రభువులు వదిలిన ప్రజాచైతన్యం వదలదని
ప్రచండ క్రాంతి తో ముంచకుండా ఉండదని.

**డా. ఎడ్ల కల్లేశ్
986676512**

## పుస్తకాల తోటలో (79) డా: అమ్మిన @ 77298 83223



తెలుగు బాల సాహిత్యంలో అరుదుగా ఆగుపించే ప్రక్రియ నాటిక అరుదుగా కనిపించిన అత్యవసరమైనది ఈ ప్రక్రియ, దీని ద్వారా పిల్లల్లో భాషా నైపుణ్యం పెరగడంతో పాటు సంభాషణ చతురత మీరు అవుతుంది. పాఠ్యాంశాలను సరదాగా సంభాషణ రూపంలో గుర్తుపెట్టు కోవడం సులభమే కాదు గుర్తుండిపో తాయి కూడా...., ఇలాంటి అవసరాలను గుర్తించి తనకు గల అనుభవాలను రంగరించుకొని భావితరం పౌరుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని కొత్తగూడెం కు చెందిన అధ్యాపక రచయిత్రి ఎస్. సుమిత్రా దేవి వ్రాసిన 15 నాటికల సంపుటి నవ సమాజం దీనిలో ప్రతి నాటిక క్లుప్త, సరళత, అనే ఉత్తమ నాటిక సూత్రాలను పాటిస్తూ సాగాయి, నవ సమాజం మొదలు హలో వరకు సాగిన ఈ నాటికల ప్రస్థానంలో ప్రతి నాటిక చక్కని సందేశం తో పాటు, ఎంచక్కని ఆలోచన రేకెత్తించేలా సాగుతుంది.

సమాజంలో మార్పు తేవాలంటే ముందుగా మనలో మన కుటుంబాల్లో మార్పులు తేవాలి, అలాగాక స్వార్థం కోసం ఆలోచించి వ్యాపార దృష్టితో చేసే పనుల వల్ల సమాజంలో మార్పు రాదు కదా దాని ద్వారా మనకే నష్టం కలుగుతుంది అనే విలువైన సందేశం అందించింది నవ సమాజం నాటిక, చదువుల ధ్యాసలో పడి మానవ సంబంధాలు కోల్పోతూ పిల్లల లేత మనసులు ఎంతగా గాయపడుతున్నాయో....! కళ్ళకు కట్టినట్టు చాటిన నాటిక లేత మనసులు చివరిదాకా ఉత్కంఠ భరితంగా సాగి ఊహించని మలుపులతో సుఖాంతమైన ఈ నాటిక ఆబాల గోపాలాన్ని ఆలోచింపచేస్తుంది.సాటి అమ్మాయి చదువు కోసం తపనపడి అమ్మాయి తల్లి లక్ష్మి ఆలోచనలో మార్పు తెచ్చిన నేర్పరి పాత్రగా తేజస్విని పాత్రను తీర్చిదిద్దడంలో రచయిత్రి తీసుకున్న తీరు అభినంద నీయం, పరోపకారం విలువ చాటే చక్కని నాటిక సాయం భిక్షగాళ్లను ఎప్పుడూ చులకన చేసి చూడకూడదు అని హెచ్చరిక ఇందులో అంతర్గతంగా ఉంది, నేటి కాలపు ప్రాథమిక పాఠశాలల స్థితిగతులకు అద్దం పడుతూ కాస్త హాస్యం తోడు చేసుకుని సాగిన నాటిక పాపం ఏకోపాధ్యాయ ఆపదలోని బాధ ఎదుటివారికి వచ్చినప్పుడు ఏమాత్రం తెలియదు కానీ ఆ బాధ మనకే స్వయంగా వస్తే అప్పుడు దాని తీవ్రత ఏమిటో అనుభవ పూర్వకంగా అర్థమవుతుంది కానీ ... ఆదుకొని అక్కున చేర్చుకునేవారు కనిపించరు, అనే జీవిత సత్యాన్ని చాటిన చక్కని నాటిక హలో నేటి ఆధునిక కాలానికి అంది వచ్చిన ఫోను పరోక్షంగా నైనా మనలోని ఆత్మీయతలు పంచుకోవడానికి ఎంతగా ఉపకరిస్తుందో భిన్న కోణంలో కొత్తగా చెప్పబడ్డ ఈ నాటికలో సందేశం అందరికీ అవసరం. నేటి కాలంలో మనుషులను బంధీలుగా మారుస్తున్న టీ.వీలపై వ్యంగ్యాస్త్రం అయిన సీరియల్ జబ్బు, మూఢనమ్మకాలపై సంధించిన మరో బాణం తావీజు మహిమ నాటిక, సోమరి నక్క, రైతు తెలివి, వంటి నాటికలు భావి పౌరుల ఆలోచనలను వికసింపజేస్తాయి అనడంలో సందేహం లేదు.విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే జై భారత మాత వంటి నాటిక ఈ నాటికల సంపుటికి మకుటాయ మానంగా నిలుస్తుంది. సభ్య సమాజంలో నెలకొని ఉన్న సామాజిక జబ్బు లకు మంచి టీకా మందులుగా ఈ పిల్లల నాటికలు పనికొస్తాయి అనడంలో అతిశయం లేదు. పిల్లల్లో నాటికల రచన నైపుణ్యం పెంచడానికి ఎంతగానో ఉపకరించడం తోపాటు, పాఠశాలలో జరిగే సభలు సమావేశాలు, సాంస్కృతి క కార్యక్రమాలలో సందర్భోచితంగా ప్రదర్శించుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగంగా ఉంటాయి.

బహుముఖ ప్రయోజనవంతమైన ఈ బాలల నాటికల పుస్త కం ప్రతి ఒక్కరూ సొంతం చేసుకుని చదవదగ్గది. నవ సమాజం (బాలల నాటికలు) పేజీలు: 64, వెల: 50/- రూ, ప్రతులకు: ఎస్. సుమిత్రా దేవి, సెల్: 72075 50867.

## చిట్టి కథ- గట్టి కథ

ఃకథః ఈ పదం తెలియని వారు ఎవరూ ఉండరు. కథ చిన్నదా - పెద్దదా, కల్పితమా-యదార్థమా అనేది పక్క న పెడి తే, పాఠకులను ఏకబిగిన చదివించగలిగితే అది గొప్ప కథగా మనం అర్థం చేసుకోవచ్చు. కథ అంటేనే మన చుట్టూ జరిగే అనేక సంఘటనలకు వాస్తవ రూపం. సోషల్ మీడియా రాకమునుపు ఎంత పెద్ద కథైనా, నవలైనా ఓపిగ్గా, తీరికగా చదువుకునే వారు. కథకుపాఠకులను చదివించగలిగే విధంగా సన్నివేశాల ను, సంభాషణలను సమకూర్చి, ఆనాటి స్థితిగతులను లేదా తమ అనుభవాలను పాఠకులకు చక్కగా చేరవేసేవారు. 24 గంటల కాలాన్ని గడియా రంలో చూపిస్తూ ఉంటే, 24 గంటల కంటే ఎక్కు వగా ఇప్పుడు మనం పరిగెడుతున్నామేమో అనే స్థితిలో ఉండడం వల్ల అంత పెద్ద పెద్ద కథ, నవల, కథానికచ దివే తీరిక, సమయం ఇప్పుడు ఎవరికీ లేదు. ప్రతిదా ని కీ సంక్షిప్త రూపం వచ్చినట్లే కథలకు కూడా ఒక అద్భుతమైన లఘు రూపం వచ్చింది.. దాని పేరే గల్పిక. నిజానికి గల్పిక అంటే ఏమిటో కీ.శే. గంగిశెట్టి లక్ష్మీ నారాయణ గారు నిర్వహించే వాట్సాప్ బృందం సిరికోనలో తెలుసుకున్నాను. అప్పుడే దాని స్వరూప స్వభావాలు తెలిశాయి. మామూభాషలో చెప్పాలి అంటే గల్పిక అనేవి కథా వస్తువును సాధ్యమైనంత క్లుప్తంగా, సరళంగా చెప్పే రెండు మూడు పేజీలోపు ఉండే చిట్టి పొట్టి కథ. అలాంటి గల్పికలను తనదైన శైలిలో వ్యం గ్యం, భావోద్వేగం, హెచ్చరికవంటి రసాలను సమ్మిళి తం చేసి చదువరులను మెప్పించే గొప్పదనం రచయిత శ్రీమాన్ నల్లాన్ చక్రవం-శ్రీరామ చక్రవర్తి గారిది. వీరికి ఉన్న బిరుదు నవరస కవితా చక్రవర్తి. ఆ బిరుదుకుతగ్గట్లుగానే తెగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియ ఉన్నాయో అన్ని ప్రక్రియలలో చేయి తిరిగిన వారు చక్రవర్తి గారు. జిజ్ఞాసువులను శిష్యుగా చేర్చుకొని అన్ని సాహిత్య ప్రక్రియలలో వారి వారి అభిరుచులను గుర్తించి, శిక్షణ ఇస్తూ, ప్రోత్సహిస్తారు చక్రవర్తి గారు. అందుకే ఇక్కడి నుంచి వారి పేరుకు బదు, గురువు గారు అని సంభోదిస్తాను.

మా చిన్నప్పుడు కథచెప్పే మా అమ్మమ్మ కథ ఆఖరున కథ కంచికి మనం ఇంటికి లేదా నిద్రకు అనేది. అప్పుడు అను కునేదాన్ని ఎప్పటికైనా కంచి వెళ్ళాలి, అక్కడ పేరుకున్న కథలను మళ్ళీ పలకరించాలి అని. కానీ అంతలోనే ఃతీరం చేరని అలః దగ్గరకు మనల్ని చేరువ చేశారు గురువు గారు. ఇక్కడ అలలతో సమాజాన్ని, సమాజంలోని వివిధ రకాల మనుషు, మనస్తత్వా, పార్శ్వా, ఆలోచనా ధోరణులను పోల్చారు. అందుకే ఆ అలల అంతరంగ ఘోషను మనసుతో, మెదడుతో వినాలనే సదుద్దేశ్యం గురువుగారి సాలోచనగా నాకు ఈ గల్పికలలో కనిపించింది. ఈ తీరం చేరని అల గల్పికల సంపుటిలో కొన్ని గల్పిక మూడు పేజీల లోపు ఉంటే, మరికొన్ని మరింత పొట్టి గా, టూకీగా ఒక పేరాలోనే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించాయి.

మొదటగా, నన్ను ఎంతగానో ఆకట్టుకున్న గల్పిక ఃరాలిన కొమ్మః. మనిషికి, ప్రకృతికి ఉండే అవినాభావ సంబంధం ఎంత గొప్పగా ఉంటుందో ఈ గల్పిక లోని సుందరమ్మ పాత్ర చెబుతుంది. సుందరమ్మ ఇంటిలో ఉన్న మామిడి చెట్టులోనే ఆమె పంచప్రాణాఉన్నాయన్న సంగతి ఆ చెట్టుకొమ్మనరికిన తర్వాత కొద్ది కాలానికే ఆమె తన ప్రాణావిడిచిపెట్టడంతో మనకు అర్థమవుతుంది. అయితే ఇక్కడ ఒక విశేషం ఏంటంటే సుందరమ్మ కాలం చేసింది అని నేరుగా చెప్పని రచయిత ఃఆమె సంవత్సరీకాఅదే చెట్టు కింద జరిగాయిః అని చెప్పే వాక్యం కొన్ని సంఘటనలను నేరుగా కాకుండా ఎంత గొప్పగా, ఎంత మార్మికంగా చెప్పొచ్చో తెలిపింది.

వృత్తి రీత్యా ఉపాధ్యాయులైన గురువు గారు, ఆ వృత్తిలో కూడా ఉండే గాదికింద పందికొక్కులకు చెందిన ఇతివృత్తాన్ని కథా వస్తువుగా ఇది ఇక్కడ ఇంతేః అనే గల్పికను రాశారు. ఈ గల్పిక చదువుతున్నంత సేపూ రామ్మూర్తి వంటి వారు అనేకుమన కళ్ళముందు తిరుగుతూనే ఉంటారు. నీతి పరులకు అవినీతి పరులవలన కలిగే ఇబ్బందులను చక్కగా మలిచి ఈ గల్పికలో అందించారు. మనం అంటే గిట్టని వాళ్ళు మన ముందు లౌక్యం ప్రదర్శిస్తూ మనకు మేచేస్తున్నట్లు భ్రమ కల్పిస్తారు. తీరా అసవిషయం మనకు తెలిసే సరికి పుణ్యకాలం కాస్తా ముగిసిపోతుంటుంది. ఇదిగో ఇలాంటి ఃదురాత్మఃకూడా ఉన్నాయి ఈ సంపుటిలో.

మనం ఎప్పుడైనా సొంత ఊరు, లేదా రాష్ట్రం దాటి వెళితే, మన గమ్యస్థానమైన ఊరి భాషను ఎంతోకొంత నేర్చుకునే ప్రయత్నం చేస్తాం. అదే, మనది కాని ఆ ప్రాంతంలోనే శాశ్వతంగా ఉండవలసి వస్తే ఆ ప్రాంతం భాషను పరిపూర్ణంగా నేర్చుకుంటాం. కానీ విచిత్రం, మన సొంత ఊరుకు వలస వచ్చిన పరాయి భాషా వ్యక్తికి మన ప్రాంతం భాషను నేర్చుకునే అవకాశం రాకపోతే, అవసరం లేకపోతే, కనీసం మనం కల్పించకపోతే,...ఇదిగో సరిగ్గా ఇదే ఇతివృత్తంగా నడిచింది ః
చేయెత్తి జైకొట్టుః గల్పిక.

విశ్రాంత ఉపాధ్యాయు, ఆ వాసనలను ఒక్కసారే వదలలేక, తనకు వచ్చిన విద్యలో మరికొంత మందిని ప్రావీణ్యులను చెయ్యాలనే సదుద్దేశ్యంతో మరలా గురువుగా మారిన వారి వద్ద ... పరమానందయ్య గారి శిష్యుల మాదిరి ఉన్న శిష్యుల ప్రవర్తనను వ్యంగ్య రూపంలో ఃఅర్థావేరు, శిష్య సత్కారం, ఆగీవెతితలతేది, గురులేకః వంటి గల్పికమన పొట్టల్ని పగిలేలా చేస్తాయి. సూపర్ మార్కెట్లు రాక ముందు, కిరాణాకొట్టు, బట్టల షాపు, స్వీట్ షాపు, ఆఖరికి



పూలకొట్టు, పండ్ల కొట్టు అని తేడా లేకుండా, మనకు కావలసిన సామాన్లు కొనుక్కున్నాక...కొసరు అడగడం అలవాటుగా ఉండేది. ఃఅంత కొన్నాం కదా! కొసరివ్వవాః అని దబాయించి మరీ కొసరు తీసుకునేవాళ్ళం. కొన్నది వంకాయ, కొసరు గుమ్మడికాయ అనే చందంగా. ఇప్పుడొచ్చిన షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్ల పుణ్యమా అని కొసరు మాట దేవుడెరుగు, ఎక్కడ కొసరు అడగకుండా తీసుకుంటామో అని కెమెరాలను కూడా బిగించేశారు. అది సరే, ఈ కొసరు బుద్ధి ఒక రచయితకు ఉంటే ఎలా ఉంటుందో ఃకొసరు బుద్ధిః తెలియచేస్తుంది. ఒక్కోసారి మన బలహీనత/ అలవాట్లు ఎదుటివారికి ఆయుధాలైతే మన పరిస్థితి ఏమిటో ఃఅతి జాగ్రత్తః గల్పిక ఓ పాఠం నేర్పుతుంది.

ఒకసారి మా పక్కింటి అమ్మాయి ఖాళీ చేతులతో మా ఇంటికి వచ్చి, కాసేపటికి మా ఇంట్లో లడ్డూ దొంగతనంగా తీసుకుని తిని, మాకు దొరికిపోయింది. మమ్మల్ని అడిగితే ఇచ్చేవాళ్ళం కదా! అని నేనంటే, అబ్బే లేదు, మా ఇంట్లోదే ఈ లడ్డు అని అడ్డంగా వాదించింది. ఇదిగో ఇలానే కొందరు తాము తప్పు చేసి అడ్డంగా దొరికిపోయినా సరే, వితండంగా వాదిస్తూ, తాము నిర్దోషులం అని నిరూపించుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. ఇటువంటి ఘనులను మనకు గుర్తుకువచ్చేలా చేస్తుంది ఃనిర్దోష ప్రపంచంః. ఃతాత చెప్పని కథః, ఃఎంతటివారూః అనే గల్పికమనసుని చెమరుస్తాయి. ఃమనసెరుగని హృదయంః మనం గతంలో చేసింది, మనకు వర్తమానంలో ఎదురైతే ఎలా ఉంటుందో చెబుతుంది. మనసు భారమవుతుంది. ఇలా ఇందులోని మరిన్ని గల్పికరాజకీయ నాయకుల నిజస్వరూపాన్ని మన కళ్ళకు కనిపించేలా బూతద్దం పెట్టి మరీ చూపిస్తాయి.ఈ ఃతీరం చేరని అలః సంపుటిలోని అన్ని గల్పికమన చుట్టూ జరిగే ఎన్నో సంఘటనలను మ-రోసారి మన కళ్ళముందుకు తీసుకువస్తాయి.

చక్రవర్తి గురువు గారు అన్ని ప్రక్రియల్లో నిష్ణాతుఅవడంతో కథల్లో ముగింపు విభిన్నంగా, గొప్ప కవితాత్మకంగా పాఠకుల పఠనా స్థాయిని పెంచే విధంగా ఉంటుంది. ఈ గల్పికలలో హాస్యం, వ్యంగ్యం ప్రధానంగా కనిపిస్తూనే, అంతలోనే బంధాల విచెప్పకనే చెబుతాయి. అంతేనా అంటే, సమాజంలో ఉన్న చెడును మన కళ్ళ ముందు నగ్నంగా నిలబెడతాయి. సగటు ఓటరుగా, మనిషిగా మనం చేయవలసిన కర్తవ్యాన్ని గుర్తుచేస్తాయి.

**రాధకృష్ణ కర్రి. 9951916499**

# బిజినెస్

## టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రపంచ కోడింగ్ విజయం




టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వహించిన ప్రపంచ స్థాయి కోడింగ్ పోటీలో చైనాకు చెందిన 21 ఏళ్ల జౌ జింగ్‌కై విజేతగా నిలిచాడు. మొత్తం 1,46,922 మంది పాల్గొనడంతో ఈ పోటీ ప్రపంచంలోనే అతిపెద్ద కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పోటీగా గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. చిలీకి చెందిన విన్సెంటే ఒపాజో మరియు పెరూకు చెందిన జార్జ్ వాల్డివియా వరుసగా మొదటి, రెండవ రన్నరప్ స్థానాలు పొందారు. ఈ ఏడాది మానవ-కృత్రిమ మేధస్సు సహకారంతో ప్రత్యేక పోటీ నిర్వహించబడింది. భారతీయ మహిళా కోడర్లు కూడా గణనీయంగా ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీ విద్యార్థులకు ప్రపంచ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశమివ్వడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించే వేదికగా నిలిచింది.

## తెలంగాణలో అపోలో ఫార్మసీ వెయ్యి స్టోర్ల మైలురాయి



హైదరాబాద్, ఫిబ్రవరి 2026: భారతదేశంలో అతిపెద్ద ఫార్మసీ నెట్‌వర్క్ 'అపోలో ఫార్మసీ' తెలంగాణలో తన 1,000వ స్టోర్ మైలురాయిని చేరుకుంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదెల ప్రారంభించారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో అపోలో ఫార్మసీ తన కార్యకలాపాలను విస్తరించింది. రిటైల్, డిజిటల్, సప్లై చైన్ విభాగాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. ఈ నెట్‌వర్క్ ద్వారా 50,000 పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్నెస్ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇరవై ఐదు లక్షల మంది 24/7 వినియోగదారులు ఉన్నారు. ప్రాంతీయ నెట్‌వర్క్, సమగ్ర సరఫరా వ్యవస్థతో అపోలో ప్రతిరోజూ 1.65 లక్షలకు పైగా మందుల ఆర్డర్లు అందిస్తోంది. రాబోయే మూడేళ్లలో తెలంగాణలో మరో 200 పైగా కొత్త ఫార్మసీ స్టోర్లను ప్రారంభించనున్నారు.తెలంగాణలో 33 జిల్లాల్లో 1000 స్టోర్లు. 50,000 పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్నెస్ ఉత్పత్తులు.

## టాటా మోటార్స్ లిమిటెడ్ వాణిజ్య వాహనాల విక్రయ వృద్ధి



టాటా మోటార్స్ లిమిటెడ్ ఫిబ్రవరి 2026లో దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో కలిపి మొత్తం 42,940 వాణిజ్య వాహనాలను విక్రయించి గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 32 శాతం వృద్ధిని నమోదు చేసింది. భారీ సరుకు వాహనాలు, మధ్యస్థ మరియు తేలికపాటి వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, చిన్న సరుకు రవాణా వాహనాల విభాగాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దేశీయ విక్రయాలు 40,893 యూనిట్లకు చేరుకోగా, అంతర్జాతీయ వ్యాపారం కూడా స్థిరమైన వృద్ధిని సాధించింది. ముఖ్యంగా మధ్యస్థ మరియు భారీ వాణిజ్య వాహనాల విభాగంలో దేశీయంగా 34 శాతం కంటే ఎక్కువ వృద్ధి నమోదైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చే రవాణా రంగంలో సంస్థ తన ఆధునిక సాంకేతికత, విశ్వసనీయత మరియు స్థిరమైన అభివృద్ధి దృక్పథంతో ముందంజలో కొనసాగుతోంది. 1.65 లక్షలకు పైగా మందుల ఆర్డర్లు.10,000 మందికి పైగా ఉద్యోగులు.25 లక్షల మంది 24/7 వినియోగదారులు

## టయోటా ఫిబ్రవరిలో ఇరవై శాతం విక్రయాల పెరుగుదల




టయోటా కిర్లోస్కర్ మోటార్ తీ ఫిబ్రవరి 2026లో మొత్తం 34,034 వాహనాల సమగ్ర విక్రయాలను నమోదు చేసి గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 20 శాతం వృద్ధిని సాధించింది. దేశీయ మార్కెట్లో 30,737 వాహనాలు విక్రయించగా, ఎగుమతులు 3,297 యూనిట్లకు చేరుకుని గణనీయమైన పెరుగుదల చూపించాయి. జనవరి-ఫిబ్రవరి కాలంలో కూడిన విక్రయాలు కూడా 18 శాతం వృద్ధితో 67,914 యూనిట్లకు చేరాయి. వినియోగదారుల విశ్వాసం, నాణ్యత, విశ్వసనీయత మరియు మెరుగైన యాజమాన్య అనుభవం సంస్థ విజయానికి దోహదపడ్డాయి. బిడది ప్రాంతంలోని రెండు తయారీ కేంద్రాల ద్వారా వివిధ నమూనాలను ఉత్పత్తి చేస్తూ సంస్థ దేశీయ అవసరాలతో పాటు ఎగుమతుల విస్తరణపై దృష్టి సారిస్తోంది.

## గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌ను ఆవిష్కరించిన టాటా ఏఐఏ లైఫ్



దీర్ఘకాలిక సంపద సృష్టికి జీవిత బీమా రక్షణ పొందుతూనే గ్లోబల్ వృద్ధి అవకాశాల్లో పెట్టుబడి పెట్టేందుకు అవకాశంముంబై: భారతదేశంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ 'టాటా ఏఐఏ గ్లోబల్ ఈక్విటీ ఫండ్'ను ఆవిష్కరించింది. గ్లోబల్ ఈక్విటీల్లో పెట్టుబడి ద్వారా దీర్ఘకాలికంగా మూలధన వృద్ధి సాధించడంతో పాటు జీవిత బీమా రక్షణను కూడా అందించే విధంగా ఈ ఫండ్ రూపొందించబడింది. అంతర్జాతీయ మార్కెట్లలోని ఈక్విటీలు, మ్యుచువల్ ఫండ్లు, ఈటీఎఫ్‌లలో ఇది పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ నిధుల్లో 70%--100% వరకు భాగాన్ని గ్లోబల్ ఈక్విటీల్లో, మిగతా భాగాన్ని రుణ పత్రాలు మరియు మనీ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడి పెడతారు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 5, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఒక్కో యూనిట్ ప్రారంభ ధర 10 డాలర్లుగా ఉంటుంది.

## భారత ఈవీ రంగంలో పెట్టుబడుల స్థితి



గత ఐదేళ్లలో భారత ఈవీ (విద్యుత్ వాహన) రంగం రూ.2.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని ఐఈఈఎఫ్ఏ నివేదిక తెలిపింది. ఈ పెట్టుబడుల్లో ఎక్కువ భాగం తయారీ సామర్థ్యాలు, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల కోసం కేటాయించబడింది. అయితే, 2030కి దేశం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి రూ.12.5 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని, ఇప్పటి వరకు సమీకరించినది కేవలం 18% మాత్రమే అని విశ్లేషకులు పేర్కొన్నారు. మిగతా రూ.10.2 లక్షల కోట్లను సమీకరించడానికి రుణ సంస్కరణలు, ప్రైవేట్ పెట్టుబడులు అవసరమని నివేదిక సూచిస్తుంది. 2020-25 మధ్య విద్యుత్ త్రిచక్ర వాహనాల్లో అత్యధిక పెట్టుబడులు (78%) వచ్చాయని, విద్యుత్ కార్ల విభాగంలో 2024-25లో పెట్టుబడులు పెరుగుతాయని వివరించింది.

## అలీ ఖమేనీ మరణం తర్వాత మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు



ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఇన్స్టిట్యూట్ విశ్లేషకుల ప్రకారం, అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మరియు అలీ ఖమేనీ మరణంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగి ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వద్ద రవాణా అంతరాయాలు ఏర్పడితే శక్తి సరఫరాపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రపంచ చమురు వినియోగంలో గణనీయమైన భాగం ఈ మార్గం ద్వారా సాగుతుండటంతో, చిన్న అంతరాయం కూడా ధరల పెరుగుదలకు దారితీయవచ్చు.

శక్తి మార్కెట్లలో ముడి చమురు మరియు సహజ వాయువు ధరలు పెరిగే అవకాశముంది. ఖతార్ వంటి దేశాల ద్రవీకృత సహజ వాయు ఎగుమతులు కూడా ఇదే మార్గంపై ఆధారపడటంతో గ్యాస్ మార్కెట్ కూడా ప్రభావితమవుతుంది. నౌకాశ్రయ రవాణా బీమా ఖర్చులు ఇప్పటికే పెరుగుతుండటం సరఫరా పరిస్థితులను మరింత కఠినతరం చేస్తోంది. స్టాక్ మార్కెట్లలో సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు రిస్క్ తగ్గించే దిశగా కదలుతారు. ప్రభుత్వ బాండ్లపై దిగుబడులు తగ్గడం, ఈక్విటీలు పడిపోవడం సాధారణ ప్రతిచర్యగా కనిపించవచ్చు. బంగారం వంటి భద్రమైన ఆస్తులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. అయితే డిజిటల్ ఆస్తులు ఇటువంటి భౌగోళిక ఉద్రిక్తతల్లో రక్షణ కవచంలా పనిచేయవని విశ్లేషకులు సూచిస్తున్నారు.

మొత్తంగా, ఈ సంఘర్షణ ఎంతకాలం కొనసాగుతుందో, హోర్ముజ్ మార్గంలో రవాణా మరియు బీమా వ్యవస్థలు ఎంతవరకు ప్రభావితమవుతాయో అనేదే మార్కెట్ల దిశను నిర్ణయిస్తుంది. శక్తి రంగం, రవాణా మరియు రక్షణ పరిశ్రమలకు లాభదాయక పరిస్థితులు ఏర్పడవచ్చు; అయితే ఇంధన దిగుమతులపై ఆధారపడే దేశాలు మరియు విమానయాన వంటి రంగాలు ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశముంది.

## హైదరాబాద్‌లో అరుదైన వారసత్వ మోటారు వాహనాల వైభవ ప్రదర్శన



హైదరాబాద్‌లోని ఆర్ఎమ్‌జెడ్ నెక్సిటీ ప్రాంగణంలో క్లాసిక్ మోటార్ వాహన సంఘం ఆధ్వర్యంలో వింటేజ్ మరియు క్లాసిక్ వాహనాల అద్భుత ప్రదర్శన నిర్వహించబడింది. 1920 నుంచి 1988 వరకు చెందిన సుమారు యాభై అరుదైన వారసత్వ వాహనాలు ఈ కార్యక్రమంలో ప్రదర్శించబడి సందర్శకులను ఆకట్టుకున్నాయి. నగర మోటారింగ్ చరిత్రను ప్రతిబింబించే ఈ ప్రదర్శన విశేష ఆదరణ పొందింది.

ఈ ప్రదర్శనలో 33 క్లాసిక్ కార్లు, 14 వింటేజ్ మోటార్ సైకిళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 1920 స్టట్జ్, 1948 బెంట్లీ మార్క్ ఆరు, 1971 మెర్సిడెస్-బెంజ్ ఆరు వందలు, ట్రయంఫ్ రెండు వేల, ఆస్టిన్ ఏ నలభై, మోరిస్ ఆక్స్ఫర్డ్ వంటి అరుదైన వాహనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే హిందుస్తాన్ అంబాసడర్, ఫియట్ 1100డి, స్టాండర్డ్ హెరాల్డ్ వంటి వాహనాలు కూడా ప్రదర్శించబడ్డాయి.

ఈ కార్యక్రమానికి 250 మందికి పైగా సేకరణదారులు, సభ్యులు, ఆహ్వానితులు హాజరయ్యారు.

ముఖ్య అతిథిగా నగర సంయుక్త రవాణా కమిషనర్ సి. రమేష్ పాల్గొని, వింటేజ్ వాహనాల పరిరక్షణకు ప్రభుత్వ విధానాలపై స్పందించారు. పలువురు సీనియర్ సభ్యులు తమ అరుదైన వాహనాలను ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబాటుగా ప్రతి వాహనం కోసం ఒక మొక్కను నాటడం ద్వారా ప్రత్యేక సందేశం ఇచ్చారు. కమర్షియల్ ప్రాంగణాల్లో సాంస్కృతిక మరియు సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ నిర్వహించిన ఈ ప్రదర్శన నగర వారసత్వాన్ని మరింత విస్తృత ప్రజలకు చేరువ చేసింది.

## అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలతో విమాన ప్రయాణాల మార్పులు అనివార్యం



అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో గగనతల ఆంక్షలు విధించబడటంతో అంతర్జాతీయ విమాన రాకపోకలపై ప్రభావం పడుతోంది.

ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయెల్ దాడుల తరువాత పౌర విమానాల కోసం గగనతలాన్ని మూసివేయడం వల్ల అనేక విమానాలు మార్గమళ్లింపులకు గురవుతున్నాయి. దీని కారణంగా విమాన ప్రయాణ సమయాలు పెరగడం, నిర్దేశిత సమయాల్లో మార్పులు రావడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికులపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికులు తమ ప్రణాళికల్లో సవరణలకు సిద్ధంగా ఉండాలని జుఖంవవీమతీఱజూ సహవ్యవస్థాపకుడు =అఝిత్ రాత్‌అవ సూచించారు. సంబంధిత దేశాల గగనతల పరిమితుల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విమానాలు నడపాల్సి వస్తుందని, దీని వల్ల ప్రయాణ వ్యవధి పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే విమాన బయలుదేరే మరియు చేరుకునే సమయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవచ్చని తెలిపారు.

అంతర్జాతీయ పరిస్థితులు వేగంగా మారుతున్నందున ప్రయాణికులు తమ విమానయాన సంస్థల అధికారిక సమాచారాన్ని తరచుగా పరిశీలించడం అత్యవసరమని సూచించారు. ముఖ్యంగా విదేశీ ప్రయాణాలు చేసే వారు ప్రయాణానికి ముందు మరియు ప్రయాణ సమయంలోనూ తాజా సమాచారాన్ని తెలుసుకుంటూ ఉండాలి. అవసరమైతే తిరుగు ప్రయాణ ప్రణాళికలను కూడా సవరించుకోవడానికి ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన చెప్పారు.

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ బృందం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించుకోవడం ద్వారా ఇబ్బందులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రయాణాల్లో సౌలభ్యం కోసం అప్రమత్తంగా ఉండటం, మార్పులను స్వీకరించేందుకు సిద్ధపడటం ఈ సమయంలో అత్యంత అవసరమని పేర్కొన్నారు.

## మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావం: భారత్‌లో ఇంధన ధరలపై పరిస్థితి



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మూసివేత వార్తలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కలవరపెడుతున్నాయి. ఈ మార్గం ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు వస్తున్నందున, దీర్ఘకాలికంగా మూసివేత జరిగితే గ్లోబల్ ధరలపై ప్రభావం తేలవచ్చు. అయితే భారతదేశానికి తక్షణ చమురు సరఫరాకు అంతరాయం వచ్చే అవకాశం తక్కువగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

ప్రస్తుతం దేశంలో కనీసం 10 రోజుల ముడి చమురు నిల్వలు, అదనంగా 5--7 రోజుల ఇంధన నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. ఈ నిల్వలు తక్షణ ఇంధన అవసరాలను తీర్చగలవు.

అమెరికా--ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హోర్ముజ్ జలసంధి మూసివేసినట్లు తెలిసినప్పటికీ, దీర్ఘకాలికంగా అది కొనసాగుతుందనే సూచనలు లేవని విశ్లేషకులు చెబుతున్నారు.

భారతదేశం తన ముడి చమురులో సుమారు 88 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. రోజుకు సుమారు 2.5--2.7 మిలియన్ బ్యారెళ్లు చమురు అవసరం ఉంటే, దాదాపు 50 శాతం హోర్ముజ్ మార్గం ద్వారా వస్తుంది. ప్రధానంగా ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ వంటి దేశాల నుంచి చమురు రవాణా అవుతుంది.

ఇవే కాకుండా, దేశ ఎల్ఎన్‌జి దిగుమతుల్లో సుమారు 60 శాతం, ఎల్‌పిజి దిగుమతుల దాదాపు మొత్తం కూడా హోర్ముజ్ మార్గం ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలికంగా మూసివేత ఉంటే సరఫరాలో ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితులు దేశీయ ఇంధన ధరలకు పరోక్షంగా ప్రభావం చూపవచ్చని అధికారులు తెలిపారు.

ఇప్పటికే బ్రెంట్ క్రూడ్ ధరలు ఏడు నెలల గరిష్టానికి చేరుకొని బ్యారెల్‌కు సుమారు 73 డాలర్ల వద్ద ఉన్నాయి. సరఫరా అంతరాయం తీవ్రత పెరిగితే ధరలు 80 డాలర్ల వైపు కదిలే అవకాశముంది. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై పరోక్ష ఒత్తిడి ఏర్పడవచ్చు.

అధికారుల ప్రకారం, భారత్ ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను ఉపయోగించి, రష్యా, ఆఫ్రికా, వెనిజులా, బ్రెజిల్ వంటి దేశాల నుంచి చమురు కొనుగోళ్లు పెంచే సామర్థ్యం కలిగి ఉంది. అదనంగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఒక వారం వరకు అవసరాలను తీర్చగలవు. మధ్యప్రాచ్యం నుంచి చమురు రాకకు సుమారు 5 రోజులు, రష్యా నుంచి రవాణాకు కనీసం ఒక నెల పట్టే పరిస్థితిలో, ముందస్తు ప్రణాళికలు కీలకం అని అధికారులు సూచిస్తున్నారు.

## యుద్ధ ప్రభావం: భారత్‌లో బంగారం ధర లక్షలకి చేరుతుందా?



ప్రపంచంలో యుద్ధం జరుగుతుందనే సంకేతాలు వచ్చినప్పుడల్లా, బంగారం, వెండి ధరలు మొదట పెరగడం తరచుగా గమనించవచ్చు. అందుకే ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికన్ ఉమ్మడి దాడి తర్వాత బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరగవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. అయితే బంగారం, వెండి ధరల..

ప్రపంచ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు సామాన్యుల జేబుకు చిల్లు పెట్టబోతున్నాయా? అంటే అవుననే అంటున్నారు ఆర్థిక నిపుణులు. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ మార్కెట్లను వణికిస్తోంది. పసిడి, వెండి ధరలను రికార్డు స్థాయిలో పెరిగేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరలు రాబోయే రోజుల్లో ఊహించని స్థాయికి పెరుగుతాయని, బంగారం ధర తులం (10 గ్రాములు) ఏకంగా రూ. 2 లక్షలు దాటే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే వెండి కూడా రికార్డ్ స్థాయిలో దూసుకుపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం తులం బంగారం ధర రూ. 1,73,080 ఉండగా, కిలో వెండి ధర రూ. 2,95,000 వద్ద ఉంది. అదే హైదరాబాద్‌లో మాత్రం ఇంకా భారీగా ఉంది. కిలో వెండి ధర రూ. 3,25,000 వద్ద ట్రేడవుతోంది.

ప్రపంచవ్యాప్తంగా విలువైన లోహాల మార్కెట్లు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్ -- అమెరికా సమన్వయంతో చేసిన దాడులు పెట్టుబడిదారుల ఆందోళనలను రేకెత్తించాయి. ఈ సంఘటన తర్వాత ప్రజలు తమ డబ్బును కాపాడుకోవడానికి బంగారం, వెండి వంటి సాంప్రదాయ వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు.

అమెరికా -- ఇరాన్ మధ్య యుద్ధం గురించి పెరుగుతున్న చర్చ ఆర్థిక మార్కెట్లలో భయాందోళనలను సృష్టించవచ్చని విశ్లేషకులు అంటున్నారు. అటువంటి సమయాల్లో ప్రజలు బంగారం, వెండిని సురక్షితమైన పెట్టుబడులుగా భావిస్తారు.

ప్రపంచంలో యుద్ధం జరుగుతుందనే సంకేతాలు వచ్చినప్పుడల్లా, బంగారం, వెండి ధరలు మొదట పెరగడం తరచుగా గమనించవచ్చు. అందుకే ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికన్ ఉమ్మడి దాడి తర్వాత బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరగవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. అయితే బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఇతర అంశాలు కూడా ఉన్నాయి.

ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు: మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ -- ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటున్నప్పుడు పెట్టుబడిదారులు బంగారం, వెండిని తమ బలమైనదిగా భావిస్తారు.

ఖు డాలర్ కదలిక: బంగారం, వెండి ధరలను కొనసాగించడంలో డాలర్ బలహీనపడటం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. డాలర్ బలహీనపడినప్పుడు ఇతర కరెన్సీలను కలిగి ఉన్నవారు బులియన్ కొనుగోలు చేయడం చౌకగా మారుతుంది. ఇది డిమాండ్‌ను పెంచుతుంది.

సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు: ద్రవ్యోల్బణం, ఆర్థిక అస్థిరత నుండి రక్షించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు విలువైన లోహాలను నిరంతరం సేకరించుకుంటున్నాయి. పెరిగిన సెంట్రల్ బ్యాంక్ డిమాండ్ ధరలకు మద్దతు ఇస్తుందని భారత ఆర్థిక మంత్రి ఇటీవల నొక్కి చెప్పారు.

వెండి ద్వంద్వ పాత్ర: వెండికి డిమాండ్ పెరగడానికి మరో ప్రధాన కారణం ఏమిటంటే ఇది సురక్షితమైన పెట్టుబడి మాత్రమే కాదు, సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ రంగాలలో కూడా విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది దాని ధరకు మద్దతు ఇస్తుంది.

## భారత్ బయోటెక్ ప్రజా షేరు విక్రయ యోచనలు వేగం




హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న భారత్ బయోటెక్ సంస్థ భారీ స్థాయి ప్రజా షేరు విక్రయానికి వచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సుమారు ఐదు వందల మిలియన్ డాలర్లకు సమానమైన దాదాపు నాలుగు వేల ఐదు వందల కోట్ల రూపాయల నిధులను సమీకరించే లక్ష్యంతో సంస్థ అంతర్గత చర్చలు ప్రారంభ దశలో ఉన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. అయితే ఈ విషయంపై సంస్థ అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

1996లో స్థాపితమైన ఈ వ్యాక్సిన్ తయారీ సంస్థ హెపటైటిస్ బి, టైఫాయిడ్, రోటావైరస్, ఇన్ఫ్లుయెంజా వంటి అనేక వ్యాధుల నివారణకు టీకాలు అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేస్తోంది. కొవిడ్ మహమ్మారి సమయంలో స్వదేశీ టీకాను అభివృద్ధి చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ప్రస్తుతం వందకు పైగా దేశాలకు టీకాలను సరఫరా చేస్తూ గ్లోబల్ రోగనిరోధక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రజా షేరు విక్రయం ద్వారా సమీకరించే నిధులను పరిశోధన మరియు అభివృద్ధి విభాగాన్ని విస్తరించడానికి, తయారీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, తదుపరి తరం టీకాలు మరియు జీవ వైద్య ఉత్పత్తుల అభివృద్ధిని వేగవంతం చేయడానికి వినియోగించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లినికల్ పరీక్షలు, నియంత్రణ అనుమతులు, అంతర్జాతీయ పంపిణీ వ్యవస్థల కోసం ఔషధ సంస్థలకు పెద్ద మొత్తంలో మూలధనం అవసరం అవుతుంది.

ఒకవేళ ఈ ప్రతిపాదిత ఇష్యూ విజయవంతమైతే దేశీయ బయోటెక్నాలజీ రంగంలో ఇది ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుంది. ఆరోగ్య సంరక్షణ రంగంలోని వినూత్న సంస్థలపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ఇది మరింత బలపరచవచ్చు. అయితే ప్రస్తుత మార్కెట్ ఊగిసలాటలు, విదేశీ పెట్టుబడిదారుల అప్రమత్త ధోరణి నేపథ్యంలో ఇష్యూ ధర నిర్ణయం మరియు సమయం కీలకంగా మారనున్నాయి.

## కొత్త సిరీస్‌తో జీడీపీ వృద్ధి అంచనాల్లో మార్పులు




దేశంలో అమల్లోకి తీసుకొచ్చిన కొత్త స్థూల దేశీయోత్పత్తి గణాంక సిరీస్ నేపథ్యంలో వృద్ధి రేటు అంచనాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రాతిపదిక సంవత్సరాన్ని 2011-12 నుంచి 2022-23కు మార్చడంతో పాటు వస్తు సేవల పన్ను మరియు ఇ-వాహన పోర్టల్ వంటి వనరుల నుంచి అదనపు గణాంకాలను చేర్చడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను మరింత సమగ్రంగా ప్రతిబింబించే విధంగా సవరణలు చేశారు. ఈ మార్పుల ఫలితంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను 7.4 శాతం నుంచి 7.6 శాతానికి పెంచారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో వృద్ధి రేటు 7.8 శాతానికి చేరింది. తయారీ మరియు సేవల రంగాల మెరుగైన ప్రదర్శన ఇందుకు దోహదపడింది. జులై-సెప్టెంబరు త్రైమాసిక వృద్ధి కూడా స్వల్పంగా పెరిగింది. అయితే తొలి త్రైమాసిక వృద్ధి రేటు తగ్గుదల నమోదైంది. ఈ సవరణలతో 2025-26లో స్థిర ధరల వద్ద వాస్తవ దేశీయోత్పత్తి రూ.322.58 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా.

ప్రస్తుత ధరల వద్ద దేశీయోత్పత్తి వృద్ధి 8.6 శాతానికి చేరే అవకాశముందని అంచనాలు సూచిస్తున్నాయి. ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ ప్రకారం, కొత్త సిరీస్ ప్రభావంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను 7 నుంచి 7.4 శాతం మధ్యకు పెంచారు. నామమాత్ర వృద్ధి 11 శాతానికి చేరువవుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ నాలుగు లక్షల కోట్ల డాలర్ల స్థాయిని అధిగమించే అవకాశముందని పేర్కొన్నారు.

ఇక కేంద్ర ద్రవ్యలోటు జనవరి చివరికి రూ.9.8 లక్షల కోట్లుగా నమోదై, వార్షిక బడ్జెట్ లక్ష్యంలో 63 శాతానికి చేరింది. 2025-26లో ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతంగా ఉంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త గణాంక సిరీస్ అమలుతో దేశ ఆర్థిక వ్యవస్థ యొక్క వాస్తవ స్థితిగతులను మరింత స్పష్టంగా అంచనా వేయగలమని అధికారులు భావిస్తున్నారు.

## ఎల్ఐసి జీవన్ ఆనంద్: రోజుకు కేవలం రూ.45తో పొదుపు




ఎల్ఐసి అందించే 'జీవన్ ఆనంద్' (ప్లాన్ నం. 915) పథకం పెట్టుబడిలో భద్రతను, స్థిరమైన రాబడిని కోరుకునే వారికి ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ పాలసీ బీమా రక్షణతో పాటు దీర్ఘకాలిక పొదుపు అవకాశాలను కలిగినందున, సామాన్యులకు అనుకూలంగా ఉంటుంది. ప్రధాన ఆకర్షణ 'హోల్ లైఫ్ కవర్', దీని ద్వారా మెచ్యూరిటీ తర్వాత కూడా బీమా కవర్ కొనసాగుతుంది.

పాలసీ ప్రీమియం భారంగా ఉండదు. ఉదాహరణకు, 35 ఏళ్ల వ్యక్తి రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్ కోసం 35 సంవత్సరాల పాలసీ తీసుకుంటే, సుమారు సంవత్సరం రూ.16,300 చెల్లించాలి. ఇది నెలకు సుమారు రూ.1,400, రోజుకు కేవలం రూ.45--46 మాత్రమే. దీర్ఘకాలంలో చిన్న మొత్తంతో పెద్ద ఫండ్ సృష్టించవచ్చు.

ప్రస్తుత బోనస్ అంచనాల ప్రకారం, పాలసీ మెచ్యూరిటీ సమయంలో పెట్టుబడిదారుడు సుమారు రూ.25 లక్షల వరకు పొందే అవకాశం ఉంది. ఇందులో ప్రధాన రూ.5 లక్షల హామీ మొత్తం, సుమారు రూ.8.60 లక్షల సింపుల్ రివిజనరీ బోనస్, సుమారు రూ.11.50 లక్షల తుది అదనపు బోనస్ ఉంటాయి. పాలసీదారు తరువాత మరణించినా, నామినీకి మొత్తం చెల్లించబడుతుంది.

పన్ను ప్రయోజనాల పరంగా కూడా ఈ పాలసీ ఆకర్షణీయంగా ఉంది. ప్రీమియం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80జ కింద మినహాయింపుకు అర్హం. మెచ్యూరిటీ, మరణ ప్రయోజనం సెక్షన్ 10(10ఱ) ప్రకారం పన్ను రహితం. పాలసీ రెండు సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే అవకాశం కూడా కలిగిస్తుంది. తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ మరియు పొదుపు కోరుకునే వారికి ూ×జ జీవన్ ఆనంద్ పథకం సమతుల్య ఎంపికగా నిలుస్తోంది.

## నార్వెజ్ బ్యాంక్ పోర్ట్‌ఫోలియో నుంచి 'అదానీ గ్రీన్ ఎనర్జీ' తప్పివేత




నార్వెజ్ బ్యాంక్ నిర్వహించే ప్రపంచంలోనే అతిపెద్ద సావరిన్ వెల్త్ ఫండ్ ఇటీవల అదానీ గ్రీన్ ఎనర్జీను తమ పెట్టుబడి పోర్ట్‌ఫోలియో నుంచి తప్పించే నిర్ణయం తీసుకుంది. ఫండ్ అధికార వెబ్‌సైట్ ప్రకారం, "భారీ అవినీతి లేదా ఇతర గంభీర ఆర్థిక నేరానికి సంబంధించిన ప్రమాదం" న కారణంగా అజెల్ను వర్గీకరణ నుండి తొలగించినట్లు పేర్కొంది, అయితే దీనికి సంబంధించి స్పష్టమైన వివరణను ఇచ్చలేదు.

నార్వేజ్ ఫండ్ మొదట 2020 జులైలో అజెల్ షేర్లను కొన్నప్పుడు వాటి ధర రూ.341కే ఉండేది, కానీ ప్రస్తుతం షేరు దాదాపు రూ.944 ప్రాంతంలో కొనికానుంది. పోర్ట్‌ఫోలియో నుంచి ఈ షేర్లను తొలగించడం ద్వారా ఫండ్ సుమారు ఏ43.9 మిలియన్ల (సుమారు రూ.400 కోట్లు) విలువైన వాటాను విక్రయించిందని మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి.

ఇందులో ఆసక్తికరమైన విషయం ఏమంటే, నార్వే ఫండ్ నిర్ణయంలో అజెల్ పై నేరుగా నేర సంఘటన శిధిలమై తీర్పు వచ్చినట్టు చెప్పలేదు; ఫండ్ తన నైతిక పెట్టుబడి మార్గదర్శకాలకు అనుగుణంగా "అంగీకరించలేనిది" అని భావించిన కంపెనీలను తప్పించే కొరకు చర్యలు తీసుకుంటుంది. ఈ విధానం సూత్రప్రాయంగా ప్రమాద మోడల్ ఆధారితమైనది, న్యాయ నిర్ణయం మాత్రమే కాదు.

అలాగే 2024లో కూడా ఇదే ఫండ్ అదానీ పోర్ట్స్ మరియు స్పెషల్ ఎకనామిక్ జోన్ను పోర్ట్‌ఫోలియో నుంచి తీసివేసింది, తద్వారా కొన్ని భారత కంపెనీలు ఫండ్ పెట్టుబడుల నుండి బయటపడిన ఉదాహరణ ఇది రెండోసారి. ఇది సమకాలీన ఆర్థిక ఆరోపణలు, మార్కెట్ అవగాహనల నేపథ్యంలో తీసుకుంటున్న స్ట్రాటజిక్ నిర్ణయాలలో ఒకటిగా ఉంది.

## కేంద్రం సూచన: బొగ్గు దిగుమతులు 30% తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు దిగుమతులను కనీసం 30 శాతం తగ్గించాలని సూచించింది. ఈ నిర్ణయం దేశీయ బొగ్గును ఎక్కువగా ఉపయోగించమని ప్రోత్సహించడానికి తీసుకోవడం జరిగింది. బ్లెండింగ్ విధానాన్ని పెంపొందించడం ద్వారా ఈ ఏడాది సుమారు 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిల్వ చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ రంగానికి దగ్గరగా ఉన్న సంబంధిత అధికారులు ఈ ప్రణాళికను వెల్లడించారు.

భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా ఉంది. 2025లో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి 50 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతించబడింది. ఈ ఏడాది 15 మిలియన్ టన్నుల మేర దిగుమతులను తగ్గించడం ద్వారా విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన సరఫరాను భద్రపరచవచ్చని కేంద్రం భావిస్తోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉన్నందున, దీనివల్ల విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి ఇబ్బంది రాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర సూచనలలో భాగంగా, విద్యుత్ ప్లాంట్లు బొగ్గును ఎక్కువగా స్థానికంగా వినియోగించడం, దిగుమతులపై ఆధారపడకుండా ఉత్పత్తిని కొనసాగించడం ప్రాధాన్యత కల్పించారు. ఇప్పటికే దేశంలో నాలుగింట మూడో విద్యుత్ ఉత్పత్తి బొగ్గుపైనే ఆధారపడి ఉంది. ఈ విధానం విద్యుత్ పరిశ్రమలో నిరంతర సరఫరా, ఖర్చు నియంత్రణ మరియు సాధారణ ఉత్పత్తి స్థాయిని మద్దతిస్తుంది.

వేసవి నెలల్లో విద్యుత్ వినియోగం పెరుగుతుందని కోల్ ఇండియా పేర్కొంది. ప్లాంట్లకు అవసరమైన అదనపు బొగ్గు సరఫరా కోసం కంపెనీ ఇప్పటికే జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నెల 25 వరకు కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వ ఉంది. మార్చి 31 నాటికి ఇది మరింత పెరిగి, విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన మొత్తం సరఫరా 175.5 మిలియన్ టన్నులుగా ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

విద్యుత్ ప్లాంట్ల వద్ద ప్రస్తుతం ఉన్న 55 మిలియన్ టన్నుల బొగ్గు, ఇతర గూడ్స్ షెడ్లు, వాషరీలు, పోర్ట్‌లలో నిల్వ కలిపి మొత్తం 175.5 మిలియన్ టన్నుల బొగ్గు భద్రపరచబడింది. ఈ విధంగా వేసవి సమయంలో అధిక విద్యుత్ అవసరాలను తీర్చడానికి సరిపడే సరఫరా ఖచ్చితంగా అందుబాటులో ఉంటుంది.

కేంద్రం ఈ చర్యల ద్వారా విద్యుత్ ఉత్పత్తి లో ఎలాంటి ఆటంకాలు రాకుండా, దేశీయ బొగ్గు



వినియోగాన్ని పెంచి, దిగుమతులపై ఆధారపడకుండానే సుస్థిర విద్యుత్ సరఫరాను కొనసాగించదలచింది.




# ఇరాన్ సుప్రీం ఖమేనీ చనిపోయినా ఆగని దాడులు

● ముందెన్నడూ చూడని బలంతో ప్రతిదాడులు చేస్తామన్న ట్రంప్ ● ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్పై అమెరికా భీకర దాడులు

● అమెరికా, ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరికలు

● నేరస్థులను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న కొత్త సుప్రీం



ఇజ్రాయెల్- అమెరికా, ఇరాన్ దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాలపై పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. అయినా దాడులు మాత్రం కొనసాగుతునే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఇంతకు ముందెన్నడూ చూడని బలంతో ప్రతిదాడులు చేస్తామని ట్రంప్ స్పష్టంచేశారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చిరించింది.

ఇరాన్ ఈ రోజు చాలా గట్టిగా దాడి చేయబోతుందని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్లో పోస్ట్ చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా దాడికి సిద్ధమైనట్లు ఇరాన్ ఇప్పుడే ప్రకటించిందని తెలిపారు. అయితే వారు అలా చేయకపోవడమే మంచిదని అన్నారు. ఎందుకంటే వారు అలా చేస్తే ఇంతకు ముందెన్నడూ చూడని శక్తితో మనం వారిపై విరుచుకుపడతామని హెచ్చరించారు.

**ఇజ్రాయెల్, అమెరికాకు ఇరాన్ వార్నింగ్ :** మరోవైపు, ఇరాన్ కూడా అమెరికా, ఇజ్రాయెల్కు వార్నింగ్. అమెరికా, ఇజ్రాయెల్ నాయకులు తమ రెడ్ లైన్ దాటారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాగర్ గాలిబాఫ్ తెలిపారు. అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంతలా అంటే ఇరాన్ దెబ్బకు మిమ్మల్ని మీరే అడుక్కోవాల్సి పరిస్థితి వస్తుందని అన్నారు. అంతేకాకుండా అమెరికా, ఇజ్రాయెల్ నేతలను మురికి నేరస్థులగా అభివర్ణించారు.

**ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరిక :** ఖమేనీ హత్య తర్వాత ఇరాన్ అధ్యక్షుడు మసౌద్‌పెజెష్కియాన్ స్పందించారు. నేరస్థులను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఖమేనీ హత్యను మహా నేరంగా అభివర్ణించారు. ఇజ్రాయెల్‌ను దుష్టశక్తిగా పేర్కొన్నారు. ఖమేనీ రక్తం మహా ప్రవాహంగా మారి అమెరికా-ఇజ్రాయెల్‌ను అణచివేస్తుందని, నేరాలను నిర్మూలిస్తుందని వివరించారు. ఈ దాడి ఇస్లామిక్ ప్రపంచం, షియా చరిత్రలో కొత్త అధ్యాయం తెరుస్తుందని చెప్పారు. తమ ప్రతీకార దాడులతో ఆయా దేశాలు చేసిన తప్పులకు పశ్చాత్తాపపడతాయన్నారు.

**ప్రతిదాడి ఖాయం: ఇరాన్ నేత అలీ లరిజానీ :** ఖమేనీ మృతిపై ఇరాన్‌లో సుప్రీం లీడర్ తర్వాత శక్తిమంతమైన నాయకుల్లో ఒకరైన అలీ లరిజానీ స్పందించారు. ఇరాన్ ప్రజల హృదయాలపై అమెరికా దాడులతో పొడిచిందని అన్నారు. తాము కూడా కచ్చితంగా అమెరికన్ల హృదయాలపై దాడి చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. తమ సైనిక దళాల చేసే ప్రతిదాడి మాత్రం చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. తాము తన్ని పారిపోబోమని అమెరికన్లకు తెలుసని పేర్కొన్నారు. ఖమేనీ సలహా బృందంలోని సభ్యుల్లో అలీ లరిజానీ నిర్ణయాత్మక వ్యక్తి. లరిజానీ ది సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అమెరికా దాడుల నుంచి బయటపడిన ఇరాన్ అత్యున్నత నేతల్లో ఆయన కూడా ఒకరు.

**ట్రంప్ పర్యవేక్షణ :** ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్పై అమెరికా భీకర దాడులు చేసింది. అయితే ఈ ఆపరేషన్ను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యవేక్షించారు. అందుకు సంబంధించిన ఫొటోలను వైట్హౌస్ తాజాగా ఎక్స్లో పోస్ట్ చేసింది. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లోని ట్రంప్ స్వగృహం మార్ ఎ లాగో రిసార్ట్‌లోని పర్యవేక్షించినట్లు ఉంది. ట్రంప్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్మీ కీలక జనరల్స్ సుసీ విల్లీస్, డాన్ కెయిన్ తదితరులు కూడా అక్కడే ఉన్నారు. సాధారణంగా హై వాల్యూ టార్గెట్స్పై జరిగే దాడులే అమెరికా అధ్యక్షుడి పర్యవేక్షణలో జరుగుతాయి. మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడావార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఫొటోను వైట్హౌస్ పోస్ట్ చేసింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు సౌదీ, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ నేతలతో కూడా టచ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతోపాటే ఇజ్రాయెల్ కూడా ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్ చేపట్టింది.

# అభివృద్ధికి కాంగ్రెస్ స్పీడ్ బ్రేకర్

● ఉత్తమ (బెస్ట్) పుదుచ్చేరి ఈ రాష్ట్రానికి తారక మంత్రం ● పుదుచ్చేరి ప్రజలకు కూడా ప్రయోజనం చేకూర్చేలా నిధులు ● మెరుగైన రోడ్లు, నీటి సరఫరా, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, పాఠశాలలు ఏర్పాటు ● పుదుచ్చేరి పర్యటనలో ప్రధాని నరేంద్రమోడీ





పుదుచ్చేరీ : పుదుచ్చేరి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ స్పీడ్ బ్రేకర్‌లా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, నేరాలు, పేదరికంతో ప్రజలు బాధపడ్డారని విమర్శించారు. ఇప్పుడు తమ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ పుదుచ్చేరి వృద్ధికి మరింత ఊపునిస్తుందని తెలిపారు. మునుపటి కాంగ్రెస్-డీఎంకే పాలనలో పుదుచ్చేరి ప్రజలు అపారమైన కష్టాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పుదుచ్చేరిలో రాజకీయ అస్థిరత ఏర్పడిందని అన్నారు. అవినీతి ఆరోపణలు, నేరాలు పెరిగిపోయాయని దుయ్యబట్టారు. పేదలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పుదుచ్చేరి జరిగిన ఓ సభలో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**పుదుచ్చేరికి రావడం గౌరవంగా ఉంది : ప్రధాని మోదీ**

నేను ఇంతకు ముందు ఇక్కడికి వచ్చినప్పుడు ఉత్తమ (బెస్ట్) పుదుచ్చేరి అనే మంత్రాన్ని ఇచ్చాను. ఉత్తమం అంటే వ్యాపారం, విద్య, ఆధ్యాత్మికత, పర్యాటకం అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి. గత నాలుగున్నరేళ్లలో పుదుచ్చేరిలో ఈ దార్శనికత కనిపిస్తోంది. పుదుచ్చేరి సుపరిపాలన, అభివృద్ధిని చూసింది. కేంద్రం, యూటీ ఒకే దార్శనికత, అంకితభావంతో పనిచేసనప్పుడు ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. పుదుచ్చేరిలో ఉండటం గౌరవంగా ఉంది. ఇది సిద్ధ సాధువులు, కవులు, స్వాతంత్ర్య సమరయోధుల భూమి. ఇక్కడి నుంచే సుబ్రమణ్య భారతి జాతీయవాద జ్వాలను రగిలించారు. శ్రీ అరబిందో ప్రపంచా నికి కొత్త ఆధ్యాత్మిక దృక్పథాన్ని ఇచ్చారు అని తెలిపారు.

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రికార్డు స్థాయిలో రూ. 12 లక్షల కోట్లు కేటాయించామని మోదీ తెలిపారు. దీనివల్ల పుదుచ్చేరి ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గతంలో రాష్ట్రాలకు మాత్రమే అందుబాటులో ఉండే మూలధన పెట్టుబడి పథకం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్)లో పుదుచ్చేరిని చేర్చామని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలకు ఎక్కువ నిధులు అంటే మెరుగైన రోడ్లు, నీటి సరఫరా, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి అనేక ప్రాజెక్టులని నిధులు కేటాయించడమేనని పేర్కొన్నారు. ఈ సౌకర్యాలు ప్రజల జీవితాలను నేరుగా మెరుగుపరుస్తాయని వెల్లడించారు.

**పుదుచ్చేరి తలసరి ఆదాయం పెరిగింది**

కేంద్రం, పుదుచ్చేరి సర్కార్ కలిసి ఒకే లక్ష్యంతో పనిచేయడం వల్ల పుదుచ్చేరి మంచి పాలన, అభివృద్ధిని చూసిందని మోదీ అభిప్రాయపడ్డారు. కేంద్రం, యూటీ ఒకే దార్శనికత, అంకితభావంతో పనిచేసినప్పుడు ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. పుదుచ్చేరి తలసరి ఆదాయంలో అద్భుతమైన పెరుగుదలను చూపించింది. డబుల్ ఇంజిన్ సర్కార్ పుదుచ్చేరి వృద్ధికి మరింత సాయం అందిస్తోంది. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. కొత్త లెక్చర్ హాళ్లు, బాలికల హాస్టల్, ఇతర సౌకర్యాలు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయి. ఆయుష్మాన్ భారత్ పథకం ఇప్పటికే కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణను అందిస్తోంది. పుదుచ్చేరి వైద్య పర్యాటక కేంద్రంగా మారగలదని విశ్వసిస్తున్నాను. ఇక్కడ ఇప్పటికే తొమ్మిది వైద్య కళాశాలలు ఉన్నాయి. ఈవీలు మన జీవితంలో కీలక భాగమైపోయాయి. పుదుచ్చేరి వంటి పర్యాటక కేంద్రంలో ఎలక్ట్రిక్ బస్సులు కాలుష్యాన్ని తగ్గించడంలో గేమ్ ఛేంజర్ కావచ్చు అని మోదీ పేర్కొన్నారు.

పుదుచ్చేరిలో గ్రామీణ, పట్టణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేలా వందల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పుదుచ్చేరి పట్టణంలో రద్దీని తగ్గించడానికి రూ.140 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్ నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే మరో రూ.1,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రకటించారు. పుదుచ్చేరి ఇప్పటికే వేలాది మంది పర్యాటకులకు వీకెండ్ ట్రిప్‌లకు ఆకర్షిస్తుందని కొనియాడారు. ఆధ్యాత్మిక, పర్యావరణ, పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులతో ఈ ప్రాంతం కొత్త శిఖరాలను అధిరోహించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, మోదీ పుదుచ్చేరిలో రూ.2700 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం చేశారు. అలాగే మరికొన్ని కొత్త పనులకు శంకుస్థాపన చేశారు.

# ఖమేనీ మృతికి వ్యతిరేకంగా కశ్మీర్‌లో నిరసనలు

● - 444 విమానాలు రద్దు చేసిన కేంద్రం!నిర్వహణ



న్యూఢిల్లీ ఇజ్రాయెల్-అమెరికా సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో నిరసనలు జరిగాయి. ఖమేనీ హత్యకు వ్యతిరేకంగా శ్రీనగర్ సహా జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో షియా ముస్లింలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వందలాది మంది నిరసనకారులు వీధుల్లో శాంతియుతంగా కవాతు చేశారు. లాల్‌చౌక్ వద్దకు భారీగా చేరుకున్న షియా ముస్లింలు ఖమేనీకి సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు అధికారులు తెలిపారు.

**ఫొటోలు, బ్యానర్ల ప్రదర్శన :** ఈ నిరసనల్లో పాల్గొన్నవారు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఫొటోలు, ఇరాన్‌కు మద్దతుగా పోస్టర్లను ప్రదర్శించారు. నల్ల జెండాలను చేత పట్టుకున్నారు. అలాగే సంప్రదాయ సంతాప గీతాలను (నౌహా) ఆలపించారు. ఆదివార మా ప్రియమైన నాయకుడు అలీ ఖమేనీ అమరుడయ్యారు. ఆయనకు శాంతి యుతంగా సంతాపం తెలియజేస్తున్నాం. అని ఓ నిరసనకా రుడు అన్నాడు. విప్లవాత్మక సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ ఇక లేరని వార్త తెలిసిన నుంచి తామందరం చాలా బాధపడ్డామని మరో నిరసనకారుడు తెలిపాడు. ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ కలిసి దారుణంగా హత్య చేశాయని ఆరోపించాడు. అలాగే, ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూకు చెందిన షియా మతాధికారి మౌలానా యూసుబ్ అబ్బాస్ సైతం ఖమేనీ మృతిపై స్పందించారు. తాము బలిదానాలకు భయపడమని తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వారు ఎల్లప్పుడూ గుర్తుంచుకునే విధంగా తగిన సమాధానం ఇస్తామని ఇరాన్ గట్టిగా చెప్పిందని గుర్తు చేసుకున్నారు.

**ఇరాన్ జెండా అవనతం :** మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం నేపథ్యంలో దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన మృతికి సంఘీభావంగా ఇరాన్ జెండాను అవనతం (జెండాను కర్రకు సగం ఎత్తులో ఎగరెయ్యడం) చేసింది. ఈ విధంగా తమ దేశాధినేతకు నివాళులర్పించింది. కాగా, ఇజ్రాయెల్, అమెరికా కలిసి చేసిన దాడుల్లో ఖమేనీ మరణించారు. అలాగే ఆయన కూతురు, అల్లుడు, మనవరాలు చనిపోయారు. ఈ విషయాన్ని ఇరాన్ మీడియా ఆధివారం ఉదయం ధ్రువీకరించింది. ఖమేనీ మృతికి 40 రోజుల పాటు సంతాప దినాలు పాటించనున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది.

**444 విమానాల రద్దు! :** మరోవైపు, పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో భారత పౌర విమానయాన శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆదివారం (మార్చి 1) 444 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని ప్రకటించింది. ఇరాన్, పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాలపై గగనతల పరిమితుల కారణంగా ఫిబ్రవరి 28న దేశీయ విమానయాన సంస్థల 410 విమానాలు రద్దు అయ్యాయి. మార్చి 1న 444 విమానాలు రద్దు అయ్యే అవకాశం ఉంది. అని పౌర విమానయాన శాఖ ఎక్స్ పోస్టులో పేర్కొంది. ప్యాసింజర్ అసిస్టెన్స్ కంట్రోల్ రూమ్ ప్రయాణీకుల సమస్యలను పర్యవేక్షిస్తూ సత్వర పరిష్కారాన్ని అందిస్తుంది. ఫిబ్రవరి 28న ఎయిర్‌సేవా 216 ఫిర్యాదులను అందుకుంది. అదే సమయంలో 105 ఫిర్యాదులను పరిష్కరించాం. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు అన్ని ఎయిర్‌లైన్స్ సంస్థల సిబ్బంది సాయపడతారు అని కేంద్ర విమానయాన శాఖ పేర్కొంది.

**విమానాశ్రయాల్లో ప్రయాణికులు :** మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో విమానాల రద్దవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముంబయి విమానాశ్రయంలో ప్రయాణికులు చిక్కుకున్నారు. మరోవైపు, జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు వెళ్లే రెండు విమానాలు ఆదివారం రద్దయ్యాయి.

**ఇండియన్ ఎంబసీ ప్రకటన :** మరోవైపు, సౌదీ అరేబియాలో ప్రయాణ అంతరాయాలు ఎదుర్కొంటున్న భారతీయ ప్రయాణికులు వివిధ హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా రాయబార కార్యాలయాన్ని సంప్రదించవచ్చని రియాద్‌లోని ఇండియన్ ఎంబసీ పేర్కొంది. గగనతల మూసివేతలు, విమానాల రద్దు కారణంగా ప్రయాణ అంతరాయాలను ఎదుర్కొంటున్న సౌదీ అరేబియాలోని ఏ భారతీయ ప్రయాణీకుడైనా 24గంటలు అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా రాయబార కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. భారతీయ ప్రయాణీకులకు సహాయం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివిధ భారతీయ విమానయాన సంస్థలు హామీ ఇచ్చాయి. అని ఇండియన్ ఎంబసీ తెలిపింది.

పశ్చిమాసియా ప్రాంతంలో ఘర్షణ పరిస్థితుల నేపథ్యంలో ఇండియాలో చిక్కుకున్న ఫారినర్స్ కోసం భారత విదేశాంగ శాఖ కీలకప్రకటన చేసింది. తమ ప్రయాణ ప్రణాళికలను మార్చు కోవాలనుకున్నవారు, వీసా పొడిగింపు వంటి సహాయం అవసరమైన విదేశీయులు ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసును సంప్రదించాలని స్పష్టం చేసింది. సంబంధిత ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు వారికి సహాయం చేస్తుందని పేర్కొంది.

# దీదీ నుంచి బంగాల్ విముక్తి మా లక్ష్యం

● అక్రమ చొరబాటుదారులకు అండగా మమతా బెనర్జీ ● బీజేపీ చీఫ్ నతిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు



కోల్‌కతాఅవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్‌ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన పరిబోర్తన్ (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూచ్ బెహార్‌లో పార్టీ చేపట్టిన పరిబోర్తన్ యాత్ర ప్రారంభించిన ఆయన, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు.

**దేశ భద్రతకు ముప్పు!** ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించే ప్రయత్నం ఎలక్షన్ కమిషన్ చేస్తే, దానిని మమతా బెనర్జీ అడ్డుకునే ప్రయత్నం చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. మమతా బెనర్జీ తన పార్టీ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడం కోసం, ఓటర్ల జాబిలోని చొరబాటుదారులకు రక్షించేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లారు అని విమర్శించారు. అయితే ఈసీ మాత్రం బంగాల్ యువత ఉద్యోగులను కొల్లగొడుతున్న సుమారు 50 లక్షల మందికిపైగా అక్రమ చొరబాటుదారుల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించామని, రాష్ట్రంలో అక్రమ వలసదారుల కాలం చెల్లిందని అన్నారు. ఎస్ఐఆర్ పూర్తి చేసిన తర్వాత బంగాల్ ఓటర్ జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించినట్లు ఈసీ ఇంతకు ముందే ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి ఓటర్ జాబితా నుంచి తొలగించబడిన వారంతా చొరబాటుదారులే. వారు అసలైన పౌరులకు చెందాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలను, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అక్రమంగా అనుభవిస్తున్నారు. పైగా వాళ్లు దేశభద్రతకు ముప్పుగా పరిణమించారు. మమతాబెనర్జీ అక్రమ చొరబాటుదారుల కోసం నకిలీ పత్రాలు సృష్టించి రక్షణ కల్పిం చారు. కానీ ఇప్పుడు మనం (బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి) కేవలం చొరబాటు దారులను రాష్ట్రం నుంచి తరిమి వేయడమే కాకుండా, బంగాల్‌లోని అభివృద్ధిని పరుగులు పెట్టించే ఒక నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది.

**మమతా ఓటు బ్యాంక్ రాజకీయం:** మమతా బెనర్జీ ఓటర్ల జాబితాలోని చొరబాటుదారులను కాపాడుకోవడం కోసం కోర్టులకు పరుగులు తీశారు. ఎందుకంటే వారే ఆమె పార్టీకి ఓటు బ్యాంక్. కానీ రాష్ట్రంలో మహిళలు అవమానాలకు గురవుతుంటే మాత్రం, ఆమె కళ్లు మూసుకున్నారు అని నితిన్ ఆరోపించారు. చొరబాటుదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, బంగాల్ నుంచి మిమ్మల్ని తరిమేసే సమయం ఆసన్నమైంది అని అన్నారు.

**ఏకంగా 63.66 లక్షల ఓటర్ల తొలగింపు :** బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ శనివారం అధికారిక గణాంకాలు విడుదల చేసింది. గతేడాది నవంబర్‌లో ప్రారంభించిన ఎస్ఐఆర్ ద్వారా 63.66 లక్షల ఓటర్ల పేర్లను (మొత్తం ఓటర్లలో 8.3 శాతం) తొలగించామని స్పష్టం చేసింది. దీనితో రాష్ట్ర ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు చేరింది. 2002 తరువాత జరిగి ఈ భారీ ప్రక్షాళనలో మరో 60.06 లక్షల మంది ఓటర్లను అండర్ అడ్జుడికేషన్ విభాగంలో ఉంచారు. వీరి అర్హతపై మరికొన్ని వారాల్లో న్యాయ విచారణ జరగనుంది. ఇది నియోజకవర్గాల స్థాయి సమీకరణాలను మరింత మార్చే అవకాశం ఉంది. 2025 డిసెంబర్ 16న ప్రచురించిన ముసాయిదా జాబితాలో మరణం, వలసలు, నకిలీ నమోదులు, ఆచూకీ లేని కారణాలతో 58 లక్షల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. కాగా తాజా విచారణ, అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఫారమ్-7 ద్వారా మరో 5.46 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తీసేశారు. అంటే మొత్తంగా 63.66 లక్షల పేర్లను అధికారికంగా తొలగించారు.

# ఫ్యాక్టరీలో భారీ పేలుడు

ఆదివారం తెల్లవారుజామున భారీ పేలుడు - 17 మంది మృతి

- 18 మందికి గాయాలు- దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం



ముంబై : మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. నాగ్‌పూర్ జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 17 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని కాటోల్ తహసీల్ పరిధిలోని రౌల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘటన జరిగింది. ఉదయం 7 నుంచి 7.15 గంటల మధ్య డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు.

**సహాయక చర్యలు చేపట్టిన అధికారులు :** పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే, ఫ్యాక్టరీ భవనం పూర్తిగా ధ్వంసమై శిథిలాలు సుమారు 500 నుంచి 700 మీటర్ల దూరం వరకూ ఎగిరి పడింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పేలుడు తర్వాత అక్కడ భారీ అగ్ని ప్రమాదం కూడా చెలరేగింది. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది సుమారు నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించారు. అనంతరం మంటలను అదుపులోకి తెచ్చి సహాయక చర్యలను వేగవంతం చేశారు.

**మృతుల్లో ఎక్కువ మంది మహిళలే :** పోలీసుల ప్రకారం, ఘటనాస్థలంలో పనిచేస్తున్న కార్మికుల్లో 17 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉన్నట్లు తెలుస్తోంది. మరో 18 మంది తీవ్ర గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని తక్షణమే నాగ్‌పూర్ నగరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్ సహా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సహాయక చర్యలకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టాయి. అదేవిధంగా పేలుడు పదార్థాల భద్రతను పర్యవేక్షించే సంబంధిత విభాగాల బృందాలు కూడా ఘటనాస్థలానికి చేరుకున్నాయి. ఆ ఫ్యాక్టరీలో గనుల పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం అవసరమైన పారిశ్రామిక పేలుళ్లు, డిటోనేటర్లు, అనుబంధ ఉత్పత్తులు తయారు చేస్తారు. డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఏదైనా సాంకేతిక లోపం లేదా నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణం ఏమిటన్నది దర్యాప్తు అనంతరం స్పష్టమవుతుందని తెలిపారు.

**మొత్తం సీల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించింది. అలాగే ప్రమాదానికి గల కారణాలపై సవివర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఘటన అనంతరం ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాన్ని పూర్తిగా సీల్ చేశారు. అనుమతి లేకుండా ఎవ్వరినీ అక్కడికి వెళ్లనివ్వడం లేదు. అయితే ఘటనపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. పేలుడు సంఘటన చాలా దురదృష్టకరమని తెలిపారు. నేను స్థానిక పరిపాలనతో నిరంతరం సంప్రదిస్తున్నాను. జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా ఘటనా స్థలంలో ఉన్నాయి. , బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇప్పటివరకు 17 మంది మరణించారు. 18 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే నాగ్‌పూర్‌కు తరలించారు. వారు త్వరగా కోలుకోవాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాం అని తెలిపారు.

# విదేశాంగ విధానాలు ఫెయిల్

మోదీ సర్కారు వల్లే భారత్ భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోంది

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించదెందుకు?

, భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనన్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇంఛార్జి జైరాం రమేశ్



న్యూఢిల్లీ : మోదీ సర్కారు విదేశాంగ విధానం విఫలమవుతున్నందుకు, మన దేశం భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది. ఇరాన్‌పై దాడికి అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్న వేళ, ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించి ప్రధాని మోదీ పెద్ద తప్పు చేశారని హస్తం పార్టీ మండిపడింది. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇంఛార్జి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజుల తర్వాత ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయని ఆయన గుర్తుచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ పార్లమెంటు (నెస్సెట్)లో ప్రధాని మోదీ ప్రసంగించి, పిరికితనంతో నైతికతకు నీళ్లు వదిలిన విషయాన్ని యావత్ ప్రపంచానికి చాటుకున్నారని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

# ఇరాన్ గుండెకాయ లక్ష్యం

టెహ్రాన్పై ఇజ్రాయెల్ భీకరదాడులు - దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

అమెరికా స్థావరాలపై ప్రతిదాడులకు దిగిన ఇరాన్-



న్యూఢిల్లీ ఇరాన్ రాజధాని టెహ్రాన్ను లక్ష్యంగా చేసుకుని ఆదివారం ఇజ్రాయెల్, అమెరికాలు మరోసారి దాడులకు పాల్పడ్డాయి. ఈ పేలుళ్ల ధాటికి భారీగా పొగలు రావడమే కాదు, భూమి కూడా కంపించింది. ఇరాన్ రాజధానికి గుండెకాయ లాంటి కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే స్పష్టం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే తాము టెహ్రాన్ వెళ్లే మార్గాన్ని క్లియర్ చేసుకున్నామని, రెండో రోజున సెంట్రల్ టెహ్రాన్పై దాడులు చేస్తున్నామని పేర్కొంది. అయితే కచ్చితమైన లక్ష్యం ఏంటనేది మాత్రం చెప్పలేదు. అయితే ఇరాన్ పోలీస్ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ టెలివిజన్ ఆఫీస్లు ఉన్న పరిసరాల్లో ఈ పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది.

**అమెరికా స్థావరాలపై ఇరాన్ కౌంటర్ ఎటాక్ :** ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి చెందిన నేపథ్యంలో ఆదేశం ప్రతీకార దాడులకు దిగింది. తాజాగా పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడు లు చేస్తోంది. వీటిలో ఇజ్రాయెల్లోని టెల్ నోఫ్ ఎయిర్బేస్, ఇజ్రాయెల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం హాకిర్యాలతోపాటు రక్షణ రంగ ఫ్యాక్టరీలు కూడా ఉండడం గమనార్హం

# ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

నౌకలో భారతీయులు

యూఏఈ, సౌదీ, కువైట్, ఖతార్‌లపైనా దాడులు



న్యూఢిల్లీ : అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. దీంతో ఈ యుద్ధ మరింత తీవ్రంగా మారింది. ఇరాన్ మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా మిత్రదేశాలైన యూఏఈ, సౌదీ, కువైట్, ఖతార్‌లపై దాడులు చేస్తోంది. మధ్యప్రాచ్యంలోని యూఎస్ మిలిటరీ స్థావరాలపై క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది.

ఇదిలా ఉంటే, చమురు రవాణాకు కీలకంగా ఉన్న " హార్ముజ్ జలసంధి"ని మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ జలసంధి గుండా వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి చేసింది. పలావు జెండా ఉన్న చమురు ట్యాంకర్ ఒమన్‌లోని ముసాందం ద్వీపకల్పాన్ని దాటుతుండగా ఢీకొట్టింది. ఈ దాడిలో కనీసం నలుగురు గాయపడినట్లు తెలుస్తోంది. ఈ నౌకలో 15 మంది భారతీయులు, ఐదుగురు ఇరానియన్ జాతీయులు ఉన్నారు. ఒమన్ వాణిజ్య నౌకాశ్రయం దుక్మ్‌పై డ్రోన్ దాడులు జరిగిన తర్వాత ఈ సంఘటన జరిగిందిఐ ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ ప్రకారం.."ఆయిల్ ట్యాంకర్ పేరు స్కైలైట్, 15 మంది భారతీయులు, ఐదుగురు ఇరానియన్ పౌరులు సహా 20 మంది సిబ్బందితో ప్రయాణిస్తోంది. ముసాందంలోని ఖాసబ్ ఓడరేవు నుండి ఐదు నాటికల్ మైళ్ల దూరంలో దాడి జరిగింది. దాడి తర్వాత సిబ్బందిని ఖాళీ చేయించారు." అని తెలిపింది.




## రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది

**మరో రెండేళ్లు ఓపిక పట్టండి - మూసీ బాధితులకు కేటీఆర్ భరోసా**

**బాధితులకు అండగా ఉంటామని హామీ**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇండ్లను కూలగొట్టడం భూములను అమ్మ డం, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేయ డం ఇదే రేవంత్ రెడ్డి పరిపాలన అని విమర్శిం చారు. మూసి పేరిట తాను చేస్తున్న స్కామ్ కోసం వేలాదిమంది ఇండ్లను రేవంత్ కూలకొడుతున్నారని మూసి బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆదివారం నాడు హైదరాబాద్‌లోని మూసీ బాధితుల కోసం నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో కేటీఆర్ పాల్గొన్నారు. మూడున్నర కిలోమీటర్ల పాటు అనేకమంది బాధితులను కలుస్తూ ముందుకు సాగారు.ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా వేడుకున్నా చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా.. కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి పాల్పడుతున్నదని మండి పడ్డారు. ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200 కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని ఆరోపించారు.

## తెలంగాణలో మొదలైన భానుడి ప్రతాపం..

**3 నుంచి 7 వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం**

**39 నుండి 41 సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతల నమోదు !!**

**తెలంగాణ వాతావరణ శాఖ హెచ్చరిక**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : చలికాలం ఇలా ముగిసిందో లేదో ఎండ తీవ్రత అప్పుడే భారీగా పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న క్రమంలో వాతావరణ శాఖ కీలక అలర్ట్ జారీ చేసింది. మార్చి నెల ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని తెలంగాణ వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా మార్చి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉష్ణోగ్రతలలో భారీ పెరుగుదల కనిపిస్తుందని, పగటి పూట ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది.

**జిల్లాల వారీగా అంచనాలు :** వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలు అయిన భద్రాద్రి, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు 39 సెంటిగ్రేడ్ నుండి 41 సెంటిగ్రేడ్ వరకు నమోదు కావొచ్చని అంచనా వేశారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు 36 సెంటిగ్రేడ్ నుంచి 37 సెంటిగ్రేడ్ వరకు చేరుకునే అవకాశం ఉంది. అలాగే మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత 37 సెంటిగ్రేడ్ నుంచి 39 సెంటిగ్రేడ్ వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. వేసవి కాలం అధికారికంగా ప్రారంభమైనందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగినంత నీరు తాగుతూ శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా చూసుకోవాలని వాతావరణశాఖ వర్గాలు చెబుతున్నాయి.

## విద్యార్థులకు ఐప్యాడ్ గిఫ్ట్ ఇస్తా

**విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించుకోండి**

**సిద్దిపేట అన్నింట్లో ఆదర్శం.. పది ఫలితాల్లో ఫస్ట్ రావాలి**

**బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సిద్దిపేట అన్నింట్లో ఆదర్శంగా ఉంది.. పది ఫలితాల్లో ఫస్ట్ రావాలన్నదే తపన అని బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో విజయీభవ ప్రేరణ కార్యక్రమంలో ఆదివారం నాడు పాల్గొని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి మంచి మార్కులతో పాసైతేనే మీ రాత మారుతుంది అన్నారు. మంచి మార్కులు సాధిస్తే ఐ ప్యాడ్ గిఫ్ట్‌గా ఇస్తా అన్నారు. రాష్ట్రమంతా వస్తున్న బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు ఒక ఎత్తు.. మన సిద్దిపేట స్టూడెంట్స్‌కు వస్తున్న సీట్లు ఒకెత్తు అన్నారు. ఈ ఏడాది పది ఫలితాలలో సిద్దిపేటకు మొదటి స్థానం తెచ్చి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తేవాలని అన్నారు. నియోజకవర్గం నుంచి 2875 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. సొంత ఖర్చులతో ప్రత్యేక తరగతులకు స్నాక్స్ ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. మీ అమ్మ నాన్నలకు టివిలు బంద్ చేయించాలి మంచిగా చదవించాలని ఫోన్ లో సూచించినట్టు వెల్లడించారు. ఇంట్లో ఉండి చదువుకోవడానికి డిజిటల్ కంటెంట్ బుక్స్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆత్మవిశ్వాసంతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరతారని హితబోధ చేశారు. బాగా చదివి ఆల్ ఇండియా సర్వీస్ లో స్థానం సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి టాప్ ర్యాంక్ సాధించిన 30 మంది విద్యార్థులకు ఐ ప్యాడ్ గిఫ్ట్ గా ఇస్తానని హరీష్ రావు హామీ ఇచ్చారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



తెలంగాణ బ్యూరోప్రతినిధిః రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను స్వంత భవనాలకు మార్చే కార్యక్రమంలో భాగంగా, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నూతన ప్రభుత్వ భవనానికి మార్చి ఘనంగా ప్రారంభించారు. నూతన కార్యాలయాన్ని ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ అరవింద్ బాబు మాట్లాడుతూ, అద్దె భవనంలో ఎదురైన సౌకర్యాల లోపాలు ఇకపై ఉండవని, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ కార్యాలయంలో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో స్థానిక నాయకులు వేముల రామకృష్ణ (విద్యార్థి జేఏసీ), వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్, మంగళవారం శ్రీనివాస్, నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు పాల్గొన్నారు. అలాగే డాక్యుమెంట్ రైటర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి జుబేర్, సభ్యులు సాయి అమరేందర్, రమేష్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంద్రపాల్ రెడ్డి, పల్ల చెరువు మహేష్, లలిత్, శ్రావణ్ తదితరులు కూడా కార్యక్రమానికి హాజరై అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రభుత్వ భవనానికి మారడంతో ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని, పార్కింగ్ మరియు ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలను స్వంత భవనాల్లోనే కొనసాగించే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించారు.

# ఇంకెంత కాలం మోసం

● ఇచ్చిన హామీలు అమలు చేయరా? ● బీసీల రిజర్వేషన్ల సంగతి తేల్చండి ● ఆ తరువాతే ఎన్నికలు నిర్వహించండి

● రిజర్వేషన్లను 42శాతం ఇచ్చిన తర్వాత జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికలు జరపాలి.

● 14 బి.సి సంఘాల సమావేశంలో బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్యడిమాండ్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దాని ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాలు విజ్ఞప్తి చేశారు. ఈరోజు 14 బీసీ సంఘాలు డాక్టర్ బ్యాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో బీసీ భవన్ నందు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభసభ్యులు ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సమస్యకు ఒకవైపు న్యాయ పరిష్కారం, ఇంకోవైపు రాజ్యాంగ పరమైన మద్దతు కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో పోరాటం చేయాలని బీసీ సంఘాలు కోరాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీ వర్గానికి చెందినవారు. ఆయన నాయకత్వంలో బీసీలకు ఏదైనా అభివృద్ధికి పథకం, రిజర్వేషన్లు సాధ్యం. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఒక్క రోజైన బి.సి.ల రిజర్వేషన్లపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అలాగే అఖిలపక్షంతో ప్రధానమంత్రిని ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. గతి ఒక సంవత్సరం నుంచి 100 సార్లుకు పైగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, దర్నాలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు, కుల సంఘాల సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సర్వా గ్రహ దీక్షలు, ధర్మదీక్షలు, న్యాయ పోరాట దీక్షలు చివరకు రాష్ట్రస్థాయి బంద్ జరిపాం. అయినా ప్రభుత్వం ఉద్యమాలను స్పందించకుండా ఉద్యమాలు గుర్తించకుండా గుడ్డిగా బలవంతంగా బీసీలకు అన్యాయం చేస్తూ ముందుకు వెళుతుంది. దీనిని ఎట్టి పరిస్థితిలో సహించమని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ప్రజా స్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేస్తున్నాం. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పైగా బీసీ సంఘాలను నాయకులను బెదిరించి, హెచ్చరించి ఉద్యమాలను తమదారుకి తెచ్చుకుంటూ ఉద్యమాలు నీరు గార్చడానికి కుట్రలు చేస్తుంది. దీనిని ఎట్టి పరిస్థితులలో సహించమని హెచ్చరించారు. ఉద్యమం బీసీ వాదం ప్రజలలోకి వెళ్తుంది. ఎవరు ఆపిన ఆగదని దీనిని ప్రజలే ముందుకు నిడిపిస్తారని హెచ్చరించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా కోర్టులలో బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి. కానీ ఆ రాష్ట్రాలలోని బీసీలు తిరగబడలేదు. కానీ మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరపడం వందల సార్లు ప్రదర్శనలు సమావేశాలు జరపడం బి.సి ఉద్యమం పల్లె పల్లెకు వెళ్ళింది. ఇంటింటికి వెళ్ళింది. ఇది ప్రజా ఉద్యమంగా మారిందని దీనిని ఎవరు అడ్డుకోలేదని అన్నారు.

**హై కోర్టులో 42శాతం కేసును తొందరగా విచారణ చేపట్టాలి.**

హై కోర్టులో నడిచే కేసు బలంగా యుంది రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా న్యాయబద్ధంగా జీవో నెం.9 యుంది. కాబట్టి పెంచిన రిజర్వేషన్ల కేసు గెలుస్తుంది. ఈ కేసును తొందరగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243--6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశాడు. జనాభా లెక్కలు తీసి న్యాయ బద్ధం చేశారు. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారు. అన్ని కోణాలలో పెంపుదలకు మద్దతు ఉంది. ఈ సమావేశంలో . అనంతయ్య అధ్యకులు రాష్ట్ర బి.సి ఐక్య వేదిక భీమరాజు అధ్యకులు- రాష్ట్ర బి.సి ప్రజా సమితి, . రాజేందర్ అధ్యక్షులు - తెలంగాణా బి.సి సంఘం, పర్లగోర్ల మోదీ రాందేవ్ అధ్యక్షులు- ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థి, కృష్ణుడు అధ్యక్షులు -రాష్ట్ర బి.సి ఉపాధ్యాయుల సంఘం, పగళ్ళ సతీష్ -అధ్యక్షులు- రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం గుజ్జ కృష్ణ ప్రధాన కార్యదర్శి-రాష్ట్ర బిసి సంఘం , గోరిగ మల్లేషే యాదవ్ -చైర్మన్- రాష్ట్ర బి.సి ఫ్రంట్, నిరంజన్ బి.సి ఆర్టీసీ సంఘం తదితర సంఘ నాయకులూ పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిది గడ్డపార ప్రభుత్వం

● ప్రభుత్వం హైకోర్టు స్టేధికరిస్తుందా ? ●రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేద ప్రజల ఇళ్ళు కూల్చేసింది

● పేద ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుంది ● ఖమ్మంలో కూల్చివేతలను బిజెపి ఖండిస్తోంది

● పేదలకు అండగా బిజెపి ఉంటుంది ● బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తుందని, ఖమ్మం అర్బన్ వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఖమ్మంలో పర్యటించారు. ఖమ్మం జిల్లా, ఖమ్మం అర్బన్ వెలుగుమట్లలో కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని 147, 148, 149 సర్వే నంబర్ల భూదాన్ భూముల్లో గత అనేక సంవత్సరాలుగా, దాదాపు 2013-14 నుంచి, సుమారు 100 గజాల చొప్పున భూమి తీసుకుని దాదాపు 600 పేద కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఈ కుటుంబాలు కూలీ పనులు, హమాలీ పనులు చేస్తూ పైసా పైసా కూడబెట్టుకుని, కొందరు బంగారం అమ్ముకుని తమ సొంత సంపాదనతో ఇక్కడ ఇళ్లు కట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. వారి పిల్లలు కూడా ఇక్కడే చదువుకుంటున్నారన్నారు. ఈ 600 కుటుంబాల్లో దాదాపు 1,800 మంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. గతంలో ఈ భూములపై కోర్టులో కేసులు నడుస్తున్న సమయంలో అనేక సార్లు స్టేటస్ కో ఆదేశాలు జారీ అయ్యాయి. ఎవిక్షన్ చేయొద్దని, జోక్యం చేసుకోవద్దని కోర్టు స్పష్టంగా చెప్పినా కూడా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. భూదాన్ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగులోకి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దారుణం. కానీ ఆ పేరుతో ఇక్కడ పేద ప్రజలపై దాడి చేసి, వారిని వేధించి, వారు కట్టుకున్న కలలను కూల్చివేసి రోడ్డున పడేయడం ఏం మానవత్వం? రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విధంగా వ్యవహరించే అధికారం ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేతిలో గడ్డపార వేసుకుని తిరుగుతున్నట్టుగా పేద ప్రజల ఇళ్లను కూలగొడుతున్నారు. ఇది ప్రజల పట్ల అమానుష వైఖరి అని అన్నారు. బీజేపీ నాయకులు అక్కడే అన్నదానం కార్యక్రమం నిర్వహించి, రోడ్డున పడిన కుటుంబాలకు తక్షణ భరోసా కల్పించారు. పేదల పక్షాన నిలబడటం మా పార్టీ కర్తవ్యం అని అన్నారు. పూర్తిగా ప్రజావ్యతిరేక ప్రభుత్వం. రేవంత్ రెడ్డి గడ్డపార ప్రభుత్వాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాల కోసం పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడం పూర్తిగా సరికాదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకొని ఇక్కడే పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అయినా గూడు కల్పించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా 2023లో ఇక్కడి కుటుంబాలను నిర్వాసితులను చేయాలని ప్రయత్నాలు జరిగాయి. కానీ పేదలకు గూడు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. పేదలకు గూడు, విద్య, కూడు కల్పించాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు.
హైకోర్టు స్టే ఆదేశాలను ధిక్కరిస్తూ ఇంత దారుణంగా కూల్చివేయడం అత్యంత దారుణం. కోర్టులంటే లెక్కలేని పరిస్థితి ఏర్పడింది. చట్టపరమైన ప్రక్రియలను పక్కన పెట్టి బలవంతపు చర్యలు చేపట్టడం దారుణం అని అన్నారు.
ఇక్కడ కలెక్టరేట్ కార్యాలయం వచ్చిన తర్వాత భూముల విలువ పెరిగింది. హైవే ప్రాజెక్టు కూడా రానున్న నేపథ్యంలో ఈ విలువైన భూముల్లో పేదలు ఉండకూడదనే దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారిని తరిమేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇక్కడే పేద ప్రజలకు శాశ్వత నివాస గృహాలు కట్టించి ఇవ్వాలని మేము స్పష్టంగా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. బీజేపీ పేదలకు అండగా నిలుస్తుంది. పేదల హక్కుల కోసం పోరాడుతుందన్నారు.

# మఠాలు, పీఠాలపై దాడులు సహించం

● ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడితే హిందూ సమాజం తిరగబడుతుందని హెచ్చరిక ● మఠంపై దాడులకు దిగడం హిందూ భక్తుల విశ్వాసాలను గాయపరచడమే..! ● స్వామీజీలను అవమానించేలా చర్యలు చేపట్టడం తీవ్ర అభ్యంతరకరమని ఆక్షేపణ ● పీఠం భూముల పరిరక్షణకు ప్రత్యేక జీవోను విడుదల చేయాలని డిమాండ్ ● వి.హెచ్.పి. ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్రంలోని మఠాలు, పీఠాలపై దాడులు సహించబోమని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి హెచ్చరించారు. భాగ్యనగర్ శివారు ప్రాంతమైన కోకాపేట శారద పీఠం భూములపై ప్రభుత్వ చర్య తీవ్ర నేరమన్నారు. ఆదివారం మధ్యాహ్నం శారద పీఠాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ బృందాలు పరిశీలించాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వాత్మానంద స్వామి గారితో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం దాడికి పాల్పడిన తీరును విశ్వహిందూ పరిషత్ నాయకులకు స్వామీజీ వివరించారు. ఈ సందర్భంగా పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మఠాలు, పీఠాలు, మందిరాలపై దాడులు చేస్తే సహించబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వత్తాసు పలుకుతూ హిందూ మందిరాలపై దాడులకు పాల్పడితే బుద్ధి చెబుతామన్నారు. శారద పీఠంపై రాష్ట్ర ప్రభుత్వం పన్నిన కుట్ర హిందువుల విశ్వాసాలను గాయపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని లాక్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వం వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారుల తప్పుడు నివేదికల ఆధారంగా హిందువుల విశ్వాసాల పై దాడికి పాల్పడితే రాజ్యాంగం హర్షించదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు మద్దతుగా హిందూ స్వామీజీలను హింసిస్తే హిందూ సమాజం తిరగబడుతుందని బాలస్వామి హెచ్చరించారు. శారదా పీఠం స్థలాన్ని లాక్కోవాలని జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకొని, పీఠం భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పీఠం భూములపై ఏకపక్ష చర్యలు తీసుకోవడం అనేది హిందూ ధార్మిక భావోద్వేగాలను దెబ్బతీయడమేనని ఆయన విమర్శించారు. శారద పీఠం కేవలం భూమి కాదని అది భక్తుల విశ్వాసానికి నిలయం అన్నారు. వేదాధ్యయనానికి కేంద్రంగా, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్న పీఠాలపై పగబట్టి కూల్చివేయడం హిందూ వ్యతిరేక చర్య అని అన్నారు. ధార్మిక సంస్థల భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలన్నారు. స్వామీజీలతో పీఠాధిపతులతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం హిందూ సమాజం క్షమించదని పేర్కొన్నారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో స్వామీజీల పాత్ర అపారమైనదని, వారిని అవమానించేలా లేదా వారి సంస్థల స్వయం ప్రతిపత్తిని హరించేలా చర్యలు తీసుకుంటే విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం రాజ్యశ్యామల మాతను దర్శించుకుని పీఠం పరిసర ప్రాంతాలను, భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రామారావు, రంగనాథ్, అంకిత్, మహేష్, శంకర్ తోపాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# రెండు రాజ్యసభ స్థానాల్లో బీసీ, ఎస్సీ ఎస్టీలకు ఇవ్వాలి

● చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి ● ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు జనాభా ప్రకారం ఇవ్వాలి

● ఫీజులు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి ● కుమ్మెర సంఘటనపై స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలి

● కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను పూర్తిగా అమలు చేయాలి ● రాష్ట్ర పర్యటనకు వస్తున్న రాహుల్ గాంధీకి జాజుల శ్రీనివాస్ గౌడ్ బహిరంగలేఖ




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించేలా కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రానున్న బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. రేపు రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా రాహుల్ గాంధీకి బీసీ డిమాండ్లపై శ్రీనివాస్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగనన జరిగి, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి చట్టబద్ధంగా దక్కాలన్న రాహుల్ గాంధీ నినాదాన్ని, ఆచరణలో చూపించడానికి తెలంగాణ రాష్ట్రాన్ని సామాజిక న్యాయానికి ఒక మోడల్ గా రాహుల్ గాంధీ చేయాలని ఆయన కోరారు. అతి త్వరలో భర్తీ చేయబోయే రెండు రాజ్యసభ స్థానాలలో ఒకటి బీసీకి, రెండవది ఎస్సీ ఎస్టీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంబంధం లేని వారిని, ఇప్పటికే తమ జనాభా దామాషా కంటే ప్రాతినిధ్యం ఎక్కువగా రాజకీయంగా ఉన్న అగ్రకులాలకు అవకాశం ఇవ్వకుండా బీసీలకే ఇవ్వాలని ఆయన కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టులలో, ప్రభుత్వ కాంట్రాక్టులలో, రాష్ట్ర బడ్జెట్ లో, అన్ని స్థాయిలోనూ తెలంగాణలో జరిగిన కులగనన ఆధారంగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.
రాష్ట్రంలో లక్షలాదిమంది ఉన్నత విద్యను అభ్యసించే పేద బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఈబీసీ విద్యార్థులకు స్కాలర్షిప్ లు, ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ ఆదేశించాలని ఆయన కోరారు. ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల ఆధిపత్య వర్గాల దాడిలో రెండు నెలల పసికందు మరణించిన విషయంలో రాహుల్ గాంధీ తక్షణమే జోక్యం చేసుకొని నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని, బీసీ కుటుంబాలను ఆదుకోవాలని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా బీసీలకు కూడా బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక జనాభా ఉన్న బీసీల ఆకాంక్షలను గౌరవించకపోతే, బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా తగ్గదని, దేశంలో కాంగ్రెస్ పార్టీ ఓటమి జాబితాల ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా చేరుతుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కు హైదరాబాద్ ఆతిథ్యం

● మార్చి 8 నుండి మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ ● మెగా ఈవెంట్ కు ఆదిత్యం ఇవ్వనున్న గచ్చిబౌలి హాకీ స్టేడియం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. క్రీడా రంగంలో దేశంలోనే అత్యంత చురుకైన నగరంగా పేరుగాంచిన హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా వేడుకకు వేదిక కానుంది.ఫెడరేషన్ ఇంటర్నేషనల్ దే హాకీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 టోర్నమెంట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఈ పోటీలు మార్చి 8 నుండి 14, 2026 వరకు హైదరాబాద్‌లోని నూతనంగా పునర్నిర్మించిన గచ్చిబౌలీ హాకీ స్టేడియంలో జరుగనున్నాయి.

**పాల్గొనే జట్లు ఇవే :** ఈ క్వాలిఫయర్స్‌లో మొత్తం ఎనిమిది దేశాల జట్లు పాల్గొంటున్నాయివీటిలో భారత్ , ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఈ టోర్నమెంట్ 2026 మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు కీలక పాత్ర పోషించనుంది.

**అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ముఖ్యంగా స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రో టర్ఫ్ , ఆధునిక సదుపాయాలు , అత్యున్నత భద్రతా ఏర్పాట్లు , క్రీడాకారులు మరియు అధికారుల కోసం ప్రీమియం వసతి , అందుబాటులో ఉంచారు.భారత జట్టు, ఇంగ్లాండ్, స్కాట్లాండ్ మరియు ఉరుగ్వే జట్లు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకున్నాయి. అన్ని జట్లకు అంతర్జాతీయ ప్రమాణాల వసతి మరియు ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించారు.

**తెలంగాణ సంస్కృతి పరిచయం :** ఈ టోర్నమెంట్ సందర్భంగా నగరానికి విచ్చేసే క్రీడాకారులు మరియు అంతర్జాతీయ ప్రతినిధుల కోసం ప్రత్యేక వారసత్వ పర్యటనలు, వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపొందించనున్నారు.

**క్రీడాభివృద్ధికి తెలంగాణ కట్టుబాటు :** రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత వలన తెలంగాణలో అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు విజయవంతంగా జరుగుతున్నాయి. మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 నిర్వహణతో హైదరాబాద్ మరోసారి ప్రపంచ క్రీడా పటంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది. ఈ సందర్భంగా అన్ని జట్లు, అధికారులు, అభిమానులను తెలంగాణ ప్రభుత్వం హృదయపూర్వకంగా స్వాగతిస్తోంది.

## పేదలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయొద్దు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



ఖమ్మం: ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్లలో అర్హులైన పేదలకు ఈ నెల 15లోపు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5 లక్షలు దగ్గరుండి ఇప్పిస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికారులు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా సంయమనం పాటించాలని అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం భూదాన్ భూములపై ఆధారాలతోనే మాట్లాడుతున్నట్లు చెప్పారు. పేదలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. వెలుగుమట్ల గ్రామ సర్వే నంబర్లు 147, 148, 149లోని భూదాన్ భూముల్లో పలువురు ఇళ్లు నిర్మించుకోగా.. సీసీఎల్ఏ, హైకోర్టు ఆదేశాలతో ఈ నెల 24న అధికారులు 652 పైగా ఇళ్లను తొలగించారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూశాఖ విచారణలో నకిలీపత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగుచూడటంతో పలువురిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. అక్రమ గృహాల తొలగింపుతో రూ.250 కోట్ల విలువైన భూమిని స్వాధీనపరచుకున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

## హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ వద్ద భారీ భద్రత




హైదరాబాద్: అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గచ్చిబౌలి పోలీసులు అప్రమత్తమయ్యారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద సైబరాబాద్ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో నగరంలో నిరసన ర్యాలీలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా కాన్సులేట్ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుమారు 50 మంది పోలీసులతో కాన్సులేట్ వద్ద ప్రత్యేక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాన్సులేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని తాత్కాలికంగా మూసివేసి, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

# అగ్రరాజ్య ధిక్కారస్వరం

# సుప్రీం లీడర్

**దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలను శాసించిన అయతొల్లా అలీ ఖమేనీ**
**అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త మెరుపు దాడిలో మరణం**
**ప్రపంచ వ్యాప్తంగా విప్లవ వీరుడి మరణం పెను సంచలనం**



**దశాబ్దాల పాటు ఇరాన్‌ను తన గుప్పిట్లో ఉంచుకున్న సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఒక శకం ముగిసింది. 1989లో ఇస్లామిక్ విప్లవ పితామహుడు అయతుల్లా రుహోల్లా ఖొమేనీ మరణానంతరం బాధ్యతలు చేపట్టిన ఖమేనీ, 36 ఏళ్లకు పైగా దేశాన్ని ఏకఛత్రాధిపత్యంతో పాలించారు. ఇరాన్‌ను దాదాపు 36 ఏళ్లు తన ఉక్కుపిడికిలితో పాలించిన నియంత చనిపోవడంతో ఆ దేశంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆతని వారసుడుగా రెండవ కుమారుడు ఇరాన్ పగ్గాలు అందుకోనున్నారు. అమెరికా ఆధిపత్యాన్ని వెన్న చూపక ప్రశ్నించిన ఖమేనీ గురించి ఓ సారి పరికిస్తే....**

కొంత మంది కసితో కొడుతారు. కొంత మంది బలంగా కొడతారు. కానీ అమెరికా, ఇజ్రాయిల్ మాత్రం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనిని శ్రద్ధగా కొట్టిందనే చెప్పాలి. ఎంత శ్రద్ధగా అంటే.. తమకు అందిన పక్కా సమాచారంతో ఖమేని కుటుంబ సభ్యులతో పాటు కీలక నేతలందరు సమావేశామైన సమయంలోనే అదును చూసి దెబ్బ కొట్టింది. ఆ తర్వాత మొస్సాద్, సీఐఏ అందించిన పక్కా సమాచారంతోనే ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకున్న తర్వాతే ఇరానీ నేత ఖొమైనీ మృతి చెందినట్టు అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని వెంటాడుతున్న ప్రశ్న- ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అల్ ఖమేనీ బతికే ఉన్నారా అని.. ఇరాన్- అమెరికా సంయుక్త ఆపరేషన్ అనంతరం ఖమేనీ చనిపోయినట్టు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనౌన్స్ చేశారు. ప్రపంచ అగ్ర నేత ఆషామాషీగా ఇలాంటి ప్రకటన చేయడు. ఒకవేళ ఖమేని బతికే ఉంటే ఆయనకు సంబంధించిన ఓ వీడియోను ఇప్పటికే విడుదలై ఉండేది. అయితే ఏఐతో అలాంటి వీడియోలను విడుదల చేసినా.. అమెరికా వంటి ప్రపంచ అగ్రరాజ్యానికి దాన్ని పసిగట్టేస్తుంది.



ఈ నేపథ్యంలో ఖమేనీ వ్యవహారంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీ కుటుంబంలోని నలుగురు చనిపోయినట్లు ఇరాన్ మీడియా అధికారికంగా తెలిపింది. ఈ దాడిలో ఖమేని కూతురు, అల్లుడు, కోడలు, మనవడు చనిపోయినట్లు తెలిపింది. ఈ జాయింట్ ఆపరేషన్ లో ఖమేనీ ఇంటిపై బాంబులు వదిలినట్లు తెలిపింది. ఇందుకోసం ఇజ్రాయెల్ కొన్ని నెలలుగా పక్కా స్కెచ్ తో అంతా ప్లానింగ్ ప్రకారమే చేసినట్టు తెలుస్తుంది. కొన్ని నెలలుగా ఖమేనికి సంబంధించిన అనుపానులన్ని అది ఒడిసిపట్టుకుంది. ఎపుడు తింటాడు. ఎపుడు లేస్తాడు. ఎపుడు ఏ సమయంలో ఎలా ఉంటాడనే పక్కా సమాచారంతో పాటు శాటిలైట్, గుగుల్ మ్యాప్స్ ఆధారంగా అగ్రనాయకులు అందరూ ఒకే దగ్గర ఉండగా ఇజ్రాయిల్, యూఎస్ సంయుక్తంగా బంకర్ బ్లాస్టర్ బాంబర్స్ తో అటాక్ చేసినట్టు తెలుస్తుంది. అయితే శిథిలాల కింద ఖమేని మృత దేహాన్ని డీఎన్ఏ టెస్ట్ చేసి కన్ఫామ్ చేసింది. సొరంగం లోపల ఉన్నా.. ఈ బంకర్ బ్లస్టర్ బాంబ్స్ వల్ల కుడితితో పడిన ఎలుకలా మారి చివరకు కన్నుమూసాడు.

### ప్రతి దారిని మూసేసి

ఇరాన్ అధ్యక్షుడు ఏదైనా యుద్ధం సంభవిస్తే దాక్కునే బంకర్స్ ను ముందుగానే తమ నిఘా వర్గాలతో క్రాస్ చేయించుకొని ముందుగా వాటిపైనే ఎటాక్ చేసింది. ఖొమైనీ తప్పించుకోవడానికి అవకాశాలున్న ప్రతి దారిని మూసేసింది. అలా అష్ట దిగ్బంధనం చేసి పొగ పెట్టి మరి ఖమేని అంతం చేసినట్టు అంతర్జాతీయ రాజకీయ వ్యవహారాలను సంబంధించిన వాళ్లు చెబుతున్న మాట. అయితే ఇరాన్ పై యుద్ధం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా చమురు, బంగారం ధరలపై పెను ప్రభావం చూపించే అవకాశాలున్నాయి.

### జననం

అలీ ఖమేనీ జననం..1939 జూలై 16న ఇరాన్‌లోని మషాద్‌లో అయతుల్లా అలీ ఖమేనీ జన్మించారు. ఖమేనీకి ముగ్గురు సోదరులు, నలుగురు సోదరీమణులు ఉన్నారు. బాల్యం నుంచి ఖురాన్ చదువును ఆరంభించి.. చిన్నతనంలోనే మతపరమైన విద్యను (సెమినరీ) అభ్యసించా రు. అయతుల్లా రుహోల్లా ఖొమేనీకి శిష్యుడిగా మారిన తరువాత ఖమేనీ జీవితం మరో మలుపు తిరిగింది. . ఇస్లామిక్ తిరుగుబాటు నాయకుడు ఖొమైనీకి శిష్యుడిగా చేరి అంచలంచెలుగా ఎదిగారు. 1960ల నుండి పహ్లావీ రాజరికానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో పలుమార్లు జైలు జీవితం కూడా గడిపారు. 1960-70 సమయంలో ఇరాన్‌లో షా మహమ్మద్ రెజా పహ్లావీ (రాజు) పాలనకు వ్యతిరేకంగా భారీగా ప్రచారం చేశారు. అప్పట్లో ఆరుసార్లు జైలుకు వెళ్లి మళ్లీ విడుదలయ్యారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఖమేనీ కీలక పాత్ర పోషించారు. ఇరాన్ షా ప్రభుత్వాన్ని పడగొట్టడంలో ఖమేనీ ముఖ్యపాత్ర పోషించి.. తన గురువు ఖొమైనీ నాయకత్వంలో 1979లో ఇరాన్లో ఇస్లామిక్ రూల్ స్థాపించారు. 1980-88 మధ్య ఇరాక్‌తో ఎనిమిదేళ్ల యుద్ధం సాగినా ఇరాన్ పట్టును సడలనికుండా చూసుకున్నారు. మోజ్తబా ఖమేనీ . ఇరాన్-ఇరాక్ యుద్ధం చివరి దశలో రివల్యూషనరీ గార్డ్‌లో పనిచేశారు. తండ్రికి కుడిభుజంగా వ్యవహ రించారు. అనేక విషయాల్లో తెర వెనుక ఉండి చక్రం తిప్పారనే పేరుంది. పాలనపరంగా తీసుకునే పలు కీలక నిర్ణయాల్లో మొజ్తబా ఖమేనీ ప్రధాన పాత్ర పోషించినట్లు చెబుతారు. రివల్యూషనరీ గార్డ్ తర్వాత ఎప్పుడూ కూడా పెద్దగా తెరమీదికి రాలేదు.అలాగే ప్రభుత్వ పదవిలోనూ పని చేసిన అనుభవం ఆయనకు లేదు. అయినప్పటికీ- మోజ్తబా తన తండ్రికి విశ్వసనీయ సలహాదారుగా కొనసాగారు. సైన్యం, పారామిలిటరీ దళాల తో ఆయనకుమంచి సంబంధాలున్నాయని ఇరాన్ మీడియా చెబుతోంది.

## తదుపరి సుప్రీమ్‌గా మొజ్తబా ఖమేనీ



సుప్రీం లీడర్‌గా ఖమేని అంతరం ఎవరన్న చర్చ ఇరాన్‌లో ఆరంభమైంది. మారడంతో దేశంలో కొత్త రాజకీయ చర్చ అకు తెరదించుతూ 1979 విప్లవం వారసత్వ అధికారాన్ని వ్యతిరేకించిన వారు సైతం మౌనం వహి ంచేలా మోజ్తబా ఖమేనీని వారసుడిగా ఎంపిక కావటం , సైనిక మద్దతు ఆయనకు బలాన్ని అందిస్తుండటంతో, మోజ్తబా ఖమేనీని శక్తివంతమైన నాయకుడిగా పరిగణిస్తున్నారు. ఇరాన్ తదుపరి సుప్రీమ్ గా మొజ్తబా ఖమేనీ అపాయింట్ అయ్యారు. ఖమేనీ పెద్ద కుమారుడు మొజ్తాబా. ఆయన ఈ బాధ్యతలను స్వీకరించనున్నారు. అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఖాళీ అయిన దేశ నాయకత్వ పగ్గాలు మొజ్తాబా చేతికి అధికారికంగా అప్పగించినట్లు ఇరాన్ అధికారిక వెల్లడించింది.

### వారసుడిగా అధికారంలోకి

1979లో ఆస్తాన్ ఖుద్స రజవీ సర్వీసెస్ హెడ్‌గా అయ్యారు. డిఫెన్స్ వైస్ మినిస్టర్ పదవిని చేపట్టారు. 1980 తెహ్రాన్ ఫ్రైడే ప్రేయర్ ఇమామ్‌గా బాధ్యతలు చేపట్టారు. 1981లో ఇరాన్ అధ్యక్షుడి ఎన్నికై.. 1989 వరకు ఉన్నారు. 1981లో జరిగిన బాంబు దాడిలో ఖమేనీ కుడి చేయి తీవ్రంగా గాయపడగా.. గొంతు, ఊపిరి తిత్తులు దెబ్బ తిన్నాయి. 1989లో ఖొమేనీ మరణం అనంతరం రెండో సుప్రీ లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 వరకు ఖమేనీ నియంత పాలన కొనసాగింది. ఇరాన్‌లో అత్యధికారాలు కలిగిన వ్యక్తిగా.. సైన్యం, మీడియా, న్యాయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థలపై పూర్తి నియంత్రణ పరిపాలించారు. సుప్రీంలీడర్ హోదా కోసం రాజ్యాంగాన్ని మార్పించారు. అమెరికా సహా విదేశాల ఆంక్షలు, ఒత్తిళ్లు కొనసాగినా పట్టువీడలేదు. నిరసనలు చెలరేగితే నిర్దాక్షిణ్యంగా వాటిని అణచివేసేవారు. హెజ్బొల్లా, హౌతీ వంటి మిలిటెంట్ సంస్థలను పోషించి.. మిడిల్ ఈస్ట్‌ను శాసించారు.

### తృటిలో ప్రాణాపాయం తప్పించుకుని..

ఖమేనీ జీవితంలో 1981 నాటి హత్యాయత్నం ఒక కీలక మలుపు. నాటి దాడి లో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకు న్నప్పటికీ, ఆయన కుడి చేయి పాక్షికంగా పక్షవాతానికి గురైంది. అప్పటి నుండి ఆయన తన వైకల్యాన్ని కూడా ఒక శక్తిగా మార్చుకుని, దేశాన్ని నడిపించడంలో ముందున్నారు. 1989లో ఖొమేనీ మరణానం తరం ఇరాన్ 'అత్యున్నత నాయకుని'గా బాధ్యతలు చేపట్టి, మూడు దశాబ్దాలకు పైగా దేశ భవిష్యత్తును తన వేళ్లతో శాసించారు. సుప్రీం లీడర్‌గా, ఆయన ఇరాన్ పాలనా వ్యవస్థను మత గురువుల నేతృత్వంలో మరింత పటిష్టం చేశారు. హార్డ్‌లైన్ మద్దతుదారులు ఆయనను దేవుడి తర్వాత అంతటి శక్తివంతుడిగా భావించేవారు.

### సైన్యానికి అధికారాలు

రివల్యూషనరీ గార్డ్స్‌కు అపరిమిత అధికారాలు కట్టబెట్టి.. దేశ అంతర్గత, విదేశీ విధానాల్లో వారిని ప్రధాన శక్తిగా మార్చారు. ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్ వీరి నియంత్రణలోనే ఉంది. ఇరాన్‌ను సైనికంగా బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా షియా ముస్లింలకు నాయకుడిగా ఎదిగారు. పాలస్తీనాపై ఆయన వైఖరి సున్నీ ముస్లింల లోనూ ఆయనకు ప్రజాదరణ పెంచింది.

## అగ్రరాజ్యంతో అలుపెరుగని పోరాటం

అమెరికాతో ఖమేనీకి ఉన్న వైరానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ముఖ్యంగా 2015 నాటి అణు ఒప్పందం నుంచి 2018లో డొనాల్డ్ ట్రంప్ వైదొలగడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ట్రంప్ ఇరాన్ సుప్రీం ఖమేనీని అత్యంత క్రూరమైన వ్యక్తిగా, ఆయన వర్గాన్ని 'రక్తపిపాసి ముఠా'గా అభివర్ణించారు. అయితే ఖమేనీ ఏనాడూ అమెరికా ఒత్తిళ్లకు లొంగలేదు. ట్రంప్ ఆయన మరణాన్ని ధృవీకరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



## ఖమేనీ ఇంటిపై 30 బాంబులు

ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీతోపాటు ఆయన కుటుంబంలోని నలుగురు చనిపోయినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఆయన కూతురు, అల్లుడు, కోడలు, మనవడు చనిపోయినట్లు పేర్కొంది. ఈ జాయింట్ ఆపరేషన్‌లో ఖమేనీ ఇంటిపై 30 బాంబులు వదిలినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇజ్రాయెల్ కొన్ని నెలలుగా ప్లాన్ చేస్తోందని.. అగ్రనాయకులు అందరూ ఒకే దగ్గర ఉండగా అటాక్ చేసిందని వెల్లడించింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ చనిపోవడంతో ఆ దేశ పౌరులు సంబరాలు జరుపుకున్నారు. యుద్ధ వాతావరణాన్ని లెక్కచేయకుండా రోడ్లపైకి వచ్చి డాన్స్ చేస్తున్నారు. గతంలో పలు మార్లు ప్రభుత్వంపై ఇరాన్లో నిరసనలు చెలరేగడం వాటిని ఖమేనీ ప్రభుత్వం అణచివేసింది. కాగా.. పరిస్థితులు చక్కబడే వరకు ఇరాన్ దాడులు కొనసాగుతాయని ట్రంప్ వెల్లడించారు.

### ప్రాంతీయ శక్తిగా ఇరాన్ విస్తరణ

ఖమేనీ నాయకత్వంలో ఇరాన్ ప్రభావం దేశ సరిహద్దులు దాటింది. లెబనాన్, ఇరాక్, సిరియా, యెమెన్ వంటి దేశాల్లోని ఇరాన్ అనుకూల వర్గాలకు అండగా నిలుస్తూ, అమెరికా, ఇజ్రాయేల్‌లకు ఖమేనీ నిరంతరం సవాలు విసిరారు. ఆయన హయాంలోనే ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమం ప్రపంచ దేశాల దృష్టిని అమితంగా ఆకర్షించింది. ఇది అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది.



### ఉక్కుపాదంతో అంతర్గత అణచివేత

బాహ్య శత్రువులనే కాకుండా, అంతర్గతంగా తలెత్తిన అసమ్మతిని కూడా ఖమేనీ కఠినంగా ఎదుర్కొన్నారు. ఖమేనీ పాలనలో ఇరాన్ శక్తివంతమైన దేశంగా ఎదిగినప్పటికీ, అంతర్గత నిరసనలు ఆయన పాలనకు పెద్ద సవాలుగా మారాయి. 2009లో ఎన్నికల రిగ్గింగ్ ఆరోపణలతో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. నాటి 'గ్రీన్ మూవ్‌మెంట్' నిరసనలు, 2017, 2019లో ఆర్థిక ఆంక్షల వల్ల పెరిగిన ధరలపై నిరసనలు వెల్లువెత్తాయి. తీవ్ర తిరుగుబాట్లను ఆయన తన అధికార బలంతో పూర్తిగా అణచివేశారు. తనను తాను ఇరాన్ సార్వభౌమాధికార రక్షకుడిగా అభివర్ణించుకున్నప్పటికీ, ఆయన పాలనలో రాజకీయ స్వేచ్ఛ కరువైందన్న విమర్శలు సర్వత్రా వినిపించాయి. 2022లో యువతి మరణంతో చెలరేగిన హిజాబ్ వ్యతిరేక అల్లర్లను అణిచివేసే క్రమంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నియంతృత్వ పాలన నుండి తమను రక్షించాలని చాలా మంది ఇరాన్ వాసులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విజ్ఞప్తి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి

### 40 రోజుల సంతాప దినాలు

అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన సైనిక చర్యలో ఆయన హతమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ధారించారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్రూత్ సోషల్ లో పోస్ట్ చేశారు. ఖమేనీని అత్యంత దుర్మార్గుడైన నాయకుడిగా అభివర్ణించారు ట్రంప్. ఈ విషయాన్ని అటు ఇరాన్ కూడా అధికారికంగా ప్రకటించింది. 40 రోజుల సంతాప దినాలను పాటించాలని పిలుపునిచ్చింది.

వెంకటేశ్వర దాస్, సూర్య కల్చరల్ రిపోర్టర్,
విశాఖపట్నం - 99892 65111




# సెమీస్‌కు దూసుకెళ్లిన టీమ్‌ఇండియా

## 196 పరుగుల టార్గెట్ నిర్దేశించిన వెస్టిండీస్ - హై-వోల్టేజ్ పోరులో సంజూ తుఫాన్ ఇన్నింగ్స్..

## టార్గెట్‌ని 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించిన టీమ్ఇండియా

సెమీస్‌కు దూసుకెళ్లిన టీమ్ఇండియా

కోల్‌కతా: టీ20 ప్రపంచ కప్ 2026లో టీమ్‌ఇండియా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. వెస్టిండీస్‌తో జరిగిన ఆఖరి సూపర్-8 మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. వెస్టిండీస్ నిర్దేశించిన 196 పరుగుల టార్గెట్‌ని టీమ్‌ఇండియా 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సంజు శాంసన్ (97) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తిలక్ వర్మ (27), సూర్యకుమార్ యాదవ్ (18), హార్దిక్ పాండ్య (17), అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) పరుగులు చేశారు. వాంఖడేలో మార్చి 5న రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో భారత్ తలపడనుంది.

తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (40), జాసన్ హోల్డర్ (37), రోవ్‌మన్ పావెల్ (34), షై హోప్ (32), షిమ్రోన్ హెట్‌మయెర్ (27), షెర్ఫానె రూథర్‌ఫోర్డ్ (14) దూకుడుగానే బ్యాటింగ్ చేశారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 2.. హార్దిక్, వరుణ్ తలో వికెట్ తీశారు.

అంతకు ముందు టీ 20 వరల్డ్ కప్ లో భాగంగా సూపర్ 8 మ్యాచ్ లో భారత్‌కు 196 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది వెస్టిండీస్, ఇరు జట్లకు కీలకమైన మ్యాచ్ లో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దాంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ ఆది నుంచి బ్యాట్ ఝుళిపించింది. ఓపెనర్లు షాయ్ హోప్( 32: 33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రోస్టన్ ఛేజ్(40: 25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)లు చక్కటి ఆరంభాన్ని ఇచ్చారు. ఆ తరువాత హెట్ మెయిర్ ( 27: 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్ లు) చెలరేగి ఆడే యత్నం చేశాడు. విండీస్ స్కోరు బోర్డు వేగం పుంజుకునే క్రమంలో బూమ్రా బౌలింగ్ లో హెట్ మెయిర్ అవుటయ్యాడు. బూమ్రా బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు హెట్ మెయిర్. అప్పటికి విండీస్ స్కోరు 11.3 ఓవర్లలో 102 పరుగులుగా ఉంది. అయితే హెట్ మెయిర్ రెండో వికెట్‌గా ఔటైన తర్వాత విండీస్ స్కోరు బోర్డులో వేగం తగ్గింది. అయితే రావెన్ పావెల్(34 నాటౌట్; 19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాసన్ హోల్డర్(37 నాటౌట్; 22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు) లు ధాటిగా బ్యాటింగ్ చేశారు. ఈ జోడి కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. వీరిద్దరూ 35 బంతుల్లో 76 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేయడంతో విండీస్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. భారత బౌలర్లలో బూమ్రా రెండు వికెట్లు సాధించగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తిలకు తలో వికెట్ దక్కింది.

భారత బౌలర్లలో బుమ్రా మినహా ఎవరూ పెద్దగా ఆకట్టుకోలేదు. బుమ్రా నాలుగు ఓవర్లలో 36 పరుగులే ఇవ్వగా, హార్దిక్ పాండ్యా తన నాలుగు ఓవర్ల కోటాలో 40 పరుగులు, అర్షదీప్ 43 పరుగులు, వరుణ్ చక్రవర్తి 40 పరుగులు ఇచ్చారు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చాడు.

### చివరి 5 ఓవర్లలో వెస్టిండీస్ 70 పరుగులు..

ఒకానొక సమయంలో కరేబియన్ జట్టు స్కోరు 15 ఓవర్లలో 125/4. చివరి 5 ఓవర్లలో జట్టు 70 పరుగులు చేసింది. రోవ్‌మన్ పావెల్, జాసన్ హోల్డర్ 5వ వికెట్‌కు 35 బంతుల్లో అజేయంగా 76 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు.



కెప్టెన్ షాయ్ హోప్, రోస్టన్ చేజ్ 53 బంతుల్లో 68 పరుగులు జోడించారు.




ఇరుజట్ల ప్లేయింగ్ 11 ఇదే..

భారత్ (ప్లేయింగ్ ): సంజు శాంసన్(కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చకరవర్తి, జస్ప్రీత్ బుమ్రా. వెస్టిండీస్ (ప్లేయింగ్ ): షాయ్ హోప్(కీపర్/కెప్టెన్), రోస్టన్ చేజ్, షిమ్రాన్ హెట్మెయర్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్, జాసన్ హోల్డర్, మాథ్యూ ఫోర్డే, అకేల్ హోసేన్, గుడాకేష్ మోటీ, షమర్ జోసెఫ్.

### పావెల్ అరుదైన ఘనత

ఈ మ్యాచ్‌లో రెండు సిక్సర్లు కొట్టడం ద్వారా రోవ్‌మాన్ పావెల్ అరుదైన ఘనతను సాధించాడు. విండీస్ తరుపున టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. పావెల్ టీ20ల్లో 150 సిక్సర్లు మార్కును చేరుకోవడంతో విండిస్ తరుపున ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో నికోలస్ పూరన్ 149 సిక్సర్లు కొట్టిన జాబితాలో ఉండగా, వెవిన్ లూయిస్ 136 సిక్సర్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఇక క్రిస్ గేల్ 124 సిక్సర్లతో నాల్గో స్థానంలో కొనసాగుతున్నాడు.పొలార్డ్, హెట్‌మెయిర్‌లు 99 సిక్సర్లతో ఆ తర్వాత స్థానంలో ఉన్నారు

### నిరాశపరిచిన అభిషేక్, ఇషాన్

భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమమ్రా రెండు వికెట్లు తీయగా.. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇక లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (11 బంతుల్లో 10) స్వల్ప స్కోరుకే వెనుదిరగగా.. వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (6 బంతుల్లో 10) సైతం నిరాశపరిచాడు.

### సంజూ బాధ్యతాయుత ఇన్నింగ్స్

కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 18) చేతులెత్తేయగా.. తిలక్ వర్మ (15 బంతులలో 27) వేగంగా ఆడే క్రమంలో అవుటయ్యాడు. ఇలాంటి దశలో ఓపెనర్ సంజూ శాంసన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో స్కోరు బోర్డును ముందుకు నడిపాడు.

అయితే విజయానికి 10 బంతులలో 17 పరుగులు అవసరమైన వేళ హార్దిక్ పాండ్యా (14 బంతులలో 17) రూపంలో భారత్ ఐదో వికెట్ కోల్పోయింది. ఈ క్రమంలో శివం దూబే సంజూకు జతయ్యాడు. దూబే 4 బంతులలో 8 పరుగులు చేయగా.. సంజూ ఆఖరి ఓవర్లో సిక్సర్, ఫోర్ బాది టీమిండియాను విజయతీరాలకు చేర్చాడు.

### సెంచరీకి మూడు పరుగుల దూరంలో

ఈ మ్యాచ్‌లో సంజూ మొత్తంగా 50 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 97 పరుగులతో అజేయంగా నిలిచాడు. సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచిపోయినా చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయం అందించాడు. ఇక మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా ఐదు వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది..

### హై-వోల్టేజ్ పోరులో సంజూ తుఫాన్ ఇన్నింగ్స్..

టీ20 వరల్డ్ కప్ 2026లో సెమీఫైనల్ రేసును నిర్ణయించే కీలక మ్యాచ్‌లో సంజూ సామ్సన్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌పై జరిగిన ఈ హై-వోల్టేజ్ పోరులో సంజూ తన తొలి అర్ధశతకాన్ని నమోదు చేశాడు. వర్చువల్ క్వార్టర్ ఫైనల్‌గా భావించిన ఈ మ్యాచ్‌లో ఒత్తిడి మధ్య సంజూ అత్యంత ధైర్యంగా బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లే నుంచే దూకుడుగా ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ముఖ్యంగా స్పిన్ బౌలర్లపై అతని అటాకింగ్ షాట్లు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.




# టీ20 ప్రపంచకప్ నుంచి పాక్ ఔట్

## బాబర్‌తో పాటు కెప్టెన్‌కు దిమ్మతిరిగే షాకిచ్చిన పీసీబీ?




టీ20 వరల్డ్ కప్ 2026 ముగిసిన వెంటనే పాకిస్థాన్ టీ20 జట్టులో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశ మున్నట్లు నివేదికలు సూచిస్తు న్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు () టీ20 కెప్టెన్ సల్మాన్ అలీ ఆగాను పదవి నుంచి తప్పించే అవకాశముందని సమాచారం. పాక్ జట్టు సెమీస్ చేరకుండానే ఇంటి బాట పట్టింది. దీంతో ఈ నిర్ణయం అమలవుతుందని తెలుస్తోంది. అలాగే, కొంతమం ది సీనియర్ ఆటగాళ్లు కూడా తమ చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్న పరిస్థితి ఉండొచ్చని రిపోర్టులు చెబుతున్నాయి.

**నక్వీ అసంతృప్తి..**

పీటీఐ నివేదిక ప్రకారం, పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ టీ20 వరల్డ్ కప్ ప్రచారంపై సంతృప్తిగా లేరట. సెలెక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్, బోర్డు అధికారులు జట్టు బాగా సిద్ధమైందని హామీ ఇచ్చారని, కానీ ఫలితాలు ఆశించిన విధంగా రాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో సల్మాన్ అలీ ఆగాను టీ20 కెప్టెన్సీ నుంచి తప్పించాలనే నిర్ణయానికి నక్వీ వచ్చినట్లు తెలుస్తోంది.

**బాబర్ ఆజమ్ భవిష్యత్తుపై నీలిమేఘాలు..?**

సల్మాన్‌తో పాటు బాబర్ ఆజమ్, ఉస్మాన్ ఖాన్ వంటి కొంతమంది సీనియర్ ఆటగాళ్ల టీ20 అంతర్జాతీయ కెరీర్ కూడా ముగింపు దశకు చేరే అవకాశముందని సమాచారం. 145 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన బాబర్ ఆజమ్ భవిష్యత్తు కూడా అంధకారంలో పడింది. ఇప్పటికే శ్రీలంకతో జరిగిన చివరి గ్రూప్ పోరు నుంచి ఈ దిగ్గజ ఆటగాడిని తప్పించిన సంగతి తెలిసిందే. దీంతో బాబర్ టీ20 కెరీర్ ముగిసే అవకాశముంది.

**భవిష్యత్ కెప్టెన్ ఎవరు?**

పాకిస్థాన్ కొత్త కెప్టెన్‌గా షాదాబ్ ఖాన్, షాహీన్ షా అఫ్రిది పేర్లు వినిపిస్తున్నాయి. ఆధునిక టీ20 క్రికెట్ అవసరాలకు సరిపోయే యువ జట్టును నిర్మించాలనే ఆలోచనలో కోచ్ మైక్ హెసన్ ముందుగానే బోర్డుతో చర్చించినట్లు సమాచారం. టోర్నమెంట్ తర్వాత పాకిస్థాన్ టీ20 సెటప్‌లో పెద్ద మార్పులు తప్పవని అంచనా. మొత్తానికి, టీ20 వరల్డ్ కప్ 2026 తర్వాత పాకిస్థాన్ జట్టులో కొత్త దశ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సల్మాన్ ఆగా కెప్టెన్సీ ముగింపు, బాబర్ ఆజమ్ భవిష్యత్తు, యువతకు అవకాశాలు.. ఇవన్నీ రాబోయే రోజుల్లో స్పష్టమవుతాయి.

# టీ20 వరల్డ్ కప్ నుంచి శ్రీలంక ఔట్

## కోచ్ పదవి నుంచి వైదొలగిన జయసూర్య




సొంతగడ్డపై జరుగుతున్న టీ20 వరల్డ్కప్‌లో శ్రీలంక సెమీఫైనల్‌కు చేరకుండానే ఇంటిబాట పట్టింది. ఈ క్రమంలో ఆ జట్టు హెడ్‌కోచ్, మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తాను కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశాడు. అయితే జయసూర్య పదవీకాలం ఈ ఏడాది జూన్ దాకా ఉంది. శ్రీలంక జట్టుకు కోచ్‌గా నా కాంట్రాక్ట్ 2026 జూన్ వరకు ఉంది. అయినప్పటికీ ఈ పదవిలో కొనసాగే ఉద్దేశం నాకు లేదు. జట్టు బాధ్యతలను ఇంకొకరికి అప్పగించాల్సిన సమయం వచ్చిందని నేను భావిస్తున్నా అని పాకిస్థాన్‌తో మ్యాచ్ అనంతరం జయసూర్య వెల్లడించాడు. అయితే తక్షణమే సూర్య జట్టుకు దూరమయ్యే అవకాశం లేదు. అఫ్గానిస్థాన్‌తో మార్చి రెండో వారంలో శ్రీలంక టీ20, వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. దుబాయ్ వేదికగా ఈ సిరీస్ జరగనుంది. అయితే ఈ సిరీస్‌కు మాత్రం జయసూర్య లంక జట్టుతో ఉండనున్నట్లు తెలుస్తోంది.

**వరల్డ్కప్‌లో ఫెయిల్**

2024 టీ20 ప్రపంచకప్ అనంతరం జయసూర్య శ్రీలంక క్రికెట్ జట్టుగా హెడ్ కోచ్‌గా ఎంపికైయ్యాడు. అతడి కోచింగ్ పీరియడ్‌లో శ్రీలంక పాత వైభవం అందుకుందని చెప్పవచ్చు. దాదాపు రెండేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడగా రాణించింది. సొంతగడ్డపై 2024 ఆగస్టులో టీమ్‌ఇండియాపై వన్డే సిరీస్ గెలిచింది. భారత్‌పై వన్డే సిరీస్‌లో 27 ఏళ్ల తర్వాత లంక విజయం సాధించింది.

ఆ తర్వాత ఓవల్ వేదికగా ఇంగ్లాండ్‌పై టెస్టు గెలుపు, న్యూజిలాండ్‌ను క్లీన్ స్వీప్ చేయడం వంటి అద్భుతం విజయాలు అందుకుంది. ఇక భారీ అంచనాలతో సొంతగడ్డపై జరుగుతున్న టీ20 వరల్డ్కప్‌లో అడుగుపెట్టింది. అందుకు తగ్గట్లే గ్రూప్ స్టేజ్‌లో హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఇందులో ఆస్ట్రేలియాపై గెలుపు తమ ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. ఇక జింబాబ్వేతో ఓడినా, సూపర్ 8కు అర్హత సాధించింది.

అయితే కీలకమైన దశలోనే లంక తడబాటుకు గురైంది. సూపర్ 8లో తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై అనూహ్య ఓటమి ఎదుర్కొంది. ఆ తర్వాత న్యూజిలాండ్‌పై భారీ తేడాతో ఓడి, ఇంకో మ్యాచ్ ఉండగానే సెమీస్ రేస్ నుంచి తప్పుకుంది. ఇక పాకిస్థాన్‌తో చివరి మ్యాచ్‌లోనైనా నెగ్గి పరువు కాపాడుకోవాలని భావిస్తే, గెలుపు అంచులదాకా వచ్చి ఓడింది. ఈ మ్యాచ్‌లో 5 పరుగుల తేడాతో లంక ఓడింది. అయితే కీలకమైన సూపర్ 8 దశలో లంక ప్రదర్శన ఆదేశ అభిమానులకు ఆశ్చర్యానికి గురిచేసింది.

# ప్లేయర్లు కాదు.. సెలక్టర్లే అసలు విలన్లు!

టీ20 ప్రపంచ కప్ 2026లో పాకిస్థాన్ ప్రయాణం సూపర్-8 దశతోనే ముగిసింది. శ్రీలంకతో జరిగిన చివరి మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ.. నెట్ రన్ రేట్ విషయంలో న్యూజిలాండ్‌ను అధిగమించలేక పాకిస్థాన్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే ఈ ఘోర వైఫల్యానికి ఆటగాళ్ల ప్రదర్శన కంటే.. సెలక్టర్ల అనాలోచిత నిర్ణయాలే ప్రధాన కారణమని క్రీడా విశ్లేషకులు మండిపడుతున్నారు.

### మిడిలార్డర్ లేని జట్టు.. ఎలా గెలుస్తుంది?

పాకిస్థాన్ 15 మంది సభ్యుల జట్టును పరిశీలిస్తే.. అందులో ఒక్కడంటే ఒక్కడు కూడా సరైన మిడిలార్డర్ బ్యాటర్ లేకపోవడం గమనార్హం. జట్టులోని ఏడుగురు ప్రధాన బ్యాటర్లు (బాబర్ ఆజం, ఫఖర్ జమాన్, సాహిబ్జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, ఉస్మాన్ ఖాన్, ఖవాజా నఫీ) అందరూ టాపార్డర్ లేదా ఓపెనర్లే. దేశవాళీ క్రికెట్, టీ20 లీగ్‌లలో ఓపెనింగ్ చేసే ఆటగాళ్లను తీసుకొచ్చి, బలవంతంగా నంబర్ 4, 5 స్థానాల్లో ఆడించడం సెలక్టర్ల వైఫల్యానికి నిదర్శనం.

### ఫినిషర్లు ఎక్కడ?

టాపార్డర్ తర్వాత జట్టులో ఉన్నది కేవలం లోయర్ ఆర్డర్ ఆల్‌రౌండర్లు మాత్రమే. షాదాబ్ ఖాన్, మహమ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రఫ్ వంటి వారు నిలకడగా రాణించే ఫినిషర్లు కాదు. షాదాబ్ కొన్నిసార్లు మెరుపులు మెరిపించినా.. కీలక సమయంలో జట్టును గెలిపించే నమ్మకమైన మిడిలార్డర్ బ్యాటర్ పాక్ జట్టులో లేదు. సరైన ఫినిషర్ లేకపోవడం వల్లే పాకిస్థాన్ భారీ స్కోర్లు చేయలేకపోతోంది.

### శ్రీలంక మ్యాచ్‌తో బట్టబయలైన బలహీనత

శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ బలహీనత స్పష్టంగా కనిపించింది. ఓపెనర్లు అద్భుతంగా ఆడి 15.5 ఓవర్లలోనే 176 పరుగులు జోడించారు. ఆ సమయంలో పాక్ కనీసం 230 పరుగులు చేస్తుందని అందరూ భావించారు. కానీ మిడిలార్డర్ వైఫల్యంతో ఆఖరి 25 బంతుల్లో కేవలం 36 పరుగులు మాత్రమే చేసి 7 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు ఇద్దరు తప్ప మిగతా బ్యాటర్లలో ఎవరూ కనీసం రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు.




ఇదే తరహా పరిస్థితి 2025 ఆసియా కప్ ఫైనల్లో కూడా ఎదురైంది. అప్పుడు కూడా 84 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిన పాక్.. ఆ తర్వాత కేవలం 146 పరుగులకే కుప్పకూలింది. సెలక్టర్లు ఇప్పటికైనా మేల్కొని జట్టులో సమతుల్యత ఉండేలా చూడాలని అభిమానులు కోరుతున్నారు.



# ఎయిర్‌పోర్ట్‌పై దాడి

## భయం భయంగా ఉంది

## దుబాయ్‌లో చిక్కుకుపోయిన పీవీ సింధు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు రద్దు కావడంతో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుబాయ్‌లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. తాజాగా అక్కడి పరిస్థితులపై ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తాము ఉన్న ప్రాంతానికి అతి సమీపంలోనే పేలుడు సంభవించిందని.. ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశామని పేర్కొన్నారు.

“ఇక్కడి పరిస్థితులు గంట గంటకూ భయానకంగా మారుతున్నాయి. కొన్ని గంటల క్రితం విమానాశ్రయంలో మేము చిక్కుకున్న ప్రదేశానికి దగ్గరగా పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. నా కోచ్‌తో సహా అందరం భయంతో అక్కడినుంచి పరుగులు తీశాం. అది మా అందరికీ భయానక క్షణం” అని ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం తామంతా క్షేమంగానే ఉన్నామని తెలిపారు. ఎయిర్‌పోర్టులోని సిబ్బంది, అధికారులు తమను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు వెల్లడించారు.

తమ భద్రతకు చర్యలు తీసుకుంటున్న ఇక్కడి అధికారులతో పాటు దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బందికి సింధు ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ క్రమంలో దుబాయ్‌లోని ఓ విమానాశ్రయం దెబ్బతింది

సూర్య
www.suryaa.com
సినిమా

# హీరోయిన్లే అసలు విలన్లా

సినిమా ఫీల్డ్ లో ఎప్పుడు ఏది ట్రెండిగా మారుతుందో చెప్పలేము. దాన్నే కొంతమంది సెంటిమెంట్‌గా కూడా చెబుతారు. ప్రస్తుతం తెలుగు సినిమాల ధోరణి చూస్తుంటే హీరోయినే సినిమాకి మెయిన్ విలన్ అన్నట్టుగా కొన్ని మూవీస్ రిలీజ్ అవుతున్నాయి. ఇంతకు ముందు హీరోయిన్‌ను విలన్ గా చూపించాలి అంటే కచ్చితంగా సినిమాలో రెండో హీరోయిన్ ఉండేది. రజనీకాంత్ నరసింహని దీనికి బెస్ట్ ఎగ్జాంపుల్ గా చెప్పుకోవచ్చు. అయితే ఇప్పుడు అలాంటి రెండో హీరోయిన్ ప్రసక్తే లేకుండా డైరెక్ట్ గా మెయిన్ హీరోయిన్ నే విలన్ చేసేస్తున్నారు మన దర్శక రచయితలు. అలాంటి కొన్ని సినిమాల ఉదాహరణలు ఇక్కడ చూద్దాం.

**ఆర్ఎక్స్ 100- పాయల్ రాజ్ పుత్ (2018)**

హీరోయిన్లను విలన్ గా మార్చే రెండు పీక్ కి వెళ్లింది ఆర్ఎక్స్ 100తోనే అని చెప్పాలి. జస్ట్ తన కోరికలు తీర్చుకోవడం కోసం ప్రేమ పేరుతో శివ (కార్తికేయ)ని వాడుకుని చివరకు వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడమే కాకుండా హీరోని చంపించేసే కన్నింగ్ హీరోయిన్ గా ఇందు పాత్రలో పాయల్ రాజ్ పుత్ ని చూసి ప్రేక్షకులు షాక్ తిన్నారు. అంతవరకు టాలీవుడ్ లో అలాంటి హీరోయిన్ పాత్రను ఎవరూ ఊహించలేదు. శివ పాత్రలోని నిజాయితీతో కనెక్ట్ అయిన ప్రేక్షకులు ఆ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ఈ సినిమా నుండి మెయిన్ హీరోయిన్ ని విలన్ గా మార్చేసే కొత్తవిలన్ గా మార్చేసే కొత్తరకం కథలను టాలీవుడ్ లో వండడం మొదలుపెట్టారు మేకర్స్.

**విరూపాక్ష - సంయుక్త మీనన్ (2023)**

అంత వరకూ భీమ్లా నాయక్, బింబిసార, సార్ లాంటి సినిమాల్లో సాత్విక పాత్రల్లో కనిపించిన సంయుక్త ఒక్కసారిగా తన తల్లిదండ్రుల చావుకు కారణమైన ఊరి ప్రజలను సర్వనాశనం చేసే మంత్రగత్తె నందిని పాత్రలో విరూపాక్షలో కనిపించి ఆడియన్స్ కు పెద్ద ట్విస్ట్ నే ఇచ్చింది. రిలీజ్ వరకూ హీరో సాయి దుర్గా తేజ్ సెంట్రిక్ మూవీ అనుకున్న ప్రేక్షకులకు ఈ సినిమాలో అసలు షాక్ ఇచ్చింది హీరోయిన్ సంయుక్తనే. సినిమా సూపర్ హిట్ కావడంలో హీరోయిన్ క్యారెక్టర్ పండించిన విలనీనే అసలు కారణం.

**కింగ్ డమ్ - భాగ్య శ్రీ (2025)**

సినిమా అనుకున్నంత సక్సెస్ కాకపోవడంతో చాలా మంది నోటీస్ చేయని ఒక విలనీ పాత్ర కింగ్ డమ్‌లో ఉంది. అదే డా. మధు పాత్రలో కనిపించిన భాగ్య శ్రీ. సినిమాలో తన అన్న శివ (సత్య దేవ్ )ను వెతుక్కుంటూ వచ్చిన సూరి (విజయ్ దేవర కొండ)కు అతని అన్నను చంపేస్తారని తెలిసినా ఆ విషయం అతనికి చెప్పకుండా దాచేసే ఒక విధమైన నెగిటివ్ క్యారెక్టర్లో భాగ్య శ్రీ కనిపిస్తారు. సినిమా అనుకున్నంత హిట్ కాకపోవడంతో భాగ్యశ్రీ పాత్రలోని ట్విస్ట్ కూడా అంతగా పాపులర్ కాలేదు.



**రచితా రామ్ - కూలీ (2025)**

సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాలో లేడీ విలన్ అంటే టక్కున గుర్తు వచ్చేది నరసింహలోని నీలాంబరి క్యారెక్టర్. కానీ ఆ పాత్రకు ఒక ఆరా ఉంటుంది. కానీ అదే రజనీకాంత్ సినిమా కూలీలో డబ్బు కోసం ద్రోహమే కాకుండా హత్యలు సైతం చేసే క్రూరమైన విలనీ పాత్రలో హీరోయిన్ రచితా రామ్ కనిపించారు. సినిమాలో మరో హీరోయిన్ శృతి హాసన్ ఉన్నప్పటికీ కథలోని అన్ని ట్విస్ట్ లకూ రచిత పోషించిన కళ్యాణి పాత్రనే కారణం అవుతుంది. ఏ సినిమా కూడా అనుకున్న రేంజ్ హిట్ కాకపోయినా రచిత, ఆమె భర్త పాత్ర పోషించిన షౌబిన్ లకు మాత్రం చాలా పేరు వచ్చింది.

**కాంతారా చాప్టర్ 1 - రుక్మిణీ వసంత్ (2025)**

ఈ ఏడాది అతిపెద్ద పాన్ ఇండియా హిట్ అయిన కాంతారా 1లో హీరో రిషబ్ శెట్టికి ఎంత పేరు వచ్చిందో అంతే పేరు హీరోయిన్ లా కనిపిస్తూ చివర్లో విలన్ గా ట్విస్ట్ ఇచ్చే యువరాణి కనకావతి పాత్ర పోషించిన రుక్మిణి వసంత్ కీ వచ్చింది. ఒకవైపు ముగ్ధ మనోహరంగానే కనిపిస్తూ మరొక వైపు దుష్ట త్వాన్ని చూపే పాత్రలో రుక్మిణి నటన పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఎంతెలా అంటే ఓవర్ నైట్ లో న్యూ నేషనల్ క్రష్‌గా రుక్మిణికి కొత్త క్రేజ్ వచ్చేసేంతగా. ప్రస్తుతం ఈ సినిమా జాతీయ స్థాయిలో రికార్డులు కొల్లగొడుతోంది. ఒక్క 2025లోనే మూడు పెద్ద సినిమాల్లో హీరోయిన్లు విలన్లుగా కొత్త పాత్రాల్లో కనిపించారు. కింగ్ డమ్‌లో భాగ్య శ్రీ, కూలీలో రచితా రామ్, కాంతారా 1లో రుక్మిణి వసంత్ లు ఇలా హీరోయిన్ పాత్రకు కొత్త డైమన్షన్ తెచ్చారు. మరి రానున్న రోజుల్లో ఇంకెన్ని సినిమాల్లో హీరోయిన్లే విలన్లుగా దర్శనం ఇస్తారో చూడాలి.

**వీటన్నిటికీ మూలం ఆ సినిమానే.. హీరోయిన్ మన తెలుగమ్మాయే**

అయితే ఇలా హీరోయిన్ పాత్రే విలన్ గా ట్విస్ట్ ఇచ్చే కథనం మొదలైంది 2008లో వచ్చిన సుబ్రహ్మణ్యపురం సినిమాతోనే. ఆ సినిమాలో హీరోయిన్ గా కలర్స్ స్వాతి నటించింది. తను ప్రేమించిన వ్యక్తి (జై )నే కుటుంబ కలహాల నేపథ్యంలో చంపించేయడానికి సాయపడే తులసి పాత్రలో స్వాతి అప్పట్లోనే ప్రేక్షకులకు షాక్ ఇచ్చింది. ఈ సినిమా తెలుగులో అనంతపురం 1980 పేరుతో డబ్ చేస్తే ఇక్కడా బాగానే ఆడింది. ముఖ్యంగా ఈ సినిమాలోని కొంటెచూపుతో... నీకొంటె చూపుతో... సాంగ్ ఆల్ టైమ్ సూపర్ హిట్ గా నిలిచింది. ఈ పాట చూసి మైమరచి పోయే ఇప్పటి ప్రేక్షకులు ఆ పాటలో కనిపించే హీరోనే స్వాతి పాత్ర చంపించేస్తుంది అని తెలియగానే షాక్ తింటారు. అప్పుడు మొదలైన ఈ ట్రెండ్ ప్రస్తుతం పీక్ కు వెళ్ళిపోయింది.





# 'సరస్వతి' సోషల్ మెసేజ్ ఉన్న ఎంగేజింగ్ ఎంటర్‌టైనర్



వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రంసరస్వతి. హై-కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోయిన్ డైరెక్టర్, వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ..ఈ వేడుకకి విచ్చేసిన పెద్దలు, అతిథులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు. తమన్ గారు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా నటీనటులు లేకపోతే సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ప్రకాష్ రాజ్ గారు, ప్రియమణి గారు నా విజన్ ని మరో స్థాయికి తీసుకువెళ్లారు. తమ పాత్రలకు ప్రాణం పోశారు. ఇందులో ప్రతి పాత్ర కూడా చాలా అర్థవంతంగా ఉంటుంది. పూజ ఈ సినిమాని చాలా కంట్రోల్ గా చేసింది. ఈ సినిమాతో మా నాన్నగారి ని గర్వపడేలా చేస్తానని నమ్ముతున్నాను. రాధిక గారి సపోర్ట్ ని మర్చిపోలేను. ఫ్యామిలీ అందరికీ థాంక్యు. మా ఆయన నిక్ సపోర్ట్ తోనే ఈ జర్నీ స్టార్ట్ అయ్యింది అన్నారు.

# ఫాంటసీ కామెడీ డ్రామా రాకాస టీజర్



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ నే 'రాకాస'. దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన ఈ ఇంట్రెస్టింగ్ ఫన్ కం హారర్ థ్రిల్లర్ నుంచి మేకర్స్ ఇప్పుడు టీజర్ ని విడుదల చేశారు. ఇక ఈ టీజర్ మాత్రం ఒక స్యూర్ షాట్ ఫన్ హారర్ థ్రిల్లర్ ని ప్రామిస్ చేస్తుంది. ఒక ఊరిలో సీరియస్ నోట్ తో మొదలైన ఈ టీజర్ లో కంటెంట్ తో ప్రొడక్షన్ వాల్యూస్ కూడా ఆశ్చర్యపరిచే రీతిలో ఉన్నాయని చెప్పవచ్చు. సెట్ వర్క్స్ కానీ విజువల్స్ ఎఫెక్ట్స్ ఇందులో మరింత ఇంప్రెస్ చేస్తున్నాయి. ఇక వీటితో పాటుగా సంగీత్ శోభన్ ఎంటర్ అయ్యాక ఫన్ మోడ్ లోకి టీజర్ మారడం మంచి హారర్ ఎలిమెంట్స్ తో పాటుగా సూపర్ ఫన్ ని కూడా అందిస్తుంది అని అర్థం అవుతుంది. అలాగే తర్వాత రెండూ మిక్స్ చేసిన హారర్ కామెడీతో మరో ప్రామిసింగ్ సినిమా మన టాలీవుడ్ నుంచి రాబోతుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా నిహారిక కొణిదెల మరియు జీ స్టూడియోస్ వారు ఈ సినిమాని నిర్మాణం వహించారు. 'కమిటీ కుర్రోళ్ళు' తర్వాత నిహారిక తన బ్యానర్ లో మరో హిట్ కొట్టేలానే కనిపిస్తుంది. ఇక ఈ కామెడీ థ్రిల్లర్ ఈ ఏప్రిల్ 3న థియేటర్స్ లో రిలీజ్ కి రాబోతుంది.

## పెద్ది డబ్బింగ్ ప్రారంభించిన మెగా పవర్ స్టార్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా ప్రాజెక్ట్ పెద్ది సినిమా వేసవిలో గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు భారీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్ తో రికార్డులను బద్దలు కొట్టాయి. తాజాగా రామ్ చరణ్ పెద్ది డబ్బింగ్ ప్రారంభించారు. పెద్ది పాత్రలో చరణ్ చెప్పిన ఏమది డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. వీడియోలో బుచ్చి.. చికిరి పాటలో మోహిత్ చౌహాన్ వాయిస్ కి నువ్వు ఎంత యాక్టింగ్ చేశావంటే.. నువ్వు పాడావా ఆయన పాడాడా? అనే డౌట్ వచ్చిందయ్యా.. నాకు డబ్బింగ్ లో కూడా అలా యాక్టింగ్ చేయమని చెప్పకు. డబ్బింగ్ నేనే చెప్పానండి అని బుచ్చిబాబుతో చరణ్ చెప్పడం నవ్వులు పూయించింది. ఈ వీడియో ప్రస్తుతం షోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పెద్ది సెకండ్ సింగిల్ రై రై రారా మార్చి 2న రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## సంబరాల ఏటిగట్టు భారీ క్లైమాక్స్ షూటింగ్



మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్-ఇండియా స్పెక్టికల్ సంబరాల ఏటిగట్టుతో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీం ప్రస్తుతం భారీ, హై-ఆక్టేన్ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. మేకర్స్ క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా 20 కోట్లకు పైగా కేటాయించారు. 35 రోజుల షెడ్యూల్ జరుగుతోంది, ఇందులో 18 భారీ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ కెవిన్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. యుద్ధభూమిని తలపించేలా రూపొందించిన క్లైమాక్స్ మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధం గుర్తు చేసేలా ఉండబోతుంది. ప్రేక్షకులకు రా, ఇమర్సివ్, విజువల్‌గా గ్రాండియర్ అనుభూతిని అందించేలా ఈ క్లైమాక్స్‌ను మలిచారు. సాయి దుర్గా తేజ్ ఈ చిత్రానికి పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇంటెన్స్, ఫియర్స్ మేకోవర్‌తో పాటు ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాల కోసం హై-రిస్క్ స్టంట్స్‌ను స్వయంగా చేస్తూ, తన కెరీర్‌లో ఇప్పటివరకు మోస్ట్ ఛాలెంజింగ్ గా నిలిచిన పాత్రలో కనిపించబోతున్నారు.

## మాస్ ఎంటర్‌టైనింగ్ ట్రైలర్ 'మెన్షన్ హౌస్ మల్లేష్'



శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయి న్స్. కనక మేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై ఈ సినిమా ఫస్ట్ సింగిల్, ఫస్ట్ సింగిల్, టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మెన్షన్ హౌస్ మల్లేష్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. మురళీధర్ గౌడ్ అదొక పెద్ద కథ అని చెప్పడంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. మల్లేష్ క్యారెక్టరైజేషన్, పెళ్లి చూపులు, పెళ్లి తర్వాత జరిగిన సంఘటనలు.. అన్నీ మంచి వినోదాన్ని పంచాయి. డాక్టర్ బ్రాండ్ పేరు అడిగితే జై బాలయ్య అని చెప్పడం మాస్ కి మరింత కనెక్ట్ అయ్యింది. శ్రీనాథ్ మాగంటి మల్లేశ్ పాత్రలో ఒదిగిపోయారు. తను బాడీలాంజ్వేజ్, డైలాగ్ డెలివరీ, ఎమోషన్స్, పెర్ఫార్మెన్స్ అద్భుతంగా వున్నాయి. గాయత్రి రమణ పాత్ర కూడా ఎమోషన్ ని యాడ్ చేసింది. మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి పాత్రలు మంచి వినోదాన్ని పంచాయి. డైరెక్టర్ బాల సతీష్ అందరికీ కనెక్ట్ అయ్యే కథని అద్భుతంగా తీర్చిదిద్దారు. సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం ప్రతి సీన్ ని ఎలివేట్ చేసింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044